ఏప్రిల్
2024

సంపుటి : 19 సంచిక : 11

216

వెల రు. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

ఈ సంచికలో ........

నయా - వలసవాదానికి రైతుల ప్రతిఘటన
సాంస్కృతిక రంగంలో ఇఎంఎస్ కృషి
టియు కార్యకర్తలు నేర్వదగ్గ పాఠం "రీటా నేర్చిన పాఠం"
తొలి మధ్య యుగాలలో తూర్పు భారత దేశం
అరాచక ద్రవ్య పెట్టుబడి - అవినీతి సంస్కృతి
డాలరుపై తిరుగుబాటు
ఎన్నికల ముందు ప్రతిపక్షాలపై దాడులు
ప్రపంచపు తొలి ప్రకృతి శాస్త్రవేత్త 'ఉద్దాలకుడు'

చరిత్ర

# ప్రపంచపు తొలి ప్రకృతి శాస్త్రవేత్త

# 'ఉద్దాలకుడు'

ఎంవిఎస్ శర్మ

సైన్సు, తత్వ శాస్త్రం-వీటి చరిత్ర కారులు సాధారణంగా గ్రీకు పండితుడు థేల్స్‌ను ప్రపంచపు తొలి తత్వవేత్తగా, ప్రకృతి శాస్త్రవేత్తగా పేర్కొంటారు. కానీ అతడికంటే చాలా ముందే భారతదేశంలో విశ్వాన్ని, మానవజాతిని వస్తుగతంగా, ఉన్నవి ఉన్నట్టుగా అర్థం చేసుకునే పద్ధతిని అనుసరించిన ఒక వ్యక్తి ఉన్నాడు. ప్రయోగాలకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలను అతడే రూపొందించాడు. అయితే ఆధిపత్యవర్గాలు, వాటికి వత్తాసుగా పని చేసే తత్వవేత్తలు అతడి భావాలను కలగాపులగంగా వక్రీకరించి అతడి నిజమైన భావాలను ప్రజలు గ్రహించకుండా అడ్డుపడ్డారు.

అతడి పేరు ఉద్దాలక అరుణి. అతడి తెగ 'గౌతమ' పేరుతో అతడిని గౌతముడు అని కూడా కొన్ని చోట్ల ప్రస్తావిస్తారు. సైన్సుకు సంబంధించిన చరిత్రలో ఎక్కడా ఇతడి పేరు కనిపించదు. అంతే కాదు, వేదాంత దర్శనానికి పునాదులు వేసింది ఇతడేనని ప్రచారం కూడా జరిగింది. శతపథ బ్రాహ్మణం క్రీ.పూ. 10వ శతాబ్దం నుండి 7వ శతాబ్దం మధ్య కాలానికి చెందిన గ్రంథం. అందులో ఉద్దాలకుడికి సంబంధించిన గాథను ప్రస్తావించారు. థేల్స్ క్రీ.పూ.6వ శతాబ్దానికి చెందినవాడు. అంటే ఉద్దాలకుడు థేల్స్ కంటే ముందరి కాలానికి చెందినవాడు.

ఛాందోగ్య ఉపనిషత్ లో (ఇది తొలినాటి ఉపనిషత్తులలో ఒకటి) 6వ అధ్యాయం మొత్తం ఉద్దాలకుడి దృక్పథాన్ని వివరంగా, పొందికతో పేర్కొంది. ఉద్దాలకుడి పేరు మరికొన్ని ఉపనిషత్తులలో కూడా కనిపిస్తుంది. ఛాందోగ్య ఉపనిషత్ తోబాటు ప్రధానమైన ఉపనిషత్తులన్నీ బుద్ధుడికంటే ముందే వచ్చాయి. బుద్ధుడు క్రీ.పూ.485లో మరణించాడు. బౌద్ధ సాహిత్యంలో ఉద్దాలక జాతక అన్న గాథ ఒకటి ఉంది. అంటే ఉద్దాలకుడు బుద్ధుడికన్నా పూర్వకాలంలో జీవించాడన్నమాట. ఉద్దాలకుడి గురించి మనం ప్రధానంగా ఛాందోగ్య ఉపనిషత్ మీదే ఆధారపడాలి.

ఉపనిషత్తులన్నీ ఒకే ఒక అంశం గురించి చర్చిస్తాయి అని సాధారణంగా అనుకుంటాం. అవి పరమాత్మ, జీవాత్మలకు సంబంధించిన చర్చలుగా ఉంటాయని అనుకుంటాం. ఉపనిషత్తులకు భాష్యాలు రాసిన బ్రహ్మగుప్తుడు కూడా ఉపనిషత్తులు ఒకే ఒక తాత్విక దర్శనాన్ని -వేదాంత దర్శనాన్ని చర్చిస్తాయని అన్నాడు. పరమాత్మకు సంబంధించిన జ్ఞానం ఒక్కటే సత్యం అని, ప్రయోగాల ద్వారా, అనుభవాల ద్వారా గ్రహించిన జ్ఞానం అంతా మాయ అని బ్రహ్మసూత్రాలు చెప్తాయి. కాని ఉద్దాలకుని భావాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి.

ప్రధాన ఉపనిషత్తులలో ప్రస్తావనకు వచ్చిన తత్వవేత్తలందరిలోనూ ఒక్క ఉద్దాలక అరుణి బోధనలలో మాత్రమే ఎక్కడా 'పరమాత్మ' అన్న పదం కనిపించదు. దానర్థం అతగాడికి ఆ పదం అర్థం తెలియదని అనుకోలేం. ఎందుకంటే ఉద్దాలకుడు యాజ్ఞవల్క్యుడితో తాత్విక చర్చల్లో తలపడ్డాడు. ఈ యాజ్ఞవల్క్యుడు పూర్తిగా పరమాత్మకు సంబంధించిన భావాలతోటే ఉండేవాడు. ఉద్దాలకుడు పరమాత్మను గుర్తించడానికి అంగీకరించలేదు. మరి పరమ సత్యం ఏమిటి? అన్న ప్రశ్నకు జవాబుగా అతడు 'ఉనికిలో ఉన్నదే అంతిమ సత్యం' అని జమాధానం చెప్పాడు. ఇక 'ఆత్మ' అంటే ఏమిటో వివరించమని ఉద్దాలకుడిని కైకయ అశ్వపతి అనే రాజు కోరితే ఆత్మ అంటే 'భూమి' అని సమాధానం చెప్పాడు. ఉపనిషత్తులకు ప్రాథమిక భావన ఆత్మ. దానికి ఉద్దాలకుడు ఇచ్చిన వివరణ చూస్తే అతడు భావవాదపు అవగాహన పట్ల ఎంత విముఖతను కలిగివున్నాడో తెలుస్తోంది. అతడి ఆలోచనలో 'స్వతంత్రమైన ఆత్మ' అనేదానికి స్థానం లేదు. వాక్కు, ప్రాణం, మనస్సు వంటివి ఎలా వచ్చాయో అతడు ప్రయోగాల ద్వారా చూపే ప్రయత్నం చేశాడు.

శతపథ బ్రాహ్మణంలో ఉద్దాలకుడికి సంబంధించిన ఒక గాథ ఉంది. అప్పటికే ఉద్దాలకుడు కురు-పాంచాల ప్రాంతంలో (ఆర్యావర్త సంస్కృతికి- అంటే బ్రాహ్మణాధిపత్య సంస్కృతికి అది కేంద్రం) పండితుడైన బ్రాహ్మణుడిగా పేరు పొందాడు. అతడు అక్కడినుండి ఉత్తరాదిలో పర్యటనకు పూనుకున్నాడు. ఆ సందర్భంగా తానొక పండితుడినన్న గర్వంతో, ఆర్యావర్త సంస్కృతి ఉత్తర ప్రాంతపు సంస్కృతికన్నా గొప్పది అన్న అహంకారంతో అక్కడ స్థానికులను తనతో ఎవరైనా వాదనకు సిద్ధపడతారా అని సవాలు చేశాడు. ఆ సవాలును శౌనకుడు అనేవాడు స్వీకరించి తానడిగే మూడు ప్రశ్నలకు ఉద్దాలకుడిని సమాధానాలు చెప్పమన్నాడు.

1. మనిషి పుట్టినప్పుడు దంతాలు ఎందుకుండవు ? ఆ మనిషితోపాటే అవి ఎందుకు పెరుగుతాయి? కొన్నాళ్ళు పెరిగాక ఎందుకు ఊడిపోతాయి? ఆ తర్వాత మళ్ళీ పెరిగి చాలా కాలంపాటు ఉందుకు ఉంటాయి? కిందిపళ్ళు ముందు పుట్టిపై పళ్ళు ఆతర్వాత పుట్టడానికి కారణమేమిటి? దిగువ పళ్ళు చిన్నగా, పై పళ్ళు పెద్దగా ఎందుకు ఉంటాయి? నమిలే పళ్ళు ఎందుకు పెద్దగా ఉంటాయి? కోరపళ్ళు ఎందుకు ఒకే సైజులో ఉంటాయి?

2. మనిషి తలపై జుత్తుతోనే పుడతాడు. కాని కొన్నాళ్ళు గడిచాక ముఖం మీద, ఇతర భాగాలమీద ఎంట్రుకలు ఎందుకు మొలుస్తాయి? తలపై జుత్తు ముందు ఎందుకు తెల్లబడుతుంది? తక్కిన భాగాలలోని జుత్తు ఎందుకు ఆ తర్వాతే తెల్లబడుతుంది?

3. మనిషి బాలుడిగా ఉన్నప్పుడు అతడి వలన పిల్లలు ఎందుకు పుట్టరు? పెద్దయ్యాకే ఎందుకు పుడతారు? ఆ తర్వాత వృద్ధుడయ్యాక మళ్ళీ ఎందుకు పుట్టరు?

ఈ ప్రశ్నలకు సమాధానాలు తనకు తెలియవు అని ఉద్దాలకుడు నిజాయితీగా ఒప్పేసుకున్నాడు. తనను శిష్యుడిగా స్వీకరించమని శౌనకుడిని వేడుకున్నాడు. తనకున్న పాండిత్యంతో వాస్తవ ప్రపంచాన్ని మాయగా చిత్రించి అదంతా భగవంతుడి లీల అని చెప్పి తప్పించుకోవచ్చు. కాని దేహంలో జరిగే జీవ ప్రక్రియకు సంబంధించిన పరిజ్ఞానం తనకు లేదని అంగీకరించాడు.

ఉద్దాలకుడికి శ్వేతకేతు అనే కొడుకు ఉన్నాడు. అతడిని వేదాధ్యయనానికి గురుకులానికి ఉద్దాలకుడు పంపించాడు. 12 సంవత్సరాలపాటు వేదాలను అభ్యసించి

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ప్రపంచపు తొలి ప్రకృతి శాస్త్రవేత్త 'ఉద్దాలకుడు'
ఎంవిఎస్ శర్మ ........2

2. నయా - వలసవాదానికి రైతుల ప్రతిఘటన
ఉత్సా పట్నాయక్ ........4

3. సాంస్కృతిక రంగంలో ఇఎంఎస్ కృషి
గోవింద పిళ్లై ........8

4. టియు కార్యకర్తలు నేర్వదగ్గ పాఠం "రీటా నేర్పిన పాఠం"
సీహెచ్ నరసింగరావు........13

5. తొలి మధ్య యుగాలలో తూర్పు భారతదేశం
ఎంవిఎస్ శర్మ........15

6. అరాచక ద్రవ్య పెట్టుబడి-అవినీతి సంస్కృతి
అశోక్ మోడి........18

7. డాలరుపై తిరుగుబాటు
ఎస్.వెంకట్రావు........26

8. ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలపై దాడులు
ఎ.కోటిరెడ్డి........30



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# అవినీతి

అవినీతిని నిర్మూలించడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి, అవినీతి కార్యక్రమాలను అదుపు చేయడం, రెండు అలా చేయలేకపోతే అవినీతిని చట్టబద్ధం చేయడం. మొదటి మార్గం ఒంటికి నప్పని నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండో మార్గాన్నే రాచమార్గంగా ఎంచుకున్నదన్న విషయాన్ని ఎన్నికల బాండ్ల ఉదంతం వెల్లడిస్తోంది.

పదేళ్ల క్రితం, నరేంద్ర మోడీ అవినీతి నిర్మూలన గురించి అనేక శ్రీరంగ నీతులు చెప్పారు. దేశంలో అవినీతిని కూకటి వేళ్లతో పెకిలించేస్తామని ప్రగల్భాలు పలికారు. అక్రమార్కులు స్విస్‌బ్యాంకుల్లో దాచుకున్న నల్ల ధనాన్ని గోళ్లూడగొట్టి వసూలు చేస్తామనీ, దాంతో దేశంలోని ప్రతిఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షలు డిపాజిట్ చేస్తామనీ ఆశలు చూపారు. తీరా అధికారం చేపట్టిన తరువాత నాటి విజయమాల్యా విదేశీ పలాయనం దగ్గరి నుంచి నేటి ఎలక్టోరల్ బాండ్ల కుంభకోణం వరకు భారత దేశ చరిత్రలోనే అత్యంత అవినీతికర ప్రభుత్వంగా నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది.

నిజానికి కార్పొరేట్ల కొమ్ముకాసే బిజెపి ప్రభుత్వ విధానంలోనే అవినీతి అంతర్భాగంగా ఉంది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానమే రాజనీతిజ్ఞతగా మోడీ ప్రభుత్వం పాలన సాగిస్తూ వస్తోంది. ఈ ప్రభుత్వం కార్పొరేట్ల దోపిడీకి కొమ్ము కాయడమే కాదు అందులో అదానీ, అంబానీ వంటి కొంతమంది ఆశ్రిత పెట్టుబడిదారులకు మరింతగా లాభం చేకూర్చే విధంగా ఎలా వ్యవహరించిందో హిండెన్‌బర్గ్ లాంటి సంస్థలు సోదాహరణంగా వెల్లడించాయి. ఈ బడా కార్పొరేట్లకు ప్రజల సంపదను దోచిపెట్టినందుకు బిజెపికీ, నాగపూర్‌నుండి దాన్ని నడిపే సంఘపరివారానికీ ప్రతిఫలం ముట్టకుండా ఉండలేదు. మోడీ ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఆయన సాహసాలుగానూ, రోజుకో మాట, పూటకో వేషం మార్చే మోడీని ప్రజా నాయకుడుగానూ చిత్రిస్తూ కార్పొరేట్ మీడియా కృతజ్ఞతా పూర్వకంగా ప్రచారం సాగించింది. క్విడ్ ప్రో కో వ్యవహారం అంతటితో ఆగలేదు. కార్పొరేట్లు వేలకోట్ల రూపాయలను బిజెపి బొక్కసంలో డిపాజిట్ చేశారు. దాంతో అది ఎన్నికల్లో ఓట్లు కొన్నది, నాయకులను కొన్నది, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలనే కబ్జా చేసింది.

దాంతో కూడా సంతృప్తి చెందని కాషాయ పార్టీ ఏకంగా అవినీతిని చట్టబద్ధం చేస్తూ ఎన్నికల బాండ్ల చట్టాన్నే తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రవేశపెట్టినప్పుడే సిపిఐ(ఎం) దీని వెనుకనున్న ప్రమాదాన్ని గురించి హెచ్చరించింది. అవినీతి కరమైన ఎన్నికల బాండ్లకు దూరంగా ఉండాలని నిర్ణయించి, దాన్ని తూ.చ తప్పక ఆచరించిన భారత దేశంలోని ఏకైక ప్రధాన రాజకీయ పార్టీ సిపిఐ(ఎం) మాత్రమే. సుప్రీం కోర్టు జోక్యంతో ఎన్నికల బాండ్ల వివరాలు ఒక్కోటీ బయటపడుతున్న కొద్దీ మోడీ అవినీతి విశ్వరూపం వెల్లడవుతోంది. ఎన్నికల బాండ్ల ద్వారా అత్యధిక మొత్తం బిజెపి ఖాతాలో చేరడమే కాదు, ఇడి, ఐటి ఇతర కేంద్ర సంస్థలను ఉపయోగించుకుని సంస్థలను, వ్యాపార వేత్తలను ఎలా లొంగదీసుకుని ఎన్నికల బాండ్లు కొనుగోలు చేయించారో సుప్రీంకోర్టు ముందు ఎస్‌బిఐ ఉంచిన వివరాలు తెలుపుతున్నాయి.

నఖశిఖ పర్యంతం అవినీతిలో మునిగి తేలుతున్న బిజెపీ, దాని నాయకత్వం మరోవైపు ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రతిపక్షాలపై ఉన్నవీ లేనివీ ఆరోపణలు సృష్టిస్తూ కేసులు పెడుతోంది. ప్రతిపక్ష నాయకులను తప్పుడు కేసులతో జైళ్లకు పంపుతోంది. ఇంతగా అవినీతిలో కూరుకుపోయిన బిజెపిలో ఒక్క నాయకుని కూడా ఇడి గానీ, ఆదాయపు పన్ను వాళ్లుగానీ కేసులు పెట్టి జైళ్లకు పంపలేదు. కానీ బిజెపి రాజకీయ అవసరాలకు అనుగుణంగా ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారు. రాజకీయ నేతలను లొంగదీసుకుంటున్నారు. లొంగని వారిని జైళ్లలో పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఎన్నికల ముందు జైలుకు పంపారు. అదేమి విచిత్రమో, ఇడి కేసుల్లో ఇరుక్కున్న ప్రతిపక్ష నాయకులు బిజెపి తీర్థం పుచ్చుకోగానే పవిత్రులై బయటకు వచ్చేస్తున్నారు. అధికారపార్టీ నాయకలవుతున్నారు, మంత్రి పదవులు దక్కుతున్నాయి, ఎన్నికల్లో కూడా వారే పాలక పార్టీతరపు పోటీదారులవుతున్నారు. చివరికి ఈ సంస్థలను ఉపయోగించుకుని ప్రతిపక్ష పార్టీల బ్యాంకు ఖాతాలను కూడా స్తంభింపజేసి ఎన్నికల యుద్ధంలో వారిని నిరాయుధులుగా చేస్తున్నది బిజెపి.

బిజెపి సాగిస్తున్న ఈ అవినీతికర, వికృతచేష్టలు మన ప్రజానీకం దృష్టినే కాదు, ప్రపంచ దేశాల దృష్టినీ ఆకర్షించింది. స్వాతంత్ర్య పోరాటానికి వెన్నుపోటు పొడవడంతో ప్రారంభమైన బిజెపి ప్రయాణం నేడు మన రాజకీయాను, పరిపాలనా వ్యవస్థను, రాజ్యాంగ సంస్థలను అవినీతి ఊబిలోకి దించే వైపు సాగుతోంది. దీన్ని అరికట్టకపోతే మన ప్రజాస్వామిక వ్యవస్థ విధ్వంసమైపోతుంది. దేశ భవిష్యత్తును ప్రమాదం నుండి కాపాడాలనుకునే ప్రతిఒక్కరూ బిజెపి అవినీతికి వ్యతిరేకంగా గళమెత్తాలి. రానున్న ఎన్నికల్లో దాన్నీ, దాంతో జతకట్టే పార్టీలనూ మట్టికరిపించాలి.

**ఈ మాసం ముఖ్యాంశం**

# నయా-వలసవాదానికి రైతుల ప్రతిఘటన



రచయిత ప్రముఖ భారతీయ మార్క్సిస్టు ఆర్థిక వేత్త. 1973 నుండి 2020లో రిటైర్ అయ్యేవరకు ఢిల్లీలోని జెఎన్‌యు లో సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆమె ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ జీవిత భాగస్వామి.

**ఉత్సా పట్నాయక్**

బ్రిటన్ భారతదేశంపై రాజకీయ ఆధిపత్యం సంపాదించిన తర్వాత (1765లో ఈస్ట్ ఇండియా కంపెనీ బెంగాల్‌లో శిస్తు వసూలు చేసుకునే హక్కును లాక్కోవటంతో వాస్తవంగా అది ప్రారంభమైంది) అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానం నుండి మనదేశ ఆర్థికాభివృద్ధిని వేరుచేసి చూడలేమని జవహర్‌లాల్ నెహ్రూ తన రచనలలో పేర్కొన్నాడు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు ఈ విశ్లేషణ మరింత బాగా వర్తిస్తుంది.

ప్రపంచంలోని పేద దేశాలపై పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల రాజకీయ ఆధిపత్యం చాలాకాలం క్రితమే లాంఛనంగా ముగిసింది. కాని రెండవ ప్రపంచయుద్ధం తర్వాత ఏర్పాటు చేసిన ద్రవ్య, వాణిజ్య సంస్థలను, ఇతర వ్యవస్థలను వినియోగించుకొంటూ ఈ దేశాలను తమ నయా-వలసవాద ఆధిపత్యంలో ఉంచుకోవటానికి ధనిక పారిశ్రామిక దేశాలు నిరంతరం ప్రయత్నాలు చేస్తూనేన్నాయి.

మనదేశంలోని రైతాంగం గత నాలుగు సంవత్సరాల నుండి చేస్తున్న పోరాటం కేవలం తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం మాత్రమే కాదు. భారతదేశంలోని సుసంపన్నమైన వనరులను నయా-వలసవాదం తిరిగి తన ఆధిపత్యంలోకి తీసుకోవటానికి వ్యతిరేకంగా కూడా వారు పోరాటం చేస్తున్నారు. దేశభక్తుడైన ప్రతి భారతీయుడూ ఈ పోరాటాన్ని సంపూర్ణంగా బలపరచాలి.

ఉత్తరాదిన ఉన్న పారిశ్రామిక దేశాలలో అతి శీతల వాతావరణం ఉంటుంది. తమ దేశాలలోని ప్రజల విభిన్నమైన వినిమయ అవసరాలను తీర్చటానికి, తమ పారిశ్రామిక ఉత్పత్తులను నిరాటంకంగా కొనసాగించుకోవటానికి వెచ్చటి వాతావరణం ఉన్న దక్షిణాది దేశాలలోని పంటభూములపై ఆధిపత్యం సంపాదించటం, తమకు అవసరమైన పంటలను ఆ భూములలో పండించటం వారికి అత్యవసరం. కాబట్టి దక్షిణాది దేశాలలోని పంటభూములలో పండించే పంటలను మార్చి, తమకు అవసరమైన పంటలు పండించేలా చేయటానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల వలన ఉత్తరాది దేశాలు తమ పంట భూములలో సంవత్సరానికి ఒక పంటను మాత్రమే పండించగలవు. దక్షిణాది దేశాలలో పండించే వివిధ రకాలైన ఆహారపంటలు, ముడి సరుకులుగా ఉపయోగపడే పంటలను ఆ దేశాలు శాశ్వతంగా పండించలేవు. తమ దేశాలలోని వాతావరణ పరిస్థితుల వలన తమ ప్రజల అవసరాలు తీరిన తర్వాత కూడా గుట్టలుగా పోగుపడేటంతగా కేవలం ఆహారపంటలను మాత్రమే ఉత్తరాది దేశాలు పండించగలవు. ఈ ఆహారాన్ని జంతువులను పెంచటానికి ఉపయోగించి, తద్వారా లభించే మాంసం, ఇతర జంతు సంబంధ ఉత్పత్తులను పొందగలవు. కానీ ఆ దేశాలలోని ప్రజానీకం వారి దేశాలలో పండించలేని, ఉష్ణ దేశాలలోని భూములలో మాత్రమే పండే వివిధ రకాల ఉత్పత్తులు కావాలని కోరుతున్నారు. అందువలన ఆ దేశాలు ఎక్కువగా దిగుమతులపై ఆధారపడాల్సి వస్తున్నది.

మరొక ప్రధాన మౌలిక ఉత్పత్తి అయిన శిలాజ ఇంధనాల అంశాన్ని పరిశీలిస్తే.. ప్రపంచంలో ఇప్పటికి కనిపెట్టిన మొత్తం నిల్వలలో ఉత్తరాదిలోని పారిశ్రామిక దేశాలలో 11 శాతం మాత్రమే ఉండగా, వాణిజ్య అవసరాల కోసం వాడే ఇంధనంలో 40 శాతం ఈ దేశాలు వినియోగిస్తున్నాయి. ఇంధన నిల్వలను తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవటం కోసం అనుసరిస్తున్న భౌగోళిక రాజకీయాలపై విస్తృతమైన చర్చలు జరుగుతున్నాయి. కాని ఇతర మౌలిక వనరులను తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవటానికి ఉత్తరాదిలోని పారిశ్రామిక దేశాలు అనుసరిస్తున్న భౌగోళిక రాజకీయాలపై అత్యంత తక్కువ చర్చ జరుగుతున్నది. వలస విధానం అమలు జరుగుతున్న సమయంలో దక్షిణాది దేశాల నుండి చేసుకున్న దిగుమతులకు (తమ దేశాలలో ఉత్పత్తి చేసిన పారిశ్రామిక ఉత్పత్తులను ఆ దేశాలలో కుమ్మరించిన తర్వాత, వాటి కన్నా అదనంగా చేసుకున్న దిగుమతులు) వలస పాలన సాగించే దేశాలు ఏమీ చెల్లించేవి కాదు. ఆ దేశాలలోని రైతులు, వృత్తిదారుల నుండి వసూలు చేసిన పన్నులను అదే రైతులు, వృత్తిదారులు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయటానికి ఉపయోగించి, ఆ సరుకులను తమ దేశాలకు ఎగుమతి చేసేవారు. దీనివలన వారు వసూలు చేసి, తమ దేశాలకు పంపే పన్నులు డబ్బు నుండి సరుకుల రూపంలోకి మారటం మాత్రమే జరిగేది. తమ ఉత్పత్తులపై పన్నులు చెల్లించి ఉండటం వలన వాస్తవంగా స్థానిక ఉత్పత్తిదారులు ప్రతిఫలం పొందేవారు కాదు. కాని తమ ఉత్పత్తులకు ఏ మాత్రం ప్రతిఫలం పొందటం లేదనే విషయం ఉత్పత్తిదారులకు తెలిసేది కాదు.

ఇప్పుడు ఉత్తరాదిలోని పారిశ్రామిక దేశాలు దక్షిణాది దేశాలను ఆర్థికంగా ప్రత్యక్షంగా అదుపు చేయలేకపోవటం వలన ఇక్కడ ఉత్పత్తి అయిన సరుకులను ఉచితంగా పొందలేక

పోతున్నాయి. కానీ తమ దేశాల ద్రవ్య విలువను తగ్గించమని దక్షిణాది దేశాలపై నిరంతరం ఒత్తిడి చేయటం ద్వారా నామమాత్రమైన ధరలకు ఈ దేశాల నుండి సరుకులను దిగుమతి చేసుకొంటున్నాయి. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు డాలర్‌కు మూడు రూపాయలుగా మారకం విలువ ఉండేది. అది ఇప్పుడు 83 రూపాయలకు చేరింది. అప్పటితో పోల్చితే రూపాయి కొనుగోలు శక్తి ఇపుడు 4 శాతం కన్నా తక్కువకు దిగజారింది. ఇదేకాలంలో బ్రిటిష్ పౌండ్‌తో రూపాయి మారకం విలువ 15 రూపాయల నుండి 100 రూపాయలకు తగ్గింది.

> **❝ దక్షిణాది దేశాలలోని ప్రజలు పేదవారనీ, వెనుకబడిన వారనీ నిరంతరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ దేశాలలోని సంపద్వంతమైన సహజ వనరులను పరిగణనలోకి తీసుకోకుండా, తమ ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం సామ్రాజ్యవాద యుగంలో వారు రూపొందించిన తప్పుడు వాణిజ్య సిద్ధాంతాలను దక్షిణాది దేశాలలోని మేధావులు విమర్శనారహితంగా వల్లె వేస్తున్నారు. ❞**



ఢిల్లీలో రైతుల ఆందోళన

ఇది ఆయా కరెన్సీల డిమాండ్–సరఫరాల మధ్య వ్యత్యాసం వలన జరగటం లేదు. ద్రవ్య నిర్వహణ విధానం వలన ఈ పతనం జరుగుతున్నది. భారతదేశంపై ప్రత్యక్షంగా ఆధిపత్యం ఉన్నపుడు భారతదేశానికి వచ్చే విదేశీ మారకద్రవ్యం అంతా బ్రిటన్ చేతికే వచ్చేది. బ్రిటన్ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండటం వలన ఒక శతాబ్దానికి పైగా పౌండ్–రూపాయి మారకం విలువలో పెద్ద వ్యత్యాసం లేకుండా ఉంది. కాని రాజకీయ స్వాతంత్ర్యం సాధించుకున్న తర్వాత ఉత్తరాదిలోని పారిశ్రామిక దేశాలు భారతదేశ ద్రవ్య విలువనే కాకుండా, మొత్తం దక్షిణాది దేశాల ద్రవ్య విలువను నిరంతరం తగ్గిస్తున్నాయి. ఫలితంగా వారు దిగుమతి చేసుకొనే సరుకుల ధరలు డాలర్లలో తగ్గుతూనే ఉన్నాయి. దీనితో వారి దేశాలలోని ప్రజల జీవన ప్రమాణాలు ఉన్నతంగా ఉంటున్నాయి.

దక్షిణాది దేశాలలోని ప్రజలు పేదవారనీ, వెనుకబడిన వారనీ నిరంతరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ దేశాలలోని సంపద్వంతమైన సహజ వనరులను పరిగణనలోకి తీసుకోకుండా, తమ ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం సామ్రాజ్యవాద యుగంలో వారు రూపొందించిన తప్పుడు వాణిజ్య సిద్ధాంతాలను దక్షిణాది దేశాలలోని మేధావులు విమర్శనారహితంగా వల్లె వేస్తున్నారు. అన్ని దేశాలు అన్ని రకాల సరుకులను ఉత్పత్తి చేయవచ్చనీ, అన్ని రకాలైన పంటలను పండించవచ్చునీ భావిస్తూ తమ సరుకులను తక్కువ ధరలకు ఉత్పత్తి చేయగలిగిన వారు వాణిజ్యం నుండి ప్రయోజనం పొందుతారంటూ డేవిడ్ రికార్డో రూపొందించిన 'తులనాత్మక ధరలతో ప్రయోజనం' అన్న తప్పుడు సిద్ధాంతం చాలా ప్రభావం కలిగిస్తున్నది. ఈ తప్పుడు సిద్ధాంతం ఆధారంగానే తర్వాత వాణిజ్య సిద్ధాంతాలను రూపొందిస్తున్నారు. సరైన పునాది లేని సిద్ధాంతం ఆధారంగా రూపొందించిన నిర్ధారణలు కూడా తప్పుడువే అవుతాయి. చెరుకు పండించటానికి జర్మనిలో, కాఫీ గింజలను పండించటానికి అమెరికాలో ఎంత ఖర్చవుతున్నది? వాతావరణ పరిస్థితుల వలన అక్కడ ఆ ఉత్పత్తులు గతంలో అసలు లేవు. ఇప్పుడూ అంతే. భవిష్యత్తులోనూ అలాగే ఉంటాయి. అనేక పంటలను పండించటానికి ఎంత ఖర్చు అవుతుందన్న అంశాన్ని నిర్ధారించటం సాధ్యం కాదు. ఉత్తరాది దేశాల ప్రజలు వినియోగిస్తున్న సరుకుల కొరతను పూరించటం కోసం ఆ సరుకులను సరఫరా చేయాలని దక్షిణాది దేశాలను నిరంతరం ఒత్తిడి చేస్తున్నారు.

పరస్పరం ప్రయోజనం కలిగించే వాణిజ్యానికి మారుగా తుపాకి గురిపెట్టి వ్యాపారం చేయటం మనం చరిత్రలో చూశాం. ఉష్ణదేశాల నుండి తాము తీసుకెళ్ళే పంటల ధరలకు అవసరమైన మొత్తాన్ని పన్నుల రూపంలో వసూలు చేయటం ద్వారా ఆ పంటలను ఉచితంగా కాజేయటానికి ఆ దేశాలను జయించి, తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవటాన్ని చూశాం. దీని వలన దక్షిణాది దేశాల ప్రజలు తీసుకునే ఆహారంలో పోషకాలు తగ్గిపోవటంతో పాటు, నిరంతరం కరువులు వచ్చి విధ్వంసం సృష్టించాయి. 1900 సంవత్సరంలో తలసరి 200 కిలోలు ఉత్పత్తి అయిన ఆహారధాన్యాలు మనకు స్వాతంత్ర్యం వచ్చే సమయానికి తలసరి 137 కిలోలకు పడిపోయాయి. అంటే తలకు రోజుకు 600 కేలరీలు తగ్గాయి. ఇది సగటు తగ్గుదల. పేద ప్రజానీకానికి ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉంటుంది.

1970 తర్వాత విమాన రవాణా ఛార్జీలు బాగా తగ్గటం వలన ఎక్కువ కాలం నిల్వ ఉండని తాజా కూరగాయలు, పళ్ళు, పువ్వులు, చేపలు లాంటి ఉత్పత్తులు దక్షిణాసియా దేశాల నుండి అమెరికా, యూరప్ దేశాలకు 8 నుండి 15 గంటలలోనే చేరుతున్నాయి. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుండి మరింత తక్కువ కాలంలో చేరుతున్నాయి. అందువలన తమ ప్రజానీకం వినియోగానికవసరమైన సరుకులను సరఫరా చేయాలని పారిశ్రామికంగా అభివృద్ధి అయిన ఉత్తరాదిలోని దేశాలు దక్షిణ దేశాలను వత్తిడి చేయటం వలస కాలం నాటి కన్నా ప్రస్తుతం అనేక రెట్లు పెరిగింది.

"శీతల వాతావరణంలో ఉన్న తమ దేశాల ప్రయోజనాల కోసం దక్షిణాదిలోని ఉష్ణదేశాలలో ఉన్న వైవిధ్యభరితమైన పంటలు పండే భూములను, పంటల తీరును తమ

> **❝ నిజాదాయాలు పడిపోవటం, ఉపాధి తగ్గటం, కొన్ని రంగాలలో సంభవించిన తీవ్ర పరిణామాలు తదితరాలను మూడు దశాబ్దాల పాటు రైతాంగం అనుభవించింది. రుణభారంతో 1.5 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అసమానతలను పెంచే ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడా లని రైతులు, కార్మికులు నిర్ణయానికి వచ్చారు. ఒక సంవత్సరం ప్రపంచ మార్కెట్‌లో అధికంగా ఉన్న ధరలను పొందాలని, మరు సటి సంవత్సరం ధరల పతనాన్ని చవిచూడాలని వారు భావించటం లేదు. ❞**

అదుపులో పెట్టుకోవటం కోసం ఉత్తరాదిలోని పారిశ్రామికదేశాలు ప్రయత్నం చేస్తున్నాయి".

తమ ప్రయోజనాలకు అనుగుణంగా పంటభూములను వినియోగించేలా దక్షిణాది దేశాలను వత్తిడి చేయటంలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఉత్తరాది దేశాలు ఇప్పటికే చాలా వరకు విజయం సాధించాయి. తమ ప్రజల ఆహార భద్రత ఉత్తరాది దేశాల నుండి ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవటంలో ఉందని, పారిశ్రామికవంతమైన ఉత్తరాది దేశాల డిమాండ్లకు అనుగుణంగా ఆహారేతర పంటలను పండించటంలో తాము నైపుణ్యాన్ని సాధిస్తే అధిక ప్రయోజనం పొందగలమన్న తప్పుడు వాదనల వలన అభివృద్ధి చెందుతున్న అనేక దేశాలు అవివేకంతో తమ దేశాలలో ధాన్యం సేకరించటం, నిల్వచేయటం, పంపిణి చేయటంలను వదులు కొంటున్నాయి. ఈ వాదనలను సమర్ధించుకోవటానికి అంతర్జాతీయ స్థాయిలో రికార్డో యొక్క తప్పుడు సిద్ధాంతాన్ని వినియోగించు కొంటున్నారు.

మనం చేసే ఉత్పత్తులలో అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకతలను సాధించాలని చెప్పటంలో తప్పేముందని కొందరు అడగవచ్చు. ఈ వాదనలోని తప్పులలో మొదటి అంశం ఆహారభద్రత అత్యంత ప్రధానమైనది. దురాశతో వ్యవహరించే ఉత్తరాది దేశాల దయా దాక్షిణ్యాలకు దానిని వదిలివేయరాదు. రెండవ గల్ఫ్ యుద్ధంలో వైఫల్యం తర్వాత 2002 నుండి అమెరికా తాను పండించిన ఆహారధాన్యాలను నాలుగు రెట్లు ఎక్కువగా ఎథనాల్ ఉత్పత్తి కోసం వినియోగిస్తున్నది. అదే విధంగా యూరప్ దేశాలు కూడా ఆహారధాన్యాలను ఎథనాల్ ఉత్పత్తికి వినియోగిస్తున్నవి. 2008లో ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరగటంతో ఆహారధాన్యాల దిగుమతులపై ఆధారపడిన 37 దేశాలలో ఆహారం కోసం కొట్లాటలు జరిగాయి.

**తలసరి ఆహారధాన్యాల లభ్యత**

ఈ విధమైన పరిస్థితుల నుంచి భారతదేశం కొద్దిలో బయటపడింది. గత ఆరు సంవత్సరాల నుండి ఆహారధాన్యాల వాస్తవ సేకరణ ధరలను పెంచలేదు. పంజాబ్‌లో ఆహారధాన్యాల ఉత్పత్తి స్తంభించిపోయింది. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. భారతదేశ హరిత విప్లవంపై ఈ కాలంలోనే తీవ్రమైన సైద్ధాంతిక దాడి జరిగింది. తలసరి ఆహారధాన్యాల వినియోగంలో ప్రపంచంలో భారతదేశం దిగువస్థాయిలో ఉండటమే కాకుండా, అతి తక్కువ అభివృద్ధి చెందిన దేశాల కన్నా దిగువస్థాయిలో ఉన్నా, భవిష్యత్‌లో సంభవించనున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకోకుండా ( వాస్తవంలో వాటిని గురించి అవగాహన లేకుండా), పంజాబ్‌లో అతిగా నీటిని వినియోగించే ధాన్యం ఉత్పత్తిని ఆపివేయాలని, వైవిధ్యభరితమైన పంటలను పండించాలని పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రచారంలో పేరు పొందిన స్థానిక మేధావులు కూడా జతకట్టారు. ప్రపంచవ్యాపితంగా పెరిగిన ఆహారధాన్యాల ధరలు, మొద్దునిద్ర పోతున్న ప్రభుత్వం మేలుకొనేలా చేశాయి. అప్పటి నుండి ప్రభుత్వం ఆహారధాన్యాలను సేకరించదని బహిరంగంగా చెప్పటం ఆపివేశారు. సేకరణ ధరలను పెంచటం ప్రారంభించారు. ఉత్పత్తిని పెంచటానికి పూనుకోవటంతో పాటు ఆహారధాన్యాల ఉత్పత్తికి దీర్ఘకాలిక విధానాన్ని రూపొందించారు. అయినప్పటికీ దేశంలో ప్రస్తుతం తలసరి ఆహారధాన్యాల లభ్యత తలకు 171 కిలోలు మాత్రమే. ఆఫ్రికాలో తలసరి లభ్యత 190 కిలోలు, తక్కువ అభివృద్ధి చెందిన దేశాలలో తలకు 205 కిలోల కన్నా మనదేశంలో ఆహారధాన్యాల లభ్యత తక్కువగా ఉన్నది. చైనాలో వినియోగిస్తున్న తలసరి ఆహారధాన్యాలు 360 కిలోలలో సగం కన్నా తక్కువగా ఉన్నది.

ఉత్పత్తిదారులుగా రైతులు రెండు విధాలుగా నష్టపోతున్నారు. వ్యవసాయోత్పత్తిని పెంచటం కోసం వారు అన్ని విధాలుగా కృషి చేసినప్పటికీ ప్రకృతి వైపరీత్యాల వలన ఉత్పత్తి అనిశ్చితంగా ఉంటున్నది. మరోవైపున 1990 దశాబ్దం మధ్యకాలం నుండి స్వేచ్ఛా వాణిజ్యం, నయా-ఉదారవాద విధానాలు ప్రపంచ మార్కెట్‌లోని ఒడిదుడుకులు, ధరలు హెచ్చుతగ్గులకు గురయేలా చేశాయి. 1990కి ముందు అప్పుల బారిన పడిన రైతుల ఆత్మహత్యలను మనం వినలేదు. స్వేచ్ఛా వాణిజ్య విస్తరణతో ప్రపంచమార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉన్నపుడు ఉత్పత్తిని పెంచటం కోసం రైతులు ఎక్కువ పెట్టుబడులు పెడుతున్నారు. పంట చేతికొచ్చేసరికి ధరలు తీవ్రంగా పడిపోవటంతో రైతులు అనివార్యంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తనకు మాత్రమే తెలిసిన కారణాలతో ప్రస్తుత ప్రభుత్వం ఉత్తరాది దేశాలతో విస్తృతంగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నది. ఇవి మన రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరుస్తాయి.

నిజాదాయాలు పడిపోవటం, ఉపాధి తగ్గటం, కొన్ని రంగాలలో సంభవించిన తీవ్ర పరిణామాలు తదితరాలను మూడు దశాబ్దాల పాటు రైతాంగం అనుభవించింది. రుణభారంతో 1.50 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఫలితంగా అసమానతలను పెంచే ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని రైతులు, కార్మికులు నిర్ణయానికి వచ్చారు. ఒక సంవత్సరం ప్రపంచమార్కెట్‌లో అధికంగా ఉన్న ధరలను పొందాలని, మరుసటి సంవత్సరం ధరల పతనాన్ని చవిచూడాలని వారు భావించటం లేదు. తమను పీల్చిపిప్పి చేస్తున్న ప్రైవేటు కార్పొరేషన్‌లకు మాత్రమే తమ ఉత్పత్తులను పూర్తిగా అమ్మాలనీ వారు కోరుకోవటం లేదు. తమ ఉత్పత్తులకు పొందే ధరలలో అనిశ్చితిని తగ్గించాలనీ, ఉత్పత్తి ఖర్చులు పోనూ కనీస జీవన ప్రమాణాలకు అవసరమైన నికర ఆదాయం పొందే విధంగా కనీస మద్దతు ధరలకు తమ ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయాలనీ రైతులు కోరుతున్నారు,

1965లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేసిన తర్వాత మూడు దశాబ్దాల పాటు ఈ విధానాలు అమలు జరిగాయి. ఆ తర్వాత వివిధ రకాల వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయటానికి బోర్డులను ఏర్పాటు చేశారు. అవి రైతుల నుండి సరసమైన ధరలకు ఆహారధాన్యాలు, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేశాయి. రైతులు, వినియోగదారులు ఇరువురికీ ధరలు స్థిరంగా ఉంచటానికి అవి దోహదం చేశాయి. 1990 దశకం మధ్యలో సరళీకరణ సంస్కరణలు ప్రారంభమైన తర్వాత వ్యవసాయోత్పత్తులను

కొనుగోలు చేసే బాధ్యతను ఈ కార్పొరేషన్‌లు పూర్తిగా వదిలివేశాయి. అంతర్జాతీయంగా ఆహారధాన్యాల ధరలు పెరిగే వరకు ఎఫ్‌సిఐ కార్యకలాపాలను తగ్గించారు.

పారిశ్రామిక దేశాలు కోరుతున్న ప్రత్యేక నైపుణ్యం సంపాదించటం అన్న విధానాన్ని భారతదేశం, ఇతర దక్షిణాది దేశాలపై తప్పుడు పద్ధతులలో బలవంతంగా రుద్దుతున్నారు. ఒకవైపున ఉత్తరాది దేశాలు తమ వ్యవసాయానికి భారీగా సబ్సిడీలు ఇస్తూ, మరోవైపున తమ దేశాలలో ప్రభుత్వ సేకరణ, నిల్వల కోసం దక్షిణాది దేశాలు ఇస్తున్న కొద్దిపాటి సబ్సిడీలపై దాడిచేస్తున్నాయి. దోహా దఫా చర్చలు ముగిసిన తర్వాత గత రెండు దశాబ్దాల నుండి వారి దేశాలలోని మిగులు ఆహారధాన్యాలను తమ దేశాలలోకి ఎగుమతి చేయటానికి పారిశ్రామిక దేశాలు చేస్తున్న పట్టువిడుపులు లేని, సూత్రరహిత దాడులను ఎదుర్కొంటూ, ఆహారధాన్యాలను సేకరించటం, నిల్వ చేయటం, తమ ప్రజలకు సరఫరా చేయటానికి తమకు ఉన్న సర్వసత్తాక హక్కును కాపాడుకోవటానికి దక్షిణాది దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

**వ్యవసాయంపై ఒప్పందం**

ప్రపంచ వాణిజ్యసంస్థ 1995లో అమలు చేయటం ప్రారంభించిన 'వ్యవసాయంపై ఒప్పందం'-ఇప్పటి వరకు రూపొందించిన ఒప్పందాలలో వేధోపరంగా అత్యంత అప్రతిష్ఠాకరమైన ఒప్పందంగా చరిత్రలో నిలిచిపోతుంది. ధనిక దేశాలు తాము వ్యవసాయానికి ఇస్తున్న భారీ సబ్సిడీలను జాగ్రత్తగా ప్లాన్ చేసి, ప్రత్యక్షంగా నగదు బదిలీగా మార్చి, వాటిని "వాణిజ్యాన్ని వక్రీకరించని" వాటిగా చిత్రించాయి. అందువలన తాము ఇస్తున్న సబ్సిడీలను తగ్గించాల్సిన అవసరం లేదని ఉత్తరాదిలోని పారిశ్రామిక దేశాలు వాదిస్తున్నాయి. తమ వ్యవసాయానికి ఇస్తున్న భారీ సబ్సిడీలను అవి కొనసాగిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ దేశాలలోని రైతులకు ఇస్తున్న కొద్దిపాటి సబ్సిడీలను "వాణిజ్యాన్ని వక్రీకరించేవి"గా చిత్రించి, వాటిని తగ్గించాలని వత్తిడి చేస్తున్నాయి. ఏ అభివృద్ధి చెందుతున్న దేశమూ ఈ ఒప్పందాన్ని రూపొందించటంలో భాగస్వామి కాలేదు. "వాణిజ్యాన్ని వక్రీకరించటం" లాంటి అర్థంలేని భాషను ఉపయోగించటం ద్వారా దక్షిణాది దేశాలలోని విధాన రూపకర్తలను మోసం చేయటానికి, లొంగదీసుకోవటానికి పూనుకున్నారు.

తాను ఇస్తున్న 9,600 కోట్ల డాలర్ల సబ్సిడీలలో 94 శాతాన్ని వివిధ రకాల పేర్లతో ప్రత్యక్ష నగదు బదిలీలోకి మార్చుకొని అమెరికా కొనసాగిస్తున్నది. వాస్తవంగా తాను ఇస్తున్న అపారమైన సబ్సిడీలను దాదాపు యథాతథంగా ఉంచుకొని, తన సబ్సిడీల తగ్గింపు లక్ష్యాన్ని రెండు సంవత్సరాలలో పూర్తి చేస్తానని అమెరికా ప్రకటించిన అంశాన్ని ఈ రచయిత 1997లో రూపొందించిన నివేదికలో పేర్కొన్నారు. అమెరికా ఇప్పటికి కూడా ప్రతి వ్యవసాయ బిల్లులోనూ సబ్సిడీలను పెంచుతున్నది. అనేక సంవత్సరాల క్రితమే సబ్సిడీలను తమ వ్యవసాయ ఉత్పత్తి విలువలో సగానికి పెంచింది. పత్తి రైతులకు ఒక్కొక్కరికి సంవత్సరానికి ఇస్తున్న 1,27,000 డాలర్లతో కలిపి, మొత్తం 20 లక్షల కన్నా తక్కువగా ఉన్న వ్యవసాయ ఉత్పత్తిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా అమెరికా తన వార్షిక బడ్జెట్‌లో ఒక శాతం ఇస్తున్నది. ఉత్తర అమెరికా రైతుల కన్నా మరింత అసమర్థులైన తమ రైతులకు వ్యవసాయోత్పత్తిలో మరింత ఎక్కువ మొత్తాన్ని పశ్చిమ యూరప్ దేశాల ప్రభుత్వాలు సబ్సిడీగా ఇస్తున్నాయి. ఇంతటి భారీ సబ్సిడీలు ఇవ్వకపోతే ఆహారధాన్యాలు, ఇతర వ్యవసాయోత్పత్తులకు ప్రస్తుతం అంతర్జాతీయంగా ఉన్న ధరలలో చైనా, ఇండియా, ఈజిప్టు, ఇతర దేశాలలోని రైతులతో అమెరికా, కెనడా, పశ్చిమ యూరప్ దేశాలలోని రైతులు ఎంత మాత్రం పోటీ పడలేరు. వ్యవసాయోత్పత్తుల అమ్మకందారులుగా ప్రపంచమార్కెట్ నుండి వారు అదృశ్యమైపోతారు.

ప్రస్తుతం కేంద్రంలోని ప్రభుత్వం తనకు మాత్రమే తెలిసిన కారణాలతో ఉత్తరాది దేశాలతో వేలం వెర్రిగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకొంటున్నది. ఈ ఒప్పందాలు మన రైతులపై తీవ్రమైన దుష్ప్రభావాలను చూపుతాయి.

వ్యవసాయం చేసే 10 కోట్ల కుటుంబాలున్న భారతదేశంలోనే కాక, వ్యవసాయం చేసే కుటుంబాలు గణనీయంగా ఉన్న ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రభుత్వాలు కూడా తమ రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ చేయలేవు.

> **" ఉత్పత్తిదారులుగా రైతులు రెండు విధాలుగా నష్టపోతున్నారు. వ్యవసాయోత్పత్తిని పెంచటం కోసం వారు అన్ని విధాలుగా కృషి చేసినప్పటికీ ప్రకృతి వైపరీత్యాల వలన ఉత్పతి అనిశ్చితంగా ఉంటున్నది. మరోవైపున 1990 దశాబ్దం మధ్యకాలం నుండి స్వేచ్ఛా వాణిజ్యం, నయా-ఉదారవాద విధానాలు ప్రపంచ మార్కెట్‌లోని ఒడిదుడుకులు, ధరలు హెచ్చుతగ్గులకు గురయేలా చేశాయి. "**

కనీస మద్దతు ధరలకు ప్రభుత్వాలు వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయటమే రైతులకు ప్రయోజనమని ఈ దేశాలలో ఆచరణలో రుజువైంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్య మారకం రేట్ల ప్రకారం భారతదేశంలోని గోధుమ రైతులకు ఇస్తున్న మద్దతు ధరలు ప్రతికూలంగా ఉన్నాయి. అంటే ప్రస్తుతం బోనస్ కూడా కలిపినా మన రైతులు పొందుతున్న మద్దతు ధర అంతర్జాతీయ ధర కన్నా తక్కువగా ఉన్నది. వరికి ఇస్తున్న ధర కొంచెం ఎక్కువగా ఉన్నది. కాని వ్యవసాయ ఒప్పందంలో పేర్కొన్న వ్యవసాయో త్పత్తిలో 10 శాతం విలువ కన్నా తక్కువ గానే ఉన్నది. ఐనప్పటికీ 2011-14 మధ్య భారతదేశం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను ఉల్లంఘించి వరి, గోధుమలకు వాటి ఉత్పత్తి విలువలో 80, 65 శాతం మద్దతు ధరగా ఇచ్చిందని అమెరికా ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు చేసింది.

ఈ విధంగా లెక్కించటానికి అనుసరించిన పద్ధతి మోసపూరితమైనది. దానిని ఉద్దేశపూర్వకంగానే వ్యవసాయంపై ఒప్పందంలో చేర్చారు. నిర్దిష్టంగా నిర్ణయించిన ధరలుగా (ఫిక్స్ ఎక్స్‌టర్నల్ రిఫరెన్స్ ప్రైస్) 1986-88 మధ్య ఉన్న పంటల అంతర్జాతీయ ధరలను ఎప్పటికీ ప్రామాణికంగా తీసుకున్నారు. దానితో పాటు ఆ సమయంలో డాలరు-రూపాయి మారకం రేటు 12.7 రూపాయలు ఉన్నది. భారతదేశం రైతులకు ఇస్తున్న మద్దతు ధరలను 25 సంవత్సరాల తర్వాత ఆనాటి విలువతో అమెరికా లెక్కిస్తున్నది. 1986-88లో అంతర్జాతీయంగా క్వింటాలు గోధుమ ధర 28 డాలర్లుగా ఉన్నది. డాలరుకు 12.7 రూపాయల ప్రకారం క్వింటాలుకు 354 రూపాయలు అవుతుంది. ధాన్యం ధర క్వింటాలుకు 235 రూపాయలు అవుతుంది. భారతదేశంలో ఈ పంటలు పండిస్తున్న రైతులకు అదనపు మద్దతు ధర ఇవ్వకుండా ఉండాలంటే మూడు దశాబ్దాల

(మిగతా 32వ పేజీలో)

# సాంస్కృతిక రంగంలో ఇఎంఎస్ కృషి




రచయిత కేరళ కమ్యూనిస్టు నాయకుడు, సిద్ధాంత వేత్త. దేశాభిమాని దినపత్రిక మాజీ ఎడిటర్.

**గోవింద పిళ్లై**

కేరళ సాంస్కృతిక జీవనం, కళలు, సాహిత్య రంగాల్లో ఇఎంఎస్ (1909–1998) చేసిన కృషినీ, దాదాపు ఏడు దశాబ్దాలపాటు మలయాళీ సాహిత్యం, భావజాల వివాదాల్లో ఆయన అప్పుడప్పుడూ చేసుకొన్న జోక్యాన్ని తలచుకొంటే మనకు ఫ్రెడరిక్ ఏంగెల్స్ రాసిన **"ఇవల్యూషన్ ఆఫ్ రెనెజాన్స్ పర్సనాలిటీస్ ఆఫ్ యూరప్"** అన్న రచన గుర్తుకొస్తుంది. ప్రకృతి గతి సూత్రాలపై ఏంగెల్స్ చేసిన గొప్ప రచనల్లో అది ఒక భాగం. అయితే అది అసంపూర్తిగా ఉండిపోయింది. "మేధోశక్తిలో, అభిరుచిలో, స్వభావంలో, పాండిత్యంలో, రెనెజాన్స్ పర్స నాటీ దిగ్గజాలని పేర్కొన్నవారి గురించి ఏంగెల్స్ ఇలా చెప్పాడు:

"అప్పటి ఆ కథానాయకులు పని విభజనకు బానిసలు కారు. పని విభజన వల్ల ఉత్పత్తిలో మనిషి ఒక భాగానికే పరిమితం అవుతాడు. వారి వారసుల్లో మనం తరచూ ఆ విషయం గమనిస్తాము. వారు తమ జీవితమంతా ఆనాటి ఉద్యమాల్లో, వాటి ప్రత్యక్ష పోరాటాల్లో ఒకవైపున నిలబడి పాల్గొన్నారు. పోరాటంలో వారు కలం లేదా కత్తి పట్టు కొన్నారు. లేదా వ్యక్తిగానో పోరాడారు. చాలా మంది కత్తి, కలం రెండూ పట్టుకొని పోరాడారు. ఆ పోరాటాల్లోని అన్ని పార్శ్వాల్లోనూ, వారు పాల్గొనడం వల్ల, వారు నిర్వహించిన పాత్ర బలం చేత పరిపూర్ణమైన మనుషులుగా మారారు".

పూర్వకాలంలో భారతదేశంలో "జ్ఞాన యోగి", "కర్మయోగి" అనే పదాలు వాడేవారు. ఇఎంఎస్ జ్ఞానయోగిగా, కర్మయోగిగా రెండు విధాల కృషిచేశారు. కార్మిక వర్గ విప్లవకారుడిగా ఉంటూనే, ప్రతిభావంతుడైన మార్క్సిస్టు – లెనినిస్టు సిద్ధాంతకర్తగా ఆయన పోరాటాల్లో పాల్గొన్నారు. పార్టీ నిర్మాతగా ఆయన బహిరంగ కార్యకలాపాలు నిర్వహిస్తూనే అవసరమై నప్పుడు క్షణకాలంలో అజ్ఞాతంలో వెళ్లేవారు. ఒకవైపు ప్రదర్శనల్లో పాల్గొనేవారు. మరోవైపు బల్లముందు కూర్చుని సంపాదకీయ బాధ్యతలు నిర్వహించేవారు. శాసన సభలోనూ ఆయన రెండు బాధ్యతలు నిర్వహించారు. ప్రతిపక్షంలో కూర్చున్నారు, అధికార పక్షంలోనూ ఉన్నారు. పరిపాలకుడిగా ఆయన అన్ని రంగాల్లోనూ అద్భుత పాత్ర పోషించారు. ఆ బాధ్యతలన్నీ



ఇఎంఎస్ నంబూద్రిపాద్

నిర్వహిస్తూనే చరిత్రకారుడిగా, విమర్శకుడిగా, చైతన్యశీలిగా, సాంస్కృతిక కార్యకర్తగా మలయాళీ సాహిత్యంపై గొప్ప ప్రభావం చూపారు. అందుకు తగినట్లుగా తనను తాను రూపుదిద్దుకొన్నారు. సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో ఆయన చురుగ్గా పాల్గొనడం వల్ల అనేక అద్భుత వ్యాసాలు, కరపత్రాలు, పూర్తిస్థాయి పుస్తకాలు, సమీక్షలు, పత్రికా వ్యాసాలు రాశారు. గొప్ప ఉపన్యాసాలు చేశారు. అయినప్పటికీ అవేవీ తన ప్రధాన లక్ష్యం నుండి ఆయనను దూరం చేయలేదు. అనేక మంది సాధారణ విప్లవకారుల్లా, ప్రత్యేకించి సోషలిస్టు విప్లవకారుల్లాగే సంస్కృతి అన్నది రాజకీయ నిర్మాణంలోనూ, ఆ నిర్మాణాన్ని మార్చడంలోనూ, మానవ సంబంధిత వ్యవహారాల్లోనూ నిర్ణయాత్మక పాత్ర వహిస్తుందని నమ్మారు. సంస్కరణ వాదిగా ఉన్న మొదటి దశలోనూ అనతంతరం రాజకీయ రంగంలోకి ప్రవేశించాక కూడా ఆయన అదే ప్రగాఢ నమ్మకంతో ఉన్నారు. తన ప్రవృత్తి వల్ల, లోతైన అధ్యయనం, విస్తార అనుభవం వల్ల ఇఎంఎస్‌కు అది సాధ్యమైంది.

సమాజంలో సంస్కృతి చూపే ప్రభా వాలపై, సామాజిక పరివర్తనలో దాని పాత్రపై లోతైన అవగాహన గల ఇఎంఎస్, ఆంటోనియో గ్రాంసీ రాసిన "ప్రిజన్ నోట్ బుక్స్" చదివినప్పుడు అప్పటి దాకా తనకున్న అవగాహనే గ్రాంసీకి కూడా ఉందని తెలిసి సంతోషంతో ఆశ్చర్యపోయారు. గ్రాంసీ ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో అమరుడైన నాయకుడని ఇఎంఎస్‌కు చాలా కాలం క్రితమే తెలిసినప్పటికీ, గ్రాంసీని క్షుణ్ణంగా చదవడం తన జీవితంలో చాలా కాలం తర్వాతే సాధ్యమైంది. ఆయన 90వ దశకం ఆరంభంలో గ్రాంసీ "ప్రిజన్ నోట్ బుక్స్" పుస్తకం చూశారు. సమకాలీన మార్క్సిజానికి, విప్లవ ఆచరణకు గాంసీ ఆలోచనలకు ఎంత

ప్రాసంగికత, ప్రాముఖ్యత ఉందో, ఆయనది ఎంత లోతైన అవగాహనో గమనించి ఇఎంఎస్ పొంగిపోయారు. తన స్వభావానికి తగినట్లుగానే వెంటనే గ్రాంసీ రచనలపై ఒక పుస్తకం రాయడానికని ఇతర పుస్తకాల కోసం ఇఎంఎస్ అన్వేషణ మొదలు పెట్టారు. తనకు ఆ పనిలో సహకరించమని ఈ రచయితను కోరారు. ఫలితంగా "గ్రాంసియన్ రెవల్యూషన్ ఆఫ్ థాట్స్" (1996) పుస్తకం వెలువడింది. మలయాళంలో ఆ పుస్తకం పేరు "గ్రాంసియన్ విచార విప్లవం''. ఇఎంఎస్‌కు గ్రాంసీ ఎందుకంత సంతోషం కల్గించాడో చెప్పడం సులభమే. గ్రాంసీ పౌర సమాజం, రాజకీయ సమాజం, భావజాలం, సంస్కృతి, ఆధిపత్యం గురించి చాలా శ్రమకోర్చి విన్నూత్నంగా చెప్పారు. ఆ దృక్పథంతోనే ఇఎంఎస్ దశాబ్దాల తరబడిగా లోతైన అధ్యయనం సాగిస్తున్నారు. తన విస్తృత ఆచరణ వల్ల, అనుభవం గడిస్తున్నారు. ఉపరితల ఉత్పన్నాలంటూ సంస్కృతీ, భావజాలాల పాత్రను పరిమితం చేయకుండా సంస్కృతి, భావజాలం అన్నవి సానుకూల సామాజిక మార్పుకు తొడ్పడే ఉత్ప్రేరకాలుగా ఉపయోగపడతాయన్న తన అవగాహనను ధృవపర్చుకొన్నారు. పునాదిపై ఉపరితలపు సానుకూల ప్రభావం ఉంటుందని మార్క్సిజం చెప్పినప్పటికీ ఆ అవగాహనపై మరింత శాస్త్రీయ దృష్టితో సమగ్రంగా అధ్యయనం సాగించి ఆ అవగాహనను గ్రాంసీ సుసంపన్నం చేశాడు. అందుకోసం బూర్జువా దేశాల ప్రజాస్వామిక విధానం నుండి సుసంపన్న అనుభవాలను తీసుకొన్నారు. కనుక గ్రాంసీ అభిప్రాయాలు, ప్రత్యేకించి భారతీయ కార్మిక వర్గ ఉద్యమానికి ఎంతో దోహదపడతాయని ఇఎంఎస్ భావించారు. పండిన వయస్సులో కూడా ఇఎంఎస్ కొత్త ఆలోచనలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండేవారని దీన్ని బట్టి అర్థమవుతుంది.

"కళ, సాహిత్యం, సంస్కృతిపై సుదీర్ఘకాలం ఇఎంఎస్ చేసిన అధ్యయనం, ఆలోచనల పరిణామ ప్రక్రియకు గ్రాంసీ కనుగొన్న విషయాలు, చేసిన అన్వయాలు మరింత తోడ్పడ్డాయి. 20వ శతాబ్దపు రెండవ దశకంలో ఒక విద్యార్థిగా నంబూద్రి బ్రాహ్మణ సంస్కరణోద్యమంలో ఇఎంఎస్ చురుగ్గా పాల్గొన్నారు."

### నిర్మాణాత్మక సంవత్సరాలు

కళ, సాహిత్యం, సంస్కృతిపై సుదీర్ఘకాలం ఇఎంఎస్ చేసిన అధ్యయనం, ఆలోచనల పరిణామ ప్రక్రియకు గ్రాంసీ కనుగొన్న విషయాలు, చేసిన అన్వయాలు మరింత తోడ్పడ్డాయి. 20వ శతాబ్దపు రెండవ దశకంలో ఒక విద్యార్థిగా నంబూద్రి బ్రాహ్మణ సంస్కరణోద్యమంలో ఇఎంఎస్ చురుగ్గా పాల్గొన్నారు. నంబూద్రిల్లో సంస్కరణ కోసం "యోగక్షేమ సభ'' అనే సంస్థ ఇఎంఎస్ పుట్టుకకు ఏడాది ముందు ఏర్పడింది. ఇఎంఎస్, విటి భట్టాద్రి పాద్, ఎంఆర్ భట్టాద్రిపాద్, ఎంపి భట్టాద్రిపాద్ వంటి యువ రాడికల్స్ ఆ సభలో చేరి చురుగ్గా పాల్గొంటున్న దశలో అది ఒక మోస్తరు సాంప్రదాయ వాదుల చేతుల్లో ఉండేది. స్త్రీ విద్య, వితంతువులకు పునర్వివాహ హక్కు, బహుభార్యత్వంపై నిషేధం వంటి అంశాలు ఆ సభ యువకార్యకర్తల ఎజెండాలో ఉండేవి. యువ నంబూద్రీల కార్యక్రమాలకు త్రిసూర్ కేంద్రంగా ఉండేది. త్రిసూర్‌లో 1929లో ఇఎంఎస్ ఇంటర్మీడియెట్ చదవడానికి సెయింట్ థామస్ కళాశాలలో చేరారు. ఆ వెంటనే సుడిగాలి వంటి ఆ ఉద్యమం ఆయన్ని లాక్కెళ్లింది. అదే సంవత్సరంలో సభ "ఉన్నా నంబియాద్రి'' అనే వారపత్రికను ప్రారంభించింది. ఆ పత్రిక నిర్వహణను పూర్తిగా సభలోని యువబృందం చేపట్టింది. నిర్వహణలో కొందరు పెద్ద వయస్సు వారున్నా ఆచరణలో 20 ఏళ్ల ఇఎంఎస్ దానికి సంపాదకుడయ్యారు. పత్రికకు తానే ప్రధాన రచయిత అయ్యారు. 20 ఏళ్లు వచ్చే నాటికే ఆ యువకుడు పత్రిక కర్తవ్యాలను నెరవేర్చగలడనీ, దాని ప్రతిష్టను నిలబెట్టగలడనీ పెద్దల్లో నమ్మకం ఏర్పడింది. వారి నమ్మకం వమ్ము కాలేదు. ఇఎంఎస్ కలం నుండి వ్యాసాలు, కాలమ్స్, కార్యకలాపాల రిపోర్టులు, పుస్తక సమీక్షలు, సాహితీ ప్రవచనాలు వెలువడేవి. రాత, ఎడిటింగ్, సాహితీ విమర్శలు చేయడంలో "ఉన్నా నంబూద్రి" తనకు శిక్షణ నిచ్చిందని ఇఎంఎస్ తన ఆత్మకథలో చెప్పుకొన్నారు. కళాశాలలో గడిపిన ఆ మూడేళ్ల (1929-32) లోనే తన రాజకీయ అప్రెంటిషిప్ కూడా పూర్తయిందని రాసుకొన్నారు. టీచర్ల నుండి సహ విద్యార్థుల నుండి ప్రశంసలు పొందారు. ఆ దశలో మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపుపై దేశమంతా ఉవ్వెత్తున లేచిన శాసనోల్లంఘన ఉద్యమంలో ఇఎంఎస్ చేరారు. డిగ్రీ పూర్తి చేయకముందే ఆయన కళాశాలను వదిలేశారు. కోజికోడ్‌కు వెళ్లి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యాడు. జైలు శిక్షపడింది. 1932లో కుదిరిన "గాంధీ - ఇర్విన్'' ఒప్పందం వల్ల ఉద్యమం అకస్మాత్తుగా ఆగిపోయింది. దేశ వ్యాపితంగా కాంగ్రెస్‌లోని యువకులకు ఆశాభంగం కల్గించినట్లే ఇఎంఎస్‌కు కూడా ఆశాభంగం కల్గింది. గాంధీ పట్ల, కాంగ్రెస్ మితవాద నాయకత్వం పట్ల ఇఎంఎస్, అతని సమీప సహచరులైన క్రిష్ణ పిళ్లై, ఎ.కె. గోపాలన్ మరికొందరితోపాటు అసంతృప్తితో జైలు నుండి విడుదలై వచ్చారు. కన్నూరు కేంద్ర కారాగారంలో కాంగ్రెస్ యువ రాడికల్స్‌కు బెంగాల్ నుండి వచ్చిన అనేక మంది మిలిటెంట్ రెవల్యూషనరీలను కలిసే అవకాశం లభించింది. బెంగాల్ నుండి వచ్చిన ఆ రెవల్యూషనరీలను ప్రభుత్వం టెర్రరిస్టులుగా ముద్రవేయగా. అసంతృప్తుల ముందు మాత్రం నూతన వామపక్ష ప్రపంచం, రాడికల్ ఆలోచనలు ఆవిష్కృతమయ్యాయి.

జైలు నుండి విడుదలయ్యే నాటికే ఇఎంఎస్ ప్రసిద్ధుడయ్యాడు. తన వయస్సుకు, అనుభవానికి మించి ఎదిగారు అప్పటి ప్రసిద్ధ రచయిత, ఇఎంఎస్ కంటే వయస్సులో చాలా పెద్దవాడైన ముత్రింగట్ భవత్రాతన్ నంబూద్రిపాద్ 1953లో తాను రాసిన ప్రసిద్ధ "అఫంతే మకల్ (మామ కూతురు) నవలకు పరిచయం రాయమని ఇఎంఎస్‌ను కోరారు. బ్రాహ్మణ కుటుంబాల్లో మొదటి కుమారుని వారసత్వ పద్ధతి వల్ల వచ్చే చట్టపర వైరుధ్యాలను, భావోద్వేగాలను తదుపరి పుత్రులు ఎదుర్కోవలసి వచ్చేది. ఆ విధానాల వల్ల సంతానంలోని చిన్నవారు పడే ఇబ్బందులను ఆ నవల చూపెడ్తుంది. అప్పటికి ఇఎంఎస్ మార్క్సిస్టు కాలేదు. అయినప్పటికీ ఆ నవలకు రాసిన పరిచయంలోనే ఇఎంఎస్ సామాజిక, సాంస్కృతిక విమర్శలో మార్క్సిజం వైపు వెళ్తున్నారన్న విషయం బయటపడింది.


ఇఎంఎస్, ఆయన యువ సహచరులు

" సామాజిక క్లాసికల్ నుండి దామోదరన్ వర్గపోరాటంపై రాసిన ధారావాహిక రచనలు పురోగామి భావాలవైపు బాట వేశాయి. కేరళలోని ఆనాటి సామాజిక రాజకీయ పరిస్థితికి అవి ఉపమానాలు. కళారంగంలో ముందడుగు వేసిన తరహాలోనే కేరళలోని సామాజిక, రాజకీయ రంగాల్లోనూ మార్పు చోటు చేసుకొంది. ఆ దశాబ్ధిలోనే ఆధునిక కేరళ ఆకృతులు రూపుదిద్దుకొన్నాయి. "

తమ తొలినాళ్లలో సామాజిక, రాజకీయ పోరాటంలో కళారంగాన్ని కూడా వినియోగించారు. ఇఎంఎస్ కళాశాలలో చేరిన సంవత్సరంలోనే అంటే 1924లో "యోగక్షేమ సభ"లో తనకు సీనియర్ సహచరుడైన విటి భట్టాద్రిపాద్ ఒక నాటకం రాశారు. దాని పేరు "అదుక్కలాయిల్ నిన్ను అరంగతెక్కు" (వంటిల్లు నుండి రంగంపైకి). నంబూద్రి మహిళలు ఎదుర్కొంటున్న అసమానతను, అణచివేతను ఆ నాటకం చాటి చెబుతుంది. ఇఎంఎస్ తన కౌమార దశలో కొన్ని కవితలు రాసినప్పటికీ ఆ తర్వాత సృజనాత్మక రచనకు పూనుకోలేదు. కాని నాటక బృందాల్లో, నాటక ప్రదర్శనల నిర్వహణలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనేవారు. విటి రాసిన ఆ నాటకం గొప్ప విజయం సాధించింది. నంబూద్రి సమాజంలో సంచలనం సృష్టించింది. అదే మార్గంలో మరికొన్ని నాటకాలు వచ్చాయి. వాటిపేర్లు మారక్కుడ కుళ్ళిలే మహానరకం(మహానగరంలో గొడుగు చాటున మొహం దాచడం మహానరకం) రుతుమతి (యుక్త వయస్సురాలు). ఈ పునరుత్థాన ప్రక్రియలో పరాకాష్ట కె దామోదరన్ రాసిన పట్టాబక్కి (అద్దె బకాయి) నాటకం.

### సజీవ సాహిత్యం

గత నాటకాల మాదిరిగా సామాజిక, కుటుంబ సమస్యలపై కాకుండా దామోదరన్ నాటకం నేరుగా భూస్వాములు – రైతుల మధ్య సాగే వర్గపోరాటాన్ని ఎత్తుకొంది. నాటకానికి ముందు అదే అంశంపై చంగం పూజ క్రిష్ణన్ పిళ్లై రాసిన వివరణాత్మకమైన పాట 'వజ్ఞకుళ' (అరటిగెలను)ను పాడేవారు. విటి రాసిన సామాజిక క్లాసికల్ నుండి దామోదరన్ వర్గపోరాటంపై రాసిన ధారావాహిక రచనలు పురోగామి భావాలవైపు బాట వేశాయి. కేరళలోని ఆనాటి సామాజిక రాజకీయ పరిస్థితికి అవి ఉపమానాలు. కళారంగంలో ముందడుగు వేసిన తరహాలోనే కేరళలోని సామాజిక, రాజకీయ రంగాల్లోనూ మార్పు చోటు చేసుకొంది. ఆ దశాబ్ధిలోనే ఆధునిక కేరళ ఆకృతులు రూపుదిద్దుకొన్నాయి. కేరళలోని ఉత్తర భాగం మద్రాసు రాష్ట్రంలో బ్రిటిష్ పాలన కింద ఉండేది (కొచ్చి, ట్రావెంకోర్‌లు స్థానిక రాజుల కింద ఉండేవి) బ్రిటిష్ పాలన కింద ఉన్న ప్రాంతంలోని ప్రజలకు ప్రజాస్వామ్య అభిరుచి ముందుగా కల్గింది. 1937లో భారత ప్రభుత్వ చట్టం (1935) కింద రాజగోపాలా చారి మద్రాసు రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆ ఏడాదే క్రిష్ణ పిళ్లై కార్యదర్శిగా ఇఎంఎస్ నంబూద్రిపాద్, ఎన్‌సి శేఖర్, కె దామోదరన్ సభ్యులుగా భారత కమ్యూనిస్టు పార్టీ తొలిశాఖ ఏర్పడింది. దానికి ఒక ఏడాది ముందు ట్రావెంకోర్ రాజ్యంలో "అంటరాని వారి" ప్రవేశానికి అన్ని గుడుల తలుపులు తెరుచుకొన్నాయి. ఆ మరుసటి సంవత్సరం ట్రావెంకోర్‌లో కూడ ప్రాతినిధ్య ప్రభుత్వం ఏర్పరచాలని కోరుతూ పెద్ద పెద్ద పోరాటాలు మొదలయ్యాయి.



కేరళ ప్రజలను ఉర్రూతలూగించిన "నీవు నన్ను కమ్యూనిస్టును చేశావు" నాటక ప్రదర్శన: ఈ నాటకంపై ఇఎంఎస్ ఒక ప్రామాణికమైన విమర్శ రాశారు.

ఈ చారిత్రక పోరాటాలకు తలమానికం లాంటిది "కేరళ జీవత్ సాహిత్య సంఘం" (కేరళ సజీవ సాహిత్య సంఘం) ఆవిర్భావం. అది తరువాత ఏర్పడిన 'పురోగమన సాహిత్య సంఘం (1937)కు అది తొలిమెట్టు. 1936లో లక్నోలో ప్రసిద్ధ రచయిత ప్రేమ్‌చంద్ అధ్యక్షతన జరిగిన ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోషియేషన్ సంస్థాపక మహాసభ ప్రేరణతో కేరళ పురోగమన సాహిత్య సంఘం ఏర్పడింది. ఇఎంఎస్ నంబూద్రిపాద్, కె దామోదరన్, ఎ మాధవన్, కెపిజి నంబూద్రి, కెఏ దామోదర మీనన్ వంటి వామపక్ష కాంగ్రెస్ వాదులు సంఘం ఏర్పాటుకు చొరవ తీసుకొన్నారు. త్రిసూర్‌లో సమావేశమైన ఈ బృందానికి సైద్ధాంతిక నాయకుడు ఇఎంఎస్. ఆయన మాతృభూమి పత్రికలో (1937 జులై 19న) ''జీవత్ సాహిత్యం సౌందర్య బోధవం'' (సజీవ సాహిత్యం – సౌందర్యం) అన్న శీర్షికతో ఒక వ్యాసం రాశారు. అది ఉద్యమానికి తొలినాళ్లలో ప్రణాళికగా పనిచేసింది. భాషా సౌందర్యాన్ని పురోగామి సాహిత్యం పట్టించుకోదనీ, తక్కువ చేసి చూస్తుందనీ వచ్చిన విమర్శలకు ఇఎంఎస్ ఆ వ్యాసంలో సమాధానమిచ్చారు. మలయాళ సాహిత్యం, కళల అభివృద్ధిలో సామాజిక, చారిత్రక అంశాలను మార్క్సిస్టు కోణంలో అన్వయించడం బహుశా అది మొదటిసారి కావచ్చు. పిడబ్ల్యుఏ ఆవిర్భావం, అలాగే ఇఎంఎస్ 1937లో రాసిన వ్యాసం కేరళలో ప్రతిధ్వనులు సృష్టించాయి. రాబోయే ఆరు దశాబ్దాల మలయాళీ సాహిత్యోద్యమానికి ఆ రెండూ ప్రయోగ వేదికలుగా పని చేశాయి.

ఇఎంఎస్ తన వ్యాస సంకలనాలకు 1947లో పరిచయం రాస్తూ ఆ పరిణామాల మూల్యాంకనం చేశారు.

"జీవత్ సాహిత్య ఉద్యమం" 1937లో పురుడు పోసుకొన్నప్పుడు దాని సంస్థాపకులకూ, సాంప్రదాయ రచయితలకూ మధ్య "కళకళకోసమా లేక సామాజిక మార్పు కోసమా? అన్న వివాదం తలెత్తింది. జీవత్ సాహిత్య సమర్థకులు కళ కేవలం సామాజిక

> **“ కళ “కళకోసమే” అన్న వాదన దాదాపు సద్దుమణిగింది. కాని సామాజిక పురోగతి అంటే ఏమిటి? అన్న అంశంపై వివాదం తలెత్తింది. బ్రిటీష్ వారు దేశం వదలి వెళ్లి, దేశం కాంగ్రెస్ చేతుల్లోకి వచ్చాక ఆ వివాదం మరింత ఉధృతమైంది. ”**

అభివృద్ధి కోసం మాత్రమే కాదు, దానికి సామాజిక అభివృద్ధి, సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్యూడల్ వ్యతిరేక సోషలిస్టు అనుకూలమైన లక్ష్యం ఉండాలని గట్టిగా వాదించారు. మరోవైపు సాంప్రదాయ వాదులు దాన్ని వ్యతిరేకించారు.

జీవత్ సాహిత్య ఉద్యమంలో పాల్గొన్న వామపక్షవాదులు రైతు, కార్మిక వర్గపోరాటాల్లోనూ పాల్గొన్నారు. అలాగే 1930–32లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్న వారిలో చాలా మంది ప్రసిద్ధ రచయితలు 1943–44లో జీవత్ సాహిత్య ఉద్యమంలో చేరారు. నిర్దిష్టమైన సామాజిక అవగాహనతో, సామాజిక పురోగతి కోసం రచనలు అన్న లక్ష్యాన్ని ఆమోదించారు. “మారిన పరిస్థితుల్లో అభ్యుదయ రచయితల ఉద్యమం విస్తృతమైంది. వామపక్ష కార్యకర్తలు మాత్రమే కాదు. వామపక్ష కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనని వారు కూడా ఆ ఉద్యమంలో చేరారు. 1944లో ఇఎంఎస్ సూచన ప్రకారం సంఘం పేరును పురోగమన సాహిత్య సంఘంగా అంటే అఖిల భారత స్థాయి తరహాలో అభ్యుదయ రచయితల సంఘంగా మార్చారు.

ఆ దశకు వచ్చే సరికి కళ “కళకోసమే” అన్న వాదన దాదాపు సద్దుమణిగింది. కాని సామాజిక పురోగతి అంటే ఏమిటి? అన్న అంశంపై వివాదం తలెత్తింది. బ్రిటీష్ వారు దేశం వదలి వెళ్లి, దేశం కాంగ్రెస్ చేతుల్లోకి వచ్చాక ఆ వివాదం మరింత ఉధృతమైంది.

**స్వాతంత్ర్యం – అణచివేత**

ఆ విభేధాలు రాజకీయ కోణాలను ఇముడ్చుకొని బహిరంగ వివాదాలుగా అవి ముందుకొచ్చాయి. కమ్యూనిస్టులపై వారి నాయకత్వంలోని ప్రజా ఉద్యమాలపై కాంగ్రెస్ ప్రభుత్వాలు దాడులకు పూనుకొన్నాయి. కమ్యూనిస్టులు అజ్ఞాతంలోకి వెళ్లి మారుపేర్లతో శత్రువులను తిప్పికొట్టారు. కేరళలోని కవుంబాయి, మున్నుయన్‌కున్ను, పడికున్ను, పరియారం, ఓంచియం వంటి చోట్ల హింసాత్మక ఘర్షణలు జరిగాయి. వీరోచిత తెలంగాణ సాయుధ పోరాట ఘటనలు కమ్యూనిస్టుల పోరాట పటిమకు మరింత పదును పెట్టాయి. కలకత్తాలో జరిగిన ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 2వ మహాసభ రాజకీయ విధానం ఒంటెత్తు వాదంతో ఉందని ఆ తర్వాత కాలంలో దాన్ని వదిలిపెట్టారు. కమ్యూనిస్టులపై విరుచుకుపడటానికి కమ్యూనిస్టు వ్యతిరేకులకు అవకాశం దొరికింది. అవన్నీ 1949లో పిడబ్ల్యుఏలో చీలికకు కారణమయ్యాయి. చాలా పేరు ప్రఖ్యాతులు గల ఎంపి పాల్, జోసెఫ్ ముండస్సెరీ వంటి విమర్శకులు, తక్కాజి శివశంకర పిళ్లై, పి కేశవసేన్ వంటి సృజనాత్మక రచయితలు కమ్యూనిస్టులను ఇతర సహచరులను వదలి అటువైపు వెళ్లారు. మార్క్సిస్టుల తరపున మార్క్సిస్టు పండితులైన ఎంఎస్ దేవదాస్. సి ఉన్నిరాజా, కెకె వారియర్ తదితరులతో కలిసి ఇఎంఎస్ పోరాటం నడిపారు. కమ్యూనిస్టుల వైపు కొన్ని లోపాలున్నప్పటికీ ఆ పోరాటం వృధాకాలేదు. కనుకే ఇఎంఎస్ ఆనాటి వ్యాసాలను ఏమాత్రం సరిచేయకుండా వాటిని మళ్లీ ముద్రించడానికి పూనుకొన్నారు. ప్రమాదభరిత స్థితిలో తాను, తన సహచరులు చేసిన పొరపాట్లను ఎలాంటి శషభిషలు లేకుండా ఇఎంఎస్ అంగీకరించారు. అందులోని సానుకూల అంశాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రతికూల అంశాలను మాత్రమే చూసిన మిత్రులను ఇఎంఎస్ పూర్తిగా వ్యతిరేకించారు. సాంస్కృతిక భావనలు, అచరణల్లోలాగే రాజకీయాల్లో కూడా అప్పుడప్పుడు దారి తప్పినప్పటికీ తాము ఎంచుకొన్న విధానం నుండి దూరం కాలేదు. ఆనాటి ఘటనలను, ఆ తర్వాతి సంవత్సరాల్లో జరిగిన ఘటనలను న్యాయబద్ధంగా బేరీజు వేసుకొని చూస్తే బ్యాలెన్స్ షీటులో చెడు కంటె మంచి ఎక్కువ కన్పిస్తుందని ఇఎంఎస్ పేర్కొన్నారు.

“మార్క్సిస్టు లెనినిస్టు సాహిత్య సిద్ధాంతంలో సంభవించిన మార్పులను పూర్తిగా అర్థం చేసుకోకుండా 1947 – 52 మధ్యకాలంలో మేము సాహితీ చర్చల్లో పాల్గొనేవారం. అదే కాకుండా ఇంతకు ముందు ఒప్పుకొన్నట్లుగానే కమ్యూనిస్టు పార్టీ రాజకీయ ఆచరణలో కొన్ని చోట్ల దారి తప్పింది. ఈ రెండింటి వల్ల ఆ సంపుటిలోని మొదటి నాలుగు వ్యాసాల్లో తప్పులు దొర్లాయి.

ఈ పరిస్థితులన్నీ దృష్టిలో ఉంచుకొని చూస్తే ఆ తర్వాతి కాలంలో మరిన్ని తప్పులు, దారి తప్పడాలు జరగకపోవడం ఆశ్చర్యం కల్గిస్తుంది. దానికి కారణం ఉంది. అదేమిటంటే కమ్యూనిస్టులకు మౌలికంగా వర్గదృష్టి ఉంటుంది. సైద్ధాంతికంగా జరిగిన కొన్ని తప్పుల వల్ల వారిలో వర్గదృష్టి చచ్చుబడదు. వారికి ఉన్న సామాజిక – రాజకీయ దృక్పథం మొత్తం శ్రామిక వర్గంపై, ప్రత్యేకించి కార్మిక వర్గంపై గట్టిగా ఆధారపడి ఉంటుంది. ఆచరణలో జరిగిన తప్పులు, దారి తప్పడాలు దానిమీద ఆధారపడి జరిగినవే. ఆ తప్పులను కమ్యూనిస్టులు గమనించి లోపాలను అధిగమించడానికి తమ దృక్పధాన్ని సరిచేసుకోవాలి. కాని దానికి బదులుగా వర్గ దృక్పథానికే పూర్తిగా నీళ్లొదిలే రివిజనిస్టు ప్రయత్నం మొదలైంది. దాని కారణంగా పార్టీలో చీలిక సంభవించింది.

“రాజకీయ ఆచరణల్లో మాదిరిగానే సాహిత్య సాంస్కృతిక రంగాల్లోనూ ఆ ధోరణి విస్తరించింది. కమ్యూనిస్టులు కాని వారిపై కమ్యూనిస్టులు చేసే సైద్ధాంతిక పోరాటాన్ని కూడా వారు పూర్తిగా ఖండించడం మొదలు పెట్టారు. మౌలిక మార్క్సిస్టు సిద్ధాంతాన్ని కూడా పూర్తిగా నిరాకరించే వరకు ఆ ధోరణి వెళ్లింది”.

**వివాదాంశాలు**

కమ్యూనిస్టులకు, కమ్యూనిస్టులు కాని వారికీ మధ్య బహిరంగంగా వివాదాలు వ్యక్తం కావడంతో పాటు సాహిత్యరంగంలో కూడా రెండు వివాదాస్పద అంశాలు ముందు కొచ్చాయి. అవి సాహిత్య వివాదాలకంటే ఎక్కువగా రాజకీయపరమైన వివాదాలు. అందులో ఒకటి మనం ముందు చెప్పుకొన్న “కళ కళ కోసమే” అన్న నినాదం. 1943–44 సంవత్సరాలలో అభ్యుదయ చరయితల సంఘం భిన్న రాజకీయ, సైద్ధాంతిక

**❝ కళ "కళకోసమే" అన్న వాదన దాదాపు సద్దుమణిగింది. కాని సామాజిక పురోగతి అంటే ఏమిటి? అన్న అంశంపై వివాదం తలెత్తింది. బ్రిటీష్ వారు దేశం వదలి వెళ్లి, దేశం కాంగ్రెస్ చేతుల్లోకి వచ్చాక ఆ వివాదం మరింత ఉధృతమైంది. ❞**

అవగాహనగల రచయితలకు కూడా వీలైనమేరకు భాగస్వామ్యం కల్పించింది. కొన్ని అంశాలు ఆ దశలో అపరిష్కృతంగా ఉ ండిపోయాయి. స్వాతంత్ర్యం తర్వాత ప్రత్యేకించి 1950 దశకంలో క్రిష్టోఫర్ కాడ్వెల్, రాల్ఫ్ పాక్స్, జార్జి లుకాస్, ఫ్రాంజ్ మెహరింగ్ తదితర రచయితలు మార్క్సిస్టు క్లాసిక్స్‌పైనా, మార్క్సిస్టు సౌందర్య శాస్త్రంపైనా అనేక పుస్తకాలు తెచ్చారు. సాహిత్యానికి సంబంధించిన అంశాలపై ఇఎంఎస్ ఇతర మార్క్సిస్టు విమర్శకులు తమ అవగాహనను పెంచుకోవడానికి ఆ రచనలు దోహద పడ్డాయి. ఆ కొత్త అంతర్‌దృష్టితో దశాబ్దంన్నర పాటు, సాహిత్య రంగంలో తాము గడించిన సుసంపన్న అనుభవంతో ఇఎంఎస్ మలయాళ సాహిత్య విమర్శలో కొత్త ఆలోచనలు సృష్టించారు. ఆయన తన మాటల్లోనే వాటిని ఇలా సంగ్రహపరిచారు:

"సామాజిక పురోగతి లక్ష్యంగా రచనలు చేయాలి. రచయితకు సామాజిక పురోగతి కర్తవ్యం గావాలి. ఇవన్నీ నిర్వివాద అంశాలే అయితే దానితో మాత్రమే సమస్య పరిష్కారం కాదు. ఎందుకంటే సాహితీ ప్రపంచంలోని గొప్ప రచయితలు, రచయిత్రులు తమ రచనల నుండి పుట్టుకొచ్చే ఆలోచనలను స్పృహతో గమనించరు. అయినప్పటికీ వారు సృష్టించిన చాలా రచనలు సమాజ పురోగతికి ప్రత్యక్షంగా తోడ్పడుతాయి. ఆ రచనలు చేస్తున్నప్పుడు వారు అలాంటి భావనలను స్పృహతో గమనించక పోవచ్చు. కొన్ని సందర్భాల్లో పురోగతిని వ్యతిరేకించే రచయితలు కూడా తమ భావాలకు వ్యతిరేకంగా రాయవచ్చు".

ఈ వాదనను నిరూపించడానికి ఇఎంఎస్ గొప్ప ఫ్రెంచి నవలాకారుడు హోనర్ ది బాల్జక్ పై మార్క్స్, ఎంగెల్స్ చేసిన రచన మీద, టాల్‌స్టాయిపై లెనిన్ చేసిన రచన మీద ఆధారపడ్డారు. బాల్జక్ రాజరికానికి, ఫ్యూడల్ విధానానికి విధేయుడయినా వాస్తవిక దృష్టితో ఆయన రాసిన నవలలు ఫ్యూడల్ వ్యవస్థ క్షీణతనూ, అలాగే నూతన బూర్జువ వర్గం, కార్మిక వర్గం సృష్టిస్తున్న ప్రకంపనలనూ చాటాయి.

రచియత స్వీయమానసిక ధోరణికి రచనలో అనుసరించాల్సిన నిష్పక్షపాతానికి మధ్య ఘర్షణ ఏర్పడవచ్చు. ఆ రచన విస్తృత సాహితీ వీక్షణకు, కళాత్మక మూల్యాంకనానికి అవకాశం కల్గించవచ్చు. తన ఈ వాదనను నిరూపించుకోవడానికి ఇఎంఎస్ ప్రముఖ మలయాళీ నవలా రచయిత చందు మీనన్ రచలనూ, మలయాళ కవిత్వంలో వినూత్న మార్గాన్ని సృష్టించిన మహాకవి కుమరన్ ఆసన్ రచనలనూ ఉదహరించారు. 19వ శతాబ్దానికి చెందిన నవలా రచయిత చందు మీనన్ ఉ మ్మడి కుటుంబాన్నీ, మాతృసంబంధ వారసత్వాన్నీ సమర్థించే వారు. కాని ఆయన రచన ఇందులేఖ కాలం చెల్లిన ప్రమాదకరమైన ఆ ఆచారాలను గట్టిగా విమర్శించింది. అంటరాని కులానికి చెందిన కుమారన్ ఆసన్ 20వ శతాబ్దపు కవిత్వాన్ని విప్లవీకరించారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా గొప్పపోరాటం చేశారు. ఆయన జాతీయోద్యమంలోని అగ్రకుల నాయకుల పట్ల అవిశ్వాసం వ్యక్తం చేశారు. ఆయనే విదేశీ పాలకుల నుండి బహుమతులు, బిరుదులు స్వీకరించి తాను వారికి అనుకూలమైన వాడేమో అన్న భావన కల్గించాడు. కానీ ఆయన సమకాలికుడు వల్లతోల్ గట్టి జాతీయవాది. ఆయన జీవితంలోనూ, కవిత్వంలోనూ జాతీయవాది గానే ఉన్నారు. హాసన్ సాగించే కుల వ్యతిరేక పోరాటాన్ని విమర్శకులు కొనియాడేవారు. కాని ఆయన బ్రిటిష్ పాలకులను సమర్థిస్తున్నాడన్న భావనతో ఆ విషయంలో ఆయన్ని ఖండిచేవారు. హాసన్ పట్ల కలిగిన ఆ భావనతో ఇఎంఎస్ అంగీకరించలేదు. స్వాతంత్ర్యోద్యమం బహుముఖమైంది. అందులో అనేక పాయలున్నాయి. హాసన్ కులవ్యతిరేక పోరాటం చాలా ముఖ్యమైంది. అది జాతీయ విముక్తి ఉద్యమాన్ని దృఢపరిచేదే. హాసన్‌ను తప్పుబట్టడమంటే స్వాతంత్ర్యోద్య మంలో దళితుల పోరాటాన్ని తక్కువ చేసి చూడటం వంటిదే. నిజానికి గాంధీ, ఇతర మితవాద నాయకులు వర్గపోరాటాలను వ్యతిరేకించారు. బూర్జువాల పట్ల, భూస్వాముల పట్ల వ్యతిరేకత చూపితే వారిని బ్రిటిష్ వ్యతిరేక పోరాటం నుండి దూరం చేసుకోవడమేనని గాంధీ వంటి వారు చెప్పిన విషయాన్ని ఇఎంఎస్ గుర్తు చేశారు.

ఇఎంఎస్ వాదించిన, ఆచరించిన మార్క్సిస్టు వైఖరి మలయాళ సాహితీ విమర్శల్లో కొత్త కోణాన్ని చూపెట్టింది. రచనపై చేసే విశ్లేషణ ద్వారా ఆయన సరైన మార్క్సిస్టు కోణాన్ని చెప్పారు. దానివల్ల రచయితల కళాకారుల ఐక్య ఉద్యమానికి విశాల భూమిక ఏర్పడింది. ఆ కారణంగా ఒంటెత్తువాద ఆంతరంగిక పోరాటం వల్ల ఏర్పడిన గాయాలను మాన్పుకొనే అవకాశం కల్గింది.

*(ది మార్క్సిస్ట్ జనవరి – జూన్ 1998 సంచిక నుండి..)*

**(మిగతా వచ్చే సంచికలో)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

పుస్తక పరిచయం

# టియు కార్యకర్తలు నేర్వదగ్గ పాఠం

# "రీటా నేర్చిన పాఠం"



రచయిత సిఐటియు
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**- సీహెచ్ నరసింగరావు**

**వా**మపక్ష పార్టీల్లో పనిచేసే వారికి బృందా కరత్ గురించి తెలియని వారుండరు. ఆమె అసలు పేరు "రీటా". ఎమర్జెన్సీలో "బృందా కరత్"గా మారుపేరు పెట్టుకున్నారు. బృందా కరత్ కమ్యూనిస్టు జీవితం ఎంతో విలక్షణం. ఉన్నత కుటుంబం నుంచి వచ్చి, ఉన్నత విద్య అభ్యసించారు. ఎయిర్ ఇండియాలో ఉద్యోగం చేశారు. ఎయిర్ ఇండియాలో పనిచేసే మహిళలు స్కర్ట్, షర్ట్‌లు మాత్రమే వేసుకోవాలనే నిబంధనపై పోరాడి చీరకట్టుకోవడానికి ఇష్టమైన వారందరికీ అనుమతించాలనే హక్కు సాధించారు. వియత్నాంపై అమెరికా యుద్ధానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారు. మార్క్సిస్టుగా మారడానికి వియత్నాం యుద్ధమే ప్రేరణ అని ఆమె రాశారు. ఉద్యోగం వదిలి లండన్ నుంచి వచ్చి కఠినమైన ఎమర్జెన్సీ కాలంలో ఢిల్లీలో ట్రేడ్ యూనియన్ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుండి అదే నిబద్ధతతో పని చేస్తున్నారు. ఆమె యూనివర్సిటీ మేధావుల మధ్య ఎంత స్పష్టంగా మాట్లాడగలదో అత్యంత వెనుకబడిన గిరిజన ప్రజల్లో కూడా అంతే స్పష్టంగా మాట్లాడగల మాస్ లీడర్.

బృందా కరత్ ఎమర్జెన్సీలో రహస్యంగా ఢిల్లీలోని కార్మిక రంగంలో పనిచేశారు. 'రీటా నేర్చిన పాఠం' పేరుతో ఆమె రాసిన ఎమర్జెన్సీ జ్ఞాపకాలు ప్రతి ట్రేడ్ యూనియన్ కార్యకర్త చదవడం ఎంతో అవసరం. ఆ కాలంలో అనుభవాలు నేటి తరం ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు ఎదుర్కొనే అనేక సమస్యలకు ఆచరణలో పరిష్కారం చూపుతున్నాయి. గత 40 సంవత్సరాల నుండి బృందాతో సన్నిహితంగా సంబంధాలున్న నాకే ఈ పుస్తకం చదివే వరకు ఆమెకు ట్రేడ్ యూనియన్‌లో ఇటువంటి మంచి అనుభవాలు ఉన్నాయని తెలియదు. ఈ పుస్తకం ద్వారా ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు, నాయకులు నైపుణ్యంగా ఎలా పనిచేయాలో నేర్చుకోవచ్చు.

ఎమర్జెన్సీ రహస్య కాలంలో బృందా స్వయంగా ఎలా పనిచేశారో వివరించారు. నేడు ఎమర్జెన్సీ లేదు. కానీ టియు పనిలో అంతకంటే అధ్వాన్న పరిస్థితులున్నాయి. అడుగడుగునా ఆటంకాలు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం, యాజమాన్యాలు ఒక్కటై కార్మికవర్గంపై ముప్పేట దాడి సాగిస్తున్నాయి. ముఖ్యంగా బి.జె.పి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మతోన్మాదాన్ని జోడించి కార్మికవర్గంలో తీవ్రంగా చీలికలు తీసుకొస్తున్నాయి. ఎమర్జెన్సీకి ముందు కంపెనీల గేట్లు ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉండేవి. గేట్ మీటింగ్‌లు, కరపత్రాలు పంచడం, ధర్నాలు చేయడం, నోటీసులు అంటించడం, పోస్టర్లు వేయడం అన్నింటికీ కేంద్రాలు కంపెనీల గేట్లే. ఎమర్జెన్సీలో అన్నీ బంద్ అయ్యాయి. ఎమర్జెన్సీ తర్వాత కార్మికపోరాటాలు మరింత ఉధృత స్థాయిలోకి వెళ్లాయి.




కానీ 1991 సరళీకరణ విధానాల ఫలితంగా నేడు పరిస్థితి పూర్తిగా తారుమారయ్యింది. గేట్ల వద్ద గుమికూడితే సీసీ కెమేరాల్లో వెతికి వేటాడి యాజమాన్యాలు వేధిస్తున్నాయి. ఉద్యోగం నుండి తొలగిస్తున్నాయి. కానీ బృందా పోలీసులకు చిక్కకుండా ఎమర్జెన్సీ కాలమంతా పనిచేయడం ''వీరోచితం''గా అనిపించిందని తన జ్ఞాపకాల్లో రాసుకున్నారు. నివాస ప్రాంతాల్లో ఎలా పని చేయాలో చక్కని అనుభవాలు ఈ పుస్తకంలో మనకు బృందా అందించారు. జహంగీర్‌పురి అనే

**❝ మత విద్వేషం అంటువ్యాధిలాగా నేడు వ్యాపిస్తోంది. మత ఘర్షణల ప్రమాదాన్ని ఈ పుస్తకం చివరిలో చక్కగా వివరించారు. కాంగ్రెస్ నాయకత్వంలో సిక్కులపై జరిగిన దాడి, 1984లో అద్వానీ ఆధ్వర్యంలో రథయాత్ర పేరుతో ఆర్.ఎస్.ఎస్ ప్రచారం 1992లో అయోధ్యలోని బాబ్రీ మసీదు కూల్చివేతకు ఎలా దారితీసిందో నేడు ఆ ప్రమాదం మరింత తీవ్ర స్థాయికి వెళ్లిందని ఉదహరించారు. ❞**

ప్రాంతంలో ఆనాడు నివాస ప్రాంతంలో పనిచేసిన అనుభవం నేటికీ ఉపయోగపడింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా ఇటీవల జహింగీర్‌పురి లోని పేద ముస్లింల నివాసాలను బుల్డోజర్లతో కేంద్ర బి.జె.పి ప్రభుత్వం అక్రమంగా కూల్చడానికి సిద్ధపడింది. బృందా సుప్రీంకోర్టు ఆర్డరు చేతిలో పట్టుకుని స్థానికుల సహాయంతో బుల్డోజర్లను అడ్డగించారు. ఇది దేశమంతా వైరల్ అయ్యింది. నివాస ప్రాంతాల్లో పనికి ఎంతో ప్రాధాన్యత ఉందని ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు గుర్తించినా వారితో ఎలా కలసి మెలసి ఉండాలో ఆమె అనుభవాలు మనకు ఎంతో తోడ్పడతాయి.

కార్మిక నాయకులు పోరాటాలు, సమ్మెల్లో ఎలా కృషి చేయాలో బిర్లా మిల్స్‌లో సమ్మె అనుభవాలు ప్రతి కార్మిక నాయకుడికీ ఎంతో ఉపయోగపడతాయి. కార్మికులను ఐక్యపర్చగలిగితే నిర్బంధంలో కూడా కార్మికుల నోళ్లు మూయించలేరని, సమ్మెలు ఆపలేరనే అనుభవాలు తెలియజేశారు. ఎమర్జెన్సీని అడ్డుపెట్టుకుని బిర్లా యాజమాన్యం కార్మికులపై పనిభారం రెట్టింపు చేసింది. బిర్లామిల్స్ టెక్స్‌టైల్స్ పరిశ్రమ. ఈ మిల్లులోని వీవింగ్ సెక్షన్‌లో రెండు మగ్గాలకు బదులు నాలుగు మగ్గాలపై ప్రతి కార్మికుడు పనిచేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇది అమలు జరిగితే బిర్లామిల్స్‌లోని వీవింగ్ సెక్షన్‌లో సగం మందికి పనిపోతుంది. దీన్ని ఎలా ఎదుర్కోవాలి అనే సమస్య వచ్చినప్పుడు బృందా కార్మికుల చర్చలను ప్రత్యక్షంగా, ఓపిగ్గా విన్న అనుభవాలను చక్కగా ఉదహరించారు. యాజమాన్యం పోలీసులను ఆశ్రయించి బలప్రయోగం చేస్తే సమ్మె చేయగలమా? దీర్ఘకాలం సమ్మె చేయాల్సి వస్తే సమ్మె సాధ్యమవుతుందా? వీవింగ్ సెక్షన్ కార్మికుల సమస్యకు మిగిలిన కార్మికుల మద్దతు ఉంటుందా? లాంటి అనేక చర్చల అనంతరం సమ్మెలోకి వెళ్లాలని సిఐటియు కార్యకర్తలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. బృందా ఆ రోజు రాత్రి రమేష్ అనే కార్మిక నాయకుని చిన్న ఇంటిలోనే బస చేశారు. ఎమర్జెన్సీ అయినందువల్ల సమ్మె కరపత్రం ఏ ప్రెస్ యాజమాన్యం వేయలేదు. 'సైక్లోస్టైల్' ద్వారా వేయించి రహస్యంగా దారిలో వెదజల్లారు. ఆ కరపత్రాలను కార్మికులు రహస్యంగా జేబులో పెట్టుకుని చదువుకున్నారు. మరుసటి రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెను చూసి ఎంతో ఉత్తేజం పొందానని బృందా వివరించారు. రహస్య కాలంలో కూడా ఢిల్లీలోని క్లాత్ మిల్స్‌లో తొలగించబడిన కమల్ నారాయణ్ ద్వారా చిన్న బుక్ షాప్ నడిపేవారు. ఈ బుక్‌షాప్‌లో వామపక్ష సాహిత్యం కూడా దొరికేది. సమావేశాలు ఈ బుక్‌షాప్ వెనుకనే జరిగేవి. షాప్ షెట్టర్ వేసుకుని మీటింగ్‌లు నడిపేవారు. నేడు యాజమాన్యాల ఒత్తిడి ఎదుర్కోవడానికి ఇటువంటి మార్గాలు అనుసరించడం ఎంతో అవసరం. కమ్యూనిస్టు కుటుంబాల పేరుతో రాసిన అధ్యాయంలో మన కుటుంబాల్లో ఉండే ఆప్యాయతలు, త్యాగ నిరతి మరే పార్టీల్లోగాని, సంఘాల్లో గాని సాధ్యం కాదనే విషయాన్ని స్పష్టం చేశారు.

ఈ సమ్మెను విరమించేటప్పుడు పి.రామమూర్తి స్వయంగా హాజరై ఉపన్యసించారు. పి.రామమూర్తి సిఐటియు అఖిల భారత ప్రథమ ప్రధాన కార్యదర్శి. వారి గురించి పుస్తకంలో పది పంక్తులు రాశారు. అలాగే బృందా వివాహం తర్వాత ప్రకాశ్ కరత్ తండ్రి కొద్ది కాలానికే చనిపోయారు. వారిని పరామర్శించడానికి ఉదయాన్నే ఇంటికి వచ్చిన పుచ్చలపల్లి సుందరయ్య గురించి వివరించారు. సుందరయ్య మరో సందర్భంలో బృందాను పిలిచి ట్రేడ్ యూనియన్ రంగంలో పార్టీని నిర్మించడం తన ప్రథమ కర్తవ్యంగా ఉండాలని వివరించారని రాశారు. ఆమెతో ఆ కాలంలో పరిచయమైన మేజర్ జైపాల్‌సింగ్ గురించి అద్భుతంగా వర్ణించారు. ఆయనే దొరికి ఉంటే బ్రిటీష్ వాళ్లు కాల్చేసేవారు. కానీ ఆయన ప్రాణాలకు తెగించి దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి అవసరమైన చోట్లకు వెళ్లి సైనిక శిక్షణ ఇచ్చారు. తెలంగాణా సాయుధ పోరాటంలో కూడా ఆయన సైనిక శిక్షణ కీలకమైంది. ఇలా బి.టి.రణదీవే, విమలారణదీవె, జ్యోతిబసు లాంటి అనేక మంది నాయకుల గురించి సందర్భాన్ని బట్టి వివరించడం ఈ పుస్తకంలో ఒక ప్రత్యేకత.


మత విద్వేషం అంటువ్యాధిలాగా నేడు వ్యాపిస్తోంది. మత ఘర్షణల ప్రమాదాన్ని ఈ పుస్తకం చివరిలో చక్కగా వివరించారు. కాంగ్రెస్ నాయకత్వంలో సిక్కులపై జరిగిన దాడి, 1984లో అద్వానీ ఆధ్వర్యంలో రథయాత్ర పేరుతో ఆర్.ఎస్.ఎస్ ప్రచారం 1992లో అయోధ్యలోని బాబ్రీ మసీదు కూల్చివేతకు ఎలా దారితీసిందో నేడు ఆ ప్రమాదం మరింత తీవ్ర స్థాయికి వెళ్లిందని ఉదహరించారు. నివాస ప్రాంతాల్లో పని చేయడం ద్వారానే బి.జె.పి మతోన్మాదాన్ని ఎదుర్కోగలం. మతతత్వాన్ని తక్కువగా అంచనా వేయవద్దని హెచ్చరించారు. మన రాష్ట్రంలోని టియు కార్యకర్తలకు ఈ హెచ్చరిక ఎంతో అవసరం.

ట్రేడ్ యూనియన్ రంగంలో పనిచేస్తూనే నివాస ప్రాంతాల్లో కృషి చెయ్యడం ద్వారా కుటుంబాన్ని నడపడానికి మహిళలు పడే ఇబ్బందులు అర్థం చేసుకుని మహిళల ప్రత్యేక సమస్యల మీద కృషి చెయ్యడానికి ఒక సంఘం అవసరాన్ని గుర్తించి మహిళా సంఘం ఏర్పాటు చేయడంలోనూ, కార్మికుల ఆందోళనల సందర్భంగా కుటుంబాలను కూడా ఆ ఆందోళనలలో భాగస్వాములుగా చెయ్యడంలోనూ బృందా చేసిన కృషి ఇప్పటికీ ఎప్పటికీ ఒక విలువైన పాఠం. టియు నాయకురాలైనా కార్మిక సమస్యల పరిష్కారానికి మాత్రమే పరిమితం కాకుండా నివాస ప్రాంత కృషి ద్వారా మహిళా సంఘాన్ని, యువజన సంఘాన్ని స్థాపించడం ద్వారా ఒక పనిలోంచి మరో పనిలోకి, ఒక సంఘం ద్వారా ఇంకో సంఘాన్ని స్థాపించడం ఎట్లా అనే విలువైన అనుభవాలను తెలియచెబుతుంది ఈ పుస్తకం. ఈ పుస్తకంలోని ప్రతి పేజీ సిఐటియు కార్యకర్తలకు, నాయకులకు ఎంతో ఉపయోగపడుతుంది.

❀

చరిత్ర

# తొలి మధ్య యుగాల్లో తూర్పు భారత దేశం



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

**ఎంవిఎస్ శర్మ**

మధ్య భారతానికి తూర్పువైపు ఉన్న భూభాగంలో, అంటే తూర్పు మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్, అస్సాం ప్రాంతంలో ప్రాచీన కాలపు అవశేషాలైతే లభిస్తున్నాయి కానీ అత్యంత ప్రాచీనకాలానికి సంబంధించిన రాత పూర్వక ఆధారాలు ఎటువంటివీ ఇంతవరకూ లభించలేదు. మనకు లభిస్తున్న ఆధారాలు క్రీ.శ.4–7 శతాబ్దాల కాలంనుండీ ఉన్నాయి.

ఈ కాలంలో అభివృద్ధి చెందిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తూర్పు భారతంలో చాలా భాగంలో విస్తరించింది. దానితోబాటు రాజ్యాల స్థాపన, సామాజిక తరగతుల నడుమ స్పష్టమైన విభజన కూడా జరిగింది. గుప్తుల కాలం నాటికి చెందిన కొన్ని శాసనాలు ఈ ప్రాంతాలలో లభించాయి. బౌద్ధులకు, బ్రాహ్మణులకు భూ హక్కులు కల్పిస్తూ ఫ్యూడల్ ప్రభువులు జారీ చేసిన శాసనాలు వాటిలో ఉన్నాయి. బౌద్ధ ఆరామాలకు, వైష్ణవ దేవాలయాలకు కూడా భూములను కేటాయిస్తూ శాసనాలు జారీ చేశారు. భూమిపై హక్కులను ఈ విధంగా వికేంద్రీకరణ చేయడం వలన అది ఆ ప్రాంతం యావత్తూ నూతన ఫ్యూడల్ సంస్కృతిని వ్యాపింపజేయడానికి తోడ్పడింది.

**ఒడిశా, తూర్పు దక్షిణ మధ్య భారతంలో**

మహానదికి దక్షిణ భాగంలో ఉన్న సముద్ర తీరప్రాంతం కళింగ రాజ్యంగా అశోకుడి కాలం నాటికే ఏర్పడివుంది. అశోకుడి సైన్యం కళింగ యుద్ధంలో సాగించిన రక్తపాతం చరిత్ర ప్రసిద్ధం. ఐతే ఆ తర్వాత క్రీ.శ. ఒకటవ శతాబ్దంలో ఖారవేలుడు అక్కడ బలమైన కళింగ రాజ్యాన్ని స్థాపించి చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించాడు. దాదాపు మగధ వరకూ ఈ విస్తరణ సాగింది. ఒడిశా తీరంలోని రేవు పట్టణాలు పెద్ద ఎత్తున ముత్యాల వ్యాపారం సాగించాయి. దానితోబాటు ఏనుగు దంతాలు, సన్న నూలు కూడా ప్రధాన వ్యాపార సరుకులుగా ఉండేవి. భువనేశ్వర్‌కు 60 కి.మీ. దూరంలో ఉన్న కళింగనగరి సమీపంలో శిశుపాల్ ఘర్ ప్రాంతంలో జరిపిన తవ్వకాలలో రోమన్ సామ్రాజ్యానికి చెందిన చాలా కళారూపాలు లభించాయి. దానిని బట్టి ఆ కాలంలో కళింగరాజ్యం రోమన్ సామ్రాజ్యంతో కూడా వ్యాపార సంబంధాలు నెరపిందని చెప్పవచ్చు. ఐతే, మహానదికి ఉత్తరాన, అంటే ఒడిశా లోని ప్రధాన భూభాగంలో ఎటువంటి రాజ్యాల స్థాపనా ఆ కాలం నాటికి (క్రీ.శ. 1వ శతాబ్దం నాటికి) జరిగినట్టు దాఖలాలు లేవు.

సముద్రగుప్తుడి కాలంలో అతడు సాగించిన దండయాత్రలలో (క్రీ.శ.4వ శతాబ్దం) కోసల, మహాకాంతార రాజ్యాలను సముద్రగుప్తుడు జయించినట్టు శాసనాలలో నమోదైంది. ఆ రాజ్యాలు ఉత్తర, పశ్చిమ ఒడిశా ప్రాంతాలకు చెందినవి. క్రీ.శ.4వ శతాబ్దం నుండి 6వ శతాబ్దం మధ్య కాలంలో ఒడిశాలో చాలా రాజ్యాలు ఏర్పడ్డాయి. వాటిలో కనీసం ఐదింటిని ఇప్పుడు నిర్ధారించగలుగుతున్నారు. మాతర రాజ్యం వాటిలో ఒకటి. వారినే పితృభక్తులు అని కూడా పిలుస్తారు. మహానదికి, కృష్ణా నదికి మధ్య ఉన్న భూభాగాన్ని వీరు తమ ఉచ్చ స్థితిలో ఉన్న కాలంలో పాలించారు. మాతరులకు పొరుగున మరో మూడు రాజ్యాలు ఉండేవి. అవి వసిష్ట, నల, మాన రాజ్యాలు. కళింగకు దక్షిణం నుండి ఆంధ్ర ప్రాంత సరిహద్దుల వరకూ ఉన్న భూభాగాన్ని వసిష్టులు పాలించారు. మహాకాంతార ప్రాంతం (ఇప్పటి చత్తీస్‌ఘర్ అయివుండొచ్చు) నల రాజ్యం అధీనంలో ఉండేది. మహానది కి ఆవల ఉత్తర భాగంలో సముద్ర తీర ప్రాంతం మాన రాజ్యంగా ఉండేది. ప్రతీ రాజ్యానికీ స్వంత సైన్యం, స్వంత పన్నుల వ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ ఉండేవి. నల, మాన రాజ్యాలకు వారి స్వంత నాణేలు కూడా ఉండేవి. ప్రతీ రాజ్యమూ బ్రాహ్మణులను పెద్ద ఎత్తున భూదానాలతో తమ రాజ్యాలకు వెలుపల ఉన్నవారితో సహా ఆహ్వానించి క్రతువులు నిర్వహించి తద్వారా తమరాజ్యాధిపత్యానికి ఒక ఆమోదముద్ర వేయించుకున్నాయి.

ఆ కాలపు ఆధునిక సంస్కృతి ఒక్క కళింగ రాజ్యం వరకే పరిమితం కాలేదు. బస్తర్ జిల్లా (చత్తీస్‌ఘర్)లో నల రాజుల బంగారు నాణేలు లభించాయి. పెద్ద స్థాయి ఉద్యోగులకు, లావాదేవీలకు బంగారం రూపంలో చెల్లించే పద్ధతి ఆ రాజ్యంలో ఉండేదని చెప్పవచ్చు. మాన రాజ్యంలో రాగి నాణేలు విరివిగా వాడారు. అంటే చేతివృత్తులవారు, రైతులు కూడా నగదు రూపంలో లావాదేవీలు జరిపే ఆర్థిక వ్యవస్థ ఆ రాజ్యంలో ఉండేదని చెప్పవచ్చు. తమ రాజ్యంలో వివిధ కొత్త గ్రామాలను ఏర్పరచడం ద్వారా ఆ రాజులు తమ ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రయత్నించారు. మాతరుల రాజ్యంలో మహేంద్ర పర్వతాల సమీపంలో ఏర్పడిన మహేంద్రభోగ అటువంటి ప్రాంతమే. మాతరులు దంతాయవాగుభోగ అనే మరో ప్రాంతాన్ని కూడా ఏర్పరిచారు. ఆ ప్రాంతం నుండి అధికారులకు ఏనుగు దంతాలు, వరి నూకలు సరఫరా అయేవి. మతపరమైన కార్యకలాపాలకు, విద్యా కార్యక్రమాలకు కావలసిన వనరులను అగ్రహారాల ద్వారా ఏర్పాటు చేశారు. ఈ అగ్రహారాల గ్రామాల్లో ప్రజలు చెల్లించే పన్నులు ఆ మత, విద్యా కార్యకలాపాలు నిర్వహించడానికి బ్రాహ్మణులకు అందేవి. ఆదివాసీ ప్రాంతాలలో బ్రాహ్మణులను అగ్రహారాలిచ్చి పంపడం ద్వారా ఆ ప్రాంతాల్లో కొత్త వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టడానికి, వాతావరణానికి తగినట్టు పంటలు వేయడానికి దోహదం చేశారు. క్రీ.శ. 5వ శతాబ్దం మధ్య నుండి మాతరులు 12 నెలల పంచాంగాన్ని అమలు చేయడం మొదలుపెట్టారు. అంటే వాతావరణంలో మార్పుల క్రమం పట్ల వివరమైన జ్ఞానం వారికి ఉండేదని చెప్పవచ్చు.

> **" ఉత్తర బెంగాల్, ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రాంతాలలో క్రీ.శ.432 నుంచి దాదాపు ఒక శతాబ్దం పాటు వివిధ ప్రాంతాలలో భూముల అమ్మకాలకు సంబంధించిన దస్తావేజులు లభించాయి. రాగిరేకులపై రాసిన ఆ పత్రాలను పుండ్రవదన భుక్తి అని అనేవారు. వాటిని బట్టి భూములను దీనారాలు (బంగారు నాణేలు) ఇచ్చి కొనేవారు. "**

ఒడిశా తీర ప్రాంతంలో లిపిని ఉపయోగించడం క్రీ.పూ. 3వ శతాబ్దం నుండీ ఉన్నట్టు ఆధారాలు ఉన్నాయి. క్రీ.శ.350 వరకూ శాసనాలు ప్రాకృతంలోనే లభ్యం అయాయి. ఆ తర్వాత నుండి సంస్కృత లిపిని, భాషను ఉపయోగించడం మొదలైంది. అక్కడి నుండి సంస్కృత భాష వాడకం మొత్తం మహానదికి ఉత్తరాన ఉన్న ప్రాంతానికి కూడా విస్తరించింది. బ్రాహ్మణ మత గ్రంధాలలోనే గాక, ఆస్తి హక్కుల చట్టాలు, సామాజిక కట్టుబాట్లు కూడా సంస్కృతంలోనే రాయబడ్డాయి. వాటిలో పురాణాలనుండి, ధర్మశాస్త్రాలనుండి కొన్ని భాగాలు ఉటంకించడం కూడా కనిపిస్తుంది. వాటిని బట్టి వర్ణ వ్యవస్థను పరిరక్షించడం రాజు యొక్క ముఖ్య విధుల్లో ఒకటిగా ఉండేది. గంగామైదాన ప్రాంతపు ఆధిపత్య సంస్కృతికి తామూ విధేయులమేనని ఇక్కడి పాలకులు ప్రకటించుకున్నారు. వారికి ప్రయాగ ప్రధాన పుణ్య క్షేత్రంగా ఉండేది.

### బెంగాల్

ఉత్తర బెంగాల్ ప్రాంతంలో అశోకుడి కాలపు శాసనాలు కొన్ని లభించాయి. బౌద్ధ సన్యాసులను పోషించడానికి కావలసిన నాణేలను, ధాన్యాన్ని నిలవ ఉంచిన గొదాములు ఉండినట్టు కొన్ని శాసనాలు తెలుపుతున్నాయి. దీనిని బట్టి ఆ నాటి స్థానిక రైతులు తమ అవసరాలకు పోను కానుకలు, పన్నులు చెల్లించడానికి కావలసిన మేరకు ఉత్పత్తి చేయగలిగివుండేవారని చెప్పవచ్చు. ఈ ప్రాంతంలో ప్రజలు ప్రాకృత భాషను వాడేవారు. బౌద్ధాన్ని అనుసరించేవారు. ఆగ్నేయ బెంగాల్ ప్రాంతంలో నౌవాఖలి దగ్గర లభించిన శాసనం బట్టి అప్పటి ప్రజలకు ప్రాకృతం, బ్రాహ్మి లిపులు తెలుసు. ఇది క్రీ.పూ. రెండవ శతాబ్దం నాటి బెంగాల్ పరిస్థితి. తక్కిన బెంగాల్ ప్రాంతానికి సంబంధించి మనకు క్రీ.శ.4వ శతాబ్దపు ఆధారాలు మాత్రమే లభిస్తున్నాయి. అంతకు ముందు కాలానికి సంబంధించి పెద్దగా బైటపడలేదు.

బంకురా జిల్లా ప్రాంతంలో దామోదర నది ప్రాంతంలో పాలించిన రాజు మహారాజ బిరుదుతో జారీ చేసిన శాసనం లభించింది. అక్కడ సంస్కృతం పాలక భాషగా ఉండేది. క్రీ.శ.5, 6 శతాబ్దాలనాటికి గంగా, బ్రహ్మపుత్ర నదుల మధ్య ప్రాంతం యావత్తూ రాజ్యాలు ఏర్పడ్డాయి. సంస్కృతం బాగా వ్యాప్తి చెందింది. క్రీ.శ.550 నాటికి గుప్తుల స్థానిక ప్రతినిధులుగా ఉండినవారు స్వతంత్రులుగా ప్రకటించుకున్నారు. ఉత్తర బెంగాల్ ప్రాంతాన్ని వారు చాలా మేరకు ఆక్రమించుకున్నారు. తక్కిన భాగాన్ని కామరూప (అస్సాం) ప్రాంతపు రాజులు ఆక్రమించుకున్నారు. తమ స్వంత అశ్విక దళాలను, గజ బలాలను, కాల్బలాలను, నౌకా దళాలను నిర్వహించుకున్నారు. క్రీ.శ. 600 నాటికి ఆ ప్రాంతం గౌడ రాజ్యంగా ఏర్పడింది. హర్షుడికి ప్రధాన విరోధి అయిన శశాంకుడి పాలన అక్కడ సాగింది.

ఉత్తర బెంగాల్, ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రాంతాలలో క్రీ.శ.432 నుంచి దాదాపు ఒక శతాబ్దం పాటు వివిధ ప్రాంతాలలో భూముల అమ్మకాలకు సంబంధించిన దస్తావేజులు లభించాయి. రాగిరేకులపై రాసిన ఆ పత్రాలను పుండ్రవదన భుక్తి అని అనేవారు. వాటిని బట్టి భూములను దీనారాలు (బంగారు నాణేలు) ఇచ్చి కొనేవారు. మతపరమైన కార్యకలాపాలకు ఇచ్చిన భూములపై ఎటువంటి పన్నూ ఉండేది కాదు. వ్యాపారులు, చేతివృత్తుల వారు, భూ యజమానులు, పండితులు స్థానిక పాలనా వ్యవస్థలో భాగస్వాములుగా ఉండేవారు. దేవాలయాలకు ఇచ్చిన భూమిలో అత్యధిక భాగం బంజరు, పోరంబోకు భూములే ఉండేవి. వాటిని సాగులోకి తీసుకురావడమే ఆ దానాలవెనుక ఉన్న అసలు లక్ష్యం అని భావించాలి. బ్రహ్మపుత్ర పరీవాహక డెల్టా ప్రాంతం సమతత అని పిలువబడేది. క్రీ.శ. 4వ శతాబ్దం నాటికి ఆ ప్రాంతం సముద్ర గుప్తుడి ఆధీనంలో ఉండేది. అది ఆగ్నేయ బెంగాల్ వరకూ ఉండేది. ఐతే ఆ కాలంలో ఈ ప్రాంతంలో బ్రాహ్మణ ఆధిపత్యం కనిపించదు. అక్కడ ఉత్తర బెంగాల్‌లో ఉండినట్టు సంస్కృతమూ వాడుకలో లేదు, కులవ్యవస్థ కూడా లేదు. ఐతే ఆ తర్వాత క్రీ.శ 525 నుండి ఈ ప్రాంతం వంగ రాజ్యంలో భాగం అయింది. ఇక్కడ క్రీ.శ.550 ప్రాంతంలో పాలించిన సామహారదేవుడు అనే రాజు పేరు తో జారీ అయిన బంగారు నాణేలు లభించాయి.

ఢాకా ప్రాంతంలో ఖడ్గ అనే పేరుగల వంశపు రాజులు క్రీ.శ. 7వ శతాబ్దం లో పాలించారు. లోకనాథ, రాత అనే వంశాల బ్రాహ్మణ రాజులు కొమిల్లా ప్రాంతం పాలించారు. వీరంతా భూదానాల ద్వారా తమ రాజ్యాలను విస్తరించారు. అగ్రహారాలను దానం చేసే పద్ధతిని ఒడిశా ప్రాంత రాజుల మాదిరిగానే వీరు కూడా అనుసరించారు. సంస్కృతం, వ్యవసాయం ఆదివాసీ ప్రాంతాలలో వ్యాప్తి చేయడానికి ఈ దానాలు తోడ్పడ్డాయి. తమను ప్రతిఘటించి ఓడిపోయిన ఆదివాసీలకు శిక్షగా బెంగాల్-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో కొన్ని గ్రామాలను 'దండభుక్తి' పేర కేటాయించారు. వర్ధమానభుక్తి అనే పేర ఏర్పడిన ప్రాంతమే ప్రస్తుత బర్ద్వాన్ జిల్లా. ఇది కూడా ఆదివాసీలను లొంగదీయడానికి ఏర్పడినదే. బౌద్ధ ఆరామానికి ఫరీద్‌పూర్ ప్రాంతంలో ఇచ్చిన నీటి కయ్యల ప్రాంతం, కొమిల్లా జిల్లాలో బ్రాహ్మణులకు ఇచ్చిన అటవీప్రాంతం కూడా వ్యవసాయ విస్తరణ కోసం, ఆధిపత్యవాద విస్తరణ కోసం చేసిన భూదానాలే. క్రీ.శ.450-650 మధ్య కాలంలో పెద్ద, చిన్న స్వతంత్ర, సామంత రాజ్యాలు బెంగాల్ ప్రాంతంలో దాదాపు 6 ఏర్పడ్డాయి. వీటన్నింటికీ స్వంత సైన్యాలు, స్వంత పాలనా వ్యవస్థ ఉండేవి. అన్నీ తమ విస్తరణ కోసం బౌద్ధ ఆరామాలకు, బ్రాహ్మణులకు భూదానాలు చేసినవే. ఈ అగ్రహారాలను పర్యవేక్షించడానికి అగ్రహారికుడు అనే అధికారిని కూడా నియమించారు.

భూమి మామూలుగా సాగుచేసే రైతు కుటుంబాల ఆధీనంలో ఉండేది. ఐతే దానిని అమ్మాలన్నా, కొనాలన్నా ఆ గ్రామంలోని వృత్తిదారుల పెద్దలు, వ్యాపారులు, భూస్వాములు, పండితులు అందరూ ఆమోదం తెలపవలసివుండేది. వారంతా రాజుకు ప్రతినిధులుగా వ్యవహరించేవారు. తొలి రోజుల్లో ఆయా గ్రామాల ప్రజలే భూములను దేవాలయాలను, ఆరామాలకు కేటాయించి ఆ భూములపై కట్టవలసిన పన్నులను తామే ఉమ్మడిగా చెల్లించేవారు. తర్వాత రాజు మొత్తం భూములపై ఆధిపత్యాన్ని చెలాయించడం మొదలైంది. ఈ కాలంలో బెంగాల్ ప్రాంతంలో నాగరికత

విస్తరణ వేగంగా జరిగింది.

**అస్సాం**

కామరూప రాజ్యం బ్రహ్మపుత్ర పరీవాహక ప్రాంతానికి మరోపేరు. క్రీ.శ. 4వ శతాబ్దం నుండే గౌహతి ప్రాంతంలో మానవ నివాసాలు ఉండేవి. ఆ కాలంలోనే ఆ ప్రాంతంలో ఉండిన కామరూప, దేవక రాజ్యాలనుండి సముద్రగుప్తుడికి కప్పాలు కూడా చెల్లించారు. దేవక బహుశా ఇప్పటి నౌగాంగ్ ప్రాంతంలో ఉండివుండాలి. అంబారి ప్రాంతంలో తవ్వకాలలో బైటపడిన ఆధారాలను బట్టి క్రీ.శ. 6,7 శతాబ్దాలనాటికి ఈ ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. అప్పటికి అక్కడ సంస్కృతభాష కూడా విస్తరించింది. కామరూప రాజులు వర్మ అనే బిరుదు వహించేవారు. ఈ వర్మ అనే బిరుదు మనకి బెంగాల్, ఒడిశా, ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు ప్రాంతాలలో కూడా కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో బౌద్ధం కూడా బలంగా వ్యాపించింది. చైనా నుండి ఈ ప్రాంతానికి రాకపోకలు ఎక్కువగా జరిగేవి. హ్యుయన్ త్సాంగ్ ఈ ప్రాంతాన్ని కూడా పర్యటించి తన అనుభవాలను గ్రంథస్తం చేశాడు.

మొత్తంగా చూసినప్పుడు తూర్పు, ఈశాన్య భారతంలో క్రీ.శ.4 నుండి 7వ శతాబ్దం మధ్య కాలంలో ఫ్యూడల్ రాజ్యాలు బాగా వ్యాపించాయి. రాయడం, సంస్కృతం వాడకం, వైదిక క్రతువులు, వర్ణవ్యవస్థ, బ్రాహ్మణాధిపత్యపు కుల వ్యవస్థ, పాలనా వ్యవస్థ వంటివి బలపడ్డాయి. గుప్త సామ్రాజ్యంతో నెరపిన సాంస్కృతిక సంబంధాలు ఈ ప్రాంతంలో అప్పటి ఫ్యూడల్ సంస్కృతి వ్యాప్తికి దోహదం చేశాయి. భూమిపై ఉమ్మడి యాజమాన్యం అక్కడక్కడా కొనసాగిన ఛాయలు ఉన్నా ప్రధానంగా భూమి వ్యక్తిగత ఆస్తిగా మారింది. భూముల లావాదేవీలు జరిగిన తీరును బట్టి, అందులో బంగారు నాణేల వినియోగం బట్టి ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందిన ఆహారోత్పత్తి – ప్రధాన వ్యవసాయం సాగేదని చెప్పవచ్చు. ఉత్తర బెంగాల్‌లో చెరకు సాగు జరిగేది. వంగదేశంలో వరినాట్లు వేసేతీరును. కాళిదాసు తన రచనలో వర్ణించినదానిని బట్టి ఆధునిక వ్యవసాయ పద్ధతులు అమలులో ఉండేవని చెప్పవచ్చు. గుప్తుల కేంద్రీకృత ఆధిపత్యం బలహీనపడుతున్న కొద్దీ చుట్టుపక్కల రాజ్యాలు స్వతంత్రంగా బలపడడం జరిగింది.

**భాగవతులు**

భగవత్ లేదా విష్ణువు అనే దైవాన్ని ఆరాధించే వారు భాగవతులు. మౌర్యుల కాలం

> **❝ గుప్తులకాలం నాటికి వైష్ణవ మతం అవతారాలను ప్రచారం చేసింది. చరిత్ర అంతా విష్ణువు యొక్క దశావతారాల చరిత్ర అని బోధించింది. సమాజంలో సంక్షోభం తలెత్తినప్పుడల్లా విష్ణువు భూమిమీద ఒక అవతారంగా జన్మిస్తాడని, పాపులను శిక్షించి మంచివారిని కాపాడుతాడని చెప్పింది. ❞**



**ధియోగడ్‌లో చెక్కబడిన నర నారాయణుల శిల్పం**

నాటికి విష్ణువు ఒక చిన్న స్థాయి దైవంగానే ఉండేవాడు. సూర్యుడికి ప్రతినిధిగా, సంతాన వృద్ధి దేవతగా విష్ణువును పూజించేవారు. క్రీ.పూ. 2వ శతాబ్దం నాటికి విష్ణువు నారాయణుడు అనే మరొక దేవుడితో కలిసిపోయాక నారాయణ – విష్ణు అని కలిపి వ్యవహరించేవారు. ఈ నారాయణుడు మొదట్లో ఒక ఆదివాసీ దేవుడిగా ఉండేవాడు. అతడిని భగవత్ అని పిలిచేవారు. అతడి భక్తులు భాగవతులు. ఆదివాసీ తెగ నాయకుడి ప్రతిరూపంగా నారాయణుడిని ఆరాధించారు. తన అనుచరుల నుండి కానుకలు స్వీకరించి వాటిని తిరిగి వాటాలు వేసి అందరికీ పంచడం ఆదివాసీ తెగ నాయకుడి బాధ్యత. భాగాన్ని (సంపదలో) భక్తులకు పంచేవాడు భగవత్. దానికి ప్రతిగా భక్తులు తమ భక్తిని వ్యక్తం చేసేవారు.

ఆ విధంగా ఒక వైదిక దేవుడు విష్ణువును ఒక ఆదివాసీ దేవుడు భగవత్‌తో కలిపి ఆరాధించడం రెండు సంస్కృతుల సమ్మేళనాన్ని సూచిస్తుంది. ఆ తర్వాత వృష్ణి అనే తెగకు దేవుడుగా పరిగణించబడే కృష్ణ–వాసుదేవను కూడా విష్ణువుగానే పరిగణించడం మొదలైంది. క్రీ.శ. 200 నాటికి ఈ మూడు రకాల దైవాలూ ఒక్కటిగా కలిసిపోవడంతో దానినుండి వైష్ణవం పుట్టుకొచ్చింది.

భాగవత తత్వం భక్తి, అహింసలను ప్రబోధిస్తుంది. ఒక ఆదివాసీ తన తెగ నాయకుడిని ఎంత భక్తి శ్రద్ధలతో అనుసరిస్తాడో అదే భక్తిని దేశాన్నేలే రాజు యెడల కూడా ప్రదర్శించాలని భక్తి ప్రజలకు నేర్పింది. ఇక అహింస అంటే జంతువులను విచ్చలవిడిగా చంపడం మానుకోవడమే. వ్యవసాయ సమాజానికి, సంపద వృద్ధికి ఇది చాలా అవసరం. అందుకే విష్ణువుకు వ్యవసాయ ఉత్పత్తులతో చేసిన ప్రసాదాన్నే అర్పిస్తారు. చాలామంది భాగవతులు శాఖాహారులుగా మారారు.

భాగవతతత్వం విదేశీయుల పట్ల కూడా సానుకూలంగా వ్యవహరించింది. చేతి వృత్తులవారికి, వైశ్యులకు ఆకర్షణీయంగా నిలిచింది. శాతవాహనులు, కుషానులు వైష్ణవం పట్ల ఆకర్షితులయ్యారు. గత జన్మలో చేసిన పాపం వలన ఈ జన్మలో వైశ్యులుగా, శూద్రులుగా, మహిళలుగా జన్మించినవారంతా తనను శరణు వేడితే విముక్తులౌతారని కృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు.

గుప్తులకాలం నాటికి వైష్ణవ మతం అవతారాలను ప్రచారం చేసింది. చరిత్ర అంతా విష్ణువు యొక్క దశావతారాల చరిత్ర అని బోధించింది. సమాజంలో సంక్షోభం తలెత్తినప్పుడల్లా విష్ణువు భూమిమీద ఒక అవతారంగా జన్మిస్తాడని, పాపులను శిక్షించి మంచివారిని కాపాడుతాడని చెప్పింది.

క్రీ.శ.6వ శతాబ్దం నాటికి విష్ణువు బ్రహ్మ, శివుడుతోబాటు వారి సరసన చేరి అగ్రస్థానం పొంది త్రిమూర్తులలో ఒకడిగా నిలిచాడు. ఈ ముగ్గురిలో కూడా విష్ణువుదే ఆధిక్యత. భాగవతం, విష్ణుపురాణం, విష్ణు సహస్ర నామాలు వంటివి వైష్ణవం వ్యాప్తికి తోడ్పడ్డాయి. వైష్ణవం విస్తరణ మహాయాన బౌద్ధం క్షీణతను వేగవంతం చేసింది. (చూ. గుప్తుల కాలం నాటి నర–నారాయణుల విగ్రహం, దేవఘర్)

**(తరువాయి వచ్చే మాసం)**

# అరాచక ద్రవ్య పెట్టుబడి- అవినీతి సంస్కృతి

అశోక మోడి



రచయిత ప్రముఖ భారతీయ అమెరికన్ ఆర్థికవేత్త. అమెరికాలోని చార్లెస్ అండ్ రాబర్ట్‌సన్ విశ్వవిద్యాలయ విజిటింగ్ ప్రొఫెసర్. అంతర్జాతీయ ఆర్థిక విధానాల్లో నిపుణుడు.

ద్రవ్య పెట్టుబడి నేడు వ్యవస్థలోకి ఆందోళనకర స్థాయిలో అవినీతిని జొప్పిస్తున్నది. రాజ్యం ఇచ్చిన ప్రోత్సాహంతో నైతిక విలువలకూ, జవాబుదారీ తనానికీ తిలోదకాలిచ్చి మరీ అది ఈ పనిచేస్తున్నది. భారతదేశ స్టాక్ మార్కెట్ సూచిక అయిన సెన్సెక్స్ 1989 నుండి పైపైకి ఎగబాకుతూ నూతన శిఖరాలకు చేరుకుంటున్నది. 1992 ఏప్రిల్ నెలలో స్టాక్ మార్కెట్ పెరుగుదల ఇప్పటికీ అంతు చిక్కని ఒక చిక్కుముడిగానే మిగిలిపోయింది. మన దేశంలో రాజకీయాలు అయోమయంగా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ గందరగోళంగా ఉంది. అయినా సెన్సెక్స్ దాదాపు నిటారుగా పెరుగుతూ పోతూనే ఉంది.

ఈ కథకి మొదటి అంకం "హర్షద్ మెహతా కుంభకోణం" గా పేరుపడ్డ మొట్ట మొదటి కుంభకోణం. దీనిని ఇప్పుడు అందరూ దాదాపు మరిచిపోయారు. అదొక ప్రత్యేక పరిస్థితులలో జరిగిందనీ, ఇప్పుడు దాని ప్రసంగికత కూడా లేదనీ కొట్టి పడేస్తున్నారు. అయితే ఈ కుంభకోణాల పరంపర అక్కడితో ఆగిపోలేదు. మరిన్ని ఎక్కువ, మరింత వేగంతో కొనసాగుతూనే ఉన్నాయి. నిజానికి కుంభకోణాలు ఈ రోజు వ్యాపారంలో భాగంగా కూడా మారిపోయాయి. అయితే భారతదేశ ఆర్థిక వ్యవస్థకూ, సమాజానికీ ఇవి పెనుభారంగా తయారయ్యాయనేది వాస్తవం.

కుంభకోణాలన్నీ కార్పొరేట్ పరిపాలన చుట్టూ తిరుగుతుండడం భయం గొలుపుతున్నది. యజమానులు, కంపెనీల స్థాపకులు మదుపరులను ముంచి తాము ధనవంతులవుతున్నారు. పాలన, నియంత్రణ, అధికారాలు కలిగి ఉన్న భారత ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు చోద్యం చూస్తున్నది. చట్టం ఈ విషయంలో తన బాధ్యత నిర్వర్తించడంలో విఫలమయ్యింది. రాజ్యం వైఫల్యం చెందడంతో సమాజానికీ, మార్కెట్‌కూ మధ్య ఉండే నమ్మకం అనే బంధం సడలిపోతున్నది.

ఈ మధ్యనే అమెరికాలో న్యూయార్క్ రాష్ట్రానికీ, డోనాల్డ్ ట్రంప్‌కూ మధ్య జరిగిన వివాదంలో న్యాయమూర్తి ఆర్థర్ ఇంగోరోన్ మాట్లాడుతూ "న్యాయ వ్యవస్థ మార్కెట్‌లో నైతికతను కాపాడాలి. అప్పుడే మారకాలలో 'నమ్మకం' ఏర్పడుతుంది. మదుపరులు నిష్పక్షపాత ప్రమాణాలకు కట్టుబడి ఉంటారు. నిజాయితీ. నమ్మకం, నిష్పక్షపాతం ఒకదానితో ఒకదానికి సంబంధం లేనివాటిగా కనిపించవచ్చు. భౌతికవాద సమాజంలో ఆ మాటలు వింతగా కనిపించవచ్చు" అని చెప్పారు. "వివేకం, నిష్పక్షపాతం అనే నైతిక విలువలను 'ధనదాహం' అణచివేస్తుంది" అని స్వేచ్ఛా మార్కెట్ పితామహుడు ఆడమ్ స్మిత్ రెండు శతాబ్దాల కిందటే చెప్పారు.

సమాజంలో ఇమడలేని కొందరు వ్యక్తులు, సాధారణ స్థాయిలో వ్యవహరించలేని వారు మాత్రమే అక్కడక్కడా ఈ కుంభకోణాలకు పాల్పడుతున్నారని కొంతమంది పరిశీలకులు కొట్టిపారేస్తున్నారు. చెదురుమదురుగా జరిగే ఈ సంఘటనలకు కఠినమైన శిక్షలు లేకపోవడంతో వాటిని అనుమతించినట్లు భావించడానికి వీలు ఏర్పడింది. అసాధారణాలు సాధారణంగా మారిపోయాయి. ఈ రోజు కుంభకోణాలు సాధారణంగా మారిపోయాయి. ఇంకా చెప్పాలంటే కుంభకోణాలు చేయడం ఘనకార్యంగా చూపుకోడం జరుగుతున్నది. అరాచక ద్రవ్య పెట్టుబడి రాజ్యం ఇచ్చే ప్రోత్సాహంతో నైతిక విలువలను, ప్రజలకు జవాబుదారీతనాన్ని బుగ్గి పాలు చేసింది. ఆచార్యుడు పార్థా దాస్ గుప్తా మాటల్లో చెప్పాలంటే "ప్రతివాడు మోసాలకు పాల్పడుతుంటే, మోసం చేయడంలో అందరి కంటే ముందుండాలని ప్రతిమనిషి భావిస్తాడు."

**హర్షద్ మెహతా కుంభకోణం**

నియంత్రణ లేని పెట్టుబడిదారీ విధానం ఎటువంటి భయంకరమైన పరిస్థితులు కల్పిస్తుందో తెలియచేసేది హర్షద్ మెహతా కుంభకోణం. అందువలనే ఈ రోజుకు కూడా హర్షద్ మెహతా కుంభకోణానికి ప్రాసంగికత ఉంది. కానీ ఈ వాస్తవాన్ని ఆర్థిక స్వేచ్ఛ మార్కెట్ తెచ్చిపెట్టే అపరిమిత లాభాల పేరు కింద కప్పేసాం. కానీ విశృంఖల కథల పట్ల అప్రమత్తంగా ఉండాలని అది మనకు పాఠాలు నేర్పుతోంది.

1990 మార్చి నెలలో స్టాక్ మార్కెట్ అప్రతిహతంగా దూసుకుపోతూనే వున్నింది. నిజానికానాడు భారతదేశం అంతర్జాతీయ మార్కెట్లో దివాళా తీసే దిశగా పయనిస్తోంది. 36 ఏళ్ల మెహతా, విక్రోలిలోని తన సాధారణ నివాసం నుంచి వర్లిలోని సముద్రాభిముఖ గృహానికి మారారు. అప్పటి దాని విలువ రూ 10 కోట్లు. అందులో 9 రంధ్రాలతో కూడిన అందమైన గోల్ఫ్ మైదానం, జపనీస్ ఆకుపచ్చని తోట, మెహతా ఉన్న అతి ఖరీదైన కార్లు పెట్టేందుకు పార్కింగ్ స్థలం ఉన్నాయి. భారతదేశానిది "వృద్ధి చెందుతున్న స్టాక్ మార్కెట్" అని 1990 మే నెలలో, ఐఎంఎఫ్ కితాబు నిచ్చింది. 1990 ఆగస్టులో సిటీ బ్యాంక్ విశ్లేషకుడు, "భవిష్యత్తు భారతదేశ ఆర్థిక వ్యవస్థ"ను గురించి గొప్పగా వర్ణించారు. ఇలా ఆశాజనకంగా రాయడానికి కారణం

ఉంది: "భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అనాదిగా కొనసాగుతున్నది" అన్నారు. సిటీ బ్యాంకు నిధులు సమకూరుస్తున్నదనే భారతదేశ మార్కెట్ ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నదని వచ్చిన ఈ విశ్లేషకుడు తోసిపుచ్చాడు. అటువంటి ఆరోపణలకు "ఆధారాలు ఏవీ" లేవన్నాడు. 1992 లో పార్లమెంటు వీధిలో ఉన్న ఆ బ్యాంకు శాఖ ముందు మదుపరులు దరఖాస్తులతో పెద్ద పెద్ద క్యూ లలో గంటల తరబడి వేచి ఉండేవారన్నా విషయం గుర్తించాలి.

"మెహతా మోసపూరిత కథలు వినిపించి, ప్రభుత్వ బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు తీసుకుని దర్జాగా తనకిష్టమైన వాటాలు కొనేవారు. రుజువులు లేవన్న పేరుతో జెస్సికా లాల్‌ని హత్య చేసిన నిందితులను వదిలేసిన వాసనలు ఈ కేసుకు సంబంధించి న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుల్లో కనిపిస్తాయి."

| జైన్ హవాలా కుంభకోణం 1991 | హర్షద్ మెహతా కుంభకోణం 1992 | కేతన్ పరేఖ్ స్టాక్ కుంభకోణం 2000 |
|---|---|---|



సురేంద్ర కుమార్ జైన్



హర్షద్ మెహతా



కేతన్ పరేఖ్

1991 జూన్-జులై మాసాల్లో పి వి నరసింహారావు ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో దిగుమతులపైనా, పరిశ్రమలపైనా ఆనాడు అమలులో ఉన్న నియంత్రణలను ఎత్తేయడం జరిగింది. ఆ కాలంలో హర్షద్ మెహతా విజయగాధలకు మరింత ఊతం దొరికింది. మానవ వనరుల వృద్ధి, లింగ వివక్షత నిర్మూలన, క్రియాశీలమైన నగరాల అభివృద్ధి జరగాలంటే, ఈ విధానాలు అమలు చేయాలని చెప్పుకున్నా, వాస్తవంలో అవేవీ కార్యరూపం దాల్చలేదు. కానీ అరాచక ద్రవ్య పెట్టుబడి మాత్రం వేళ్లూనుకుంది.

ద్రవ్య నియంత్రకులు మార్కెట్ పెరుగుదలలో హర్షద్ మెహతా పాత్ర ఏమిటో పసిగట్టలేకపోయారు. మెహతా కార్యకలాపాలను బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ పరిశోధించడం మొదలు పెట్టింది. 1992 మొదట్లో ఆదాయపన్ను శాఖ మెహతా ఆఫీస్, ఇంటిపై దాడి చేసింది. అతనికీ, దుబాయ్ నుంచి పనిచేసే చీకటి సామ్రాజ్యాధినేతకీ సంబంధాలు ఏమైనా ఉన్నాయా అని పన్ను అధికారులు పరిశోధించడంలో తలమునకలయ్యారు. కానీ ఏ ఆధారాలూ దొరకలేదు. యునైటెడ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎస్ఏ దవే, ఆనాటి చీకటి రోజులను గుర్తు చేసుకుంటూ, ధన ప్రవాహం ఇబ్బడిముబ్బడిగా జరుగుతుండేదని అన్నారు. అప్పటి రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఆర్థిక సంస్థల అధినేతలతో సమావేశం జరిపారు.

1992 ఫిబ్రవరి నెలలో, ఒక ఏడాది గడువులోనే అసోసియేటెడ్ సిమెంట్ కార్పొరేషన్ వాటాల విలువ రూ 350/- నుంచి రూ 4500 లకు పెరిగింది. అదే కాలంలో మొత్తం మార్కెట్‌లో వాటాల విలువలు 1000 నుండి 2300కి ఎగబాకాయి. ఆర్థిక మంత్రి అనుసరించిన సంస్కరణల ఫలితంగా మార్కెట్ పుంజుకుందని ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక కితాబు నిచ్చింది. ఇక అప్పుడే వెర్రి ముదిరింది. ఏప్రిల్ తరువాతి రెండు నెలల్లో ఏసిసి వాటా విలువ రూ 4500/- నుంచి రూ 11500/- పెరిగింది. సెన్సెక్స్ కూడా రెట్టింపు అయింది.

వెంటనే, మార్కెట్ పతనం ప్రారంభమయింది. ఒక ఏడాది తర్వాత సెన్సెక్స్ 2000 కి పడిపోయింది. సిటీ బ్యాంక్, లేదా ఫైనాన్సియల్ టైమ్స్ విశ్లేషించినట్టు భారతదేశ మార్కెట్ వృద్ధి చెందలేదు సరికదా భారతదేశం సంక్షోభం నుండి బయట పడటానికి ఐఎంఎఫ్ మద్దతు తీసుకోవలసిన అవసరం ఏర్పడింది.

మెహతా మోసపూరిత కథలు వినిపించి, ప్రభుత్వ బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు తీసుకుని దర్జాగా తనకిష్టమైన వాటాలు కొనేవారు. రుజువులు లేవన్న పేరుతో జెస్సికా లాల్‌ని హత్య చేసిన నిందితులను వదిలేసిన వాసనలు ఈ కేసుకు సంబంధించి న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుల్లో కనిపిస్తాయి. "జస్సికాని ఎవరూ చంపలేదు" అని ఆనాటి టైమ్స్ ఆఫ్ ఇండియా విలేఖరి ఆ నేరంన్ని గురించి వ్రాసిన తన వ్యాసానికి శీర్షిక పెట్టారు. హర్షద్ మెహతా కుంభకోణంలో కూడా మెహతాకి వివిధ వాటాలు కొనడానికి రూ 500/- కోట్లు వడ్డీ లేని 'రుణాన్ని' మంజూరు చేసిన ప్రఖ్యాత స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా యాజమాన్యం, ఎగ్జిక్యూటివ్ బోర్డు ఎటువంటి ఆరోపణలను ఎదుర్కోలేదు. వాస్తవంగా మెహతా ఆ లావాదేవీలు చేశారో లేదో తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం బ్యాంకు వద్ద లేదన్న రిజర్వ్ బ్యాంక్ ఉటంకింపును చూపుతూ, పరదాల మాటున వాస్తవాన్ని దాచి పెట్టి అందరూ తప్పించుకున్నారు. నిజానికి రిజర్వ్ బ్యాంకుకి, ఒక వ్యక్తి లావాదేవీలు సరైనవో కావో పరిశీలించడానికి మూడేళ్ల కాల పరిమితి ఉంది. కానీ రిజర్వ్ బ్యాంక్ దాటేసింది. ఇప్పుడది ఒక అలవాటుగా మారిపోయింది.

హర్షద్ మెహతా ప్రజల సొమ్మును కాజేసి, దర్జాగా జీవితం గడిపేసి చిన్న వయసులోనే చనిపోయాడు. ఆదాయ పన్ను శాఖ ఇప్పటికీ మెహతా భార్యను వేధిస్తున్నది. అయితే అవినీతిపరుడైన హర్షద్ మెహతా సాధారణ ప్రజలకు ఒక హీరో అయిపోయాడు. ఒక సారి పంకజ్ మిశ్రా అనే రచయితతో గోయెంకా రైలులో ప్రయాణించాడు. గోయంకా అతనితో, "ప్రజలు హర్షద్ మెహతాని ఎందుకు అవినీతి పరునిగా చూస్తారు? అతను బాగా డబ్బు సంపాదించాడనా? నిజానికి అతను అవినీతి పరుడైనా ఎంతో మంది యువకులకు

**"1999 అక్టోబర్ నుండి 2001 మార్చి మధ్య కాలంలో స్టాక్ మార్కెట్ వాటాల ధరలను గౌతమ్ అదానీ తారుమారు చేస్తున్న విషయానికి సంబంధించి సెబీ ఒకే ఒక్క ఆధారాన్ని పొందగలిగింది. అదానీ సంస్థ పరేఖ్, ఇతర బ్రోకర్స్‌తో కలిసి "సర్క్యులర్ ట్రేడింగ్" చేశారు."**

స్ఫూర్తిదాయకుడు" అని అన్నాడట. హర్షద్ మెహతా అనుసరించిన విధానాలు పాతవయి పోయాయి. కానీ మన ఆదాయం కన్నా దర్జాగా బతకాలనే వారసత్వం కొనసాగుతున్నది.

**కేతన్ పరేఖ్ అనుసరించిన మార్గం**

హర్షద్ మెహతా అవినీతి స్ఫూర్తినింపిన అనేకమంది యువకులలో ఒక పేరొందిన యువకుడు కూడా ఉన్నాడు. అతడే కేతన్ పరేఖ్. 1963లో పుట్టిన పరేఖ్,ఒకప్పుడు హర్షద్ మెహతా దగ్గర పనిచేసాడు. 1998 ప్రాంతంలో కొత్తగా 'బిగ్ బుల్ ' గా ఎదిగాడు. పరేఖ్ వేగంగా ధనికుడవుతున్న సమయంలో అంతగా ఎవరికీ తెలియని సాంకేతిక పరిజ్ఞాన కంపెనీల వాటాల ధరలను అమాంతం పెంచేసాడు. ఆనాడు ఈ కంపెనీల వాటాలు పెద్దగా మార్కెట్లలో మారకంలో ఉండేవి కావు . అంటే అవి యజమానుల ఆధ్వర్యంలోనే ఉన్నాయి. కేవలం కొద్ది వాటాలు మాత్రమే అమ్మకానికి వచ్చాయి. ఇటువంటి వాటాల క్రయ విక్రయాలు చేస్తూ ధరలను పెంచి, సంస్థాగత మదుపరులను ఆకర్షించాడు పరేఖ్. మదుపరులు ధరలు పెరుగుతాయన్న నమ్మకంతో కొనడం మొదలు పెట్టారు. ప్రపంచ సూచిక ఫిబ్రవరి 2000 చివరి వరకుపెరుగు తూనే ఉండింది- ఆ సమయంలో ఇంట్రా డే ట్రేడింగ్ లో(తొలుత విక్రయించి తరువాత కొనే విధానం) వాటాల ధర అటుఇటుగా 6000కి చేరింది. పరేఖ్ అమ్మ దలుచుకున్న ధరలకు ఆ వాటాల ధరలు చేరగానే తన వాటాలను అమ్మేసాడు. అంతే 2001 మార్చ్ నాటికి ధరల పరుగు ఆగిపోయి, పతనం మొదలయింది. (పంప్ అండ్ డంప్-కృత్రిమంగా ధరలు పెంచు, మదుపరులను ముంచు అన్నది పరేఖ్ సిద్ధాంతం). పరేఖ్ నడిచిన బాటలోనే ఇప్పుడు అనేకమంది నడుస్తున్నారు. పరేఖ్, భారతదేశ కార్పొరేట్, పాలనా వ్యవస్థలలోని లోపాలను బహిర్గతం చేశాడు. వ్యవస్థాపకులు, యజమానులు, మదుపరులను సునాయా సంగా మోసం చేయగలరు. తన వృత్తి ప్రారంభించిన తొలిరోజుల్లో పరేఖ్, గౌతమ్ అదానీ ప్రధాన సంస్థల వాటాలతో, అతని అధికారులతో సమన్వయ పరచుకుంటూ, వాటి ధరలను పెంచడంలో ముఖ్య పాత్ర పోషించాడు. మనుషుల నియంత్రణ లేని సాంకేతిక పరిజ్ఞానం ఏ మాత్రం రక్షణ కల్పించలేదని రుజువు చేసాడు. అన్నిటినీ మించి, దొడ్డి దారులలో పొందిన సంపదను దాచుకోడానికి మారిషస్ (ఇతర పన్ను లేని స్వర్గధామాలు ను ఉపయోగించడం మొదలు పెట్టిన మొదటి వ్యక్తి పరేఖే.

1999 అక్టోబర్ నుండి 2001 మార్చి మధ్య కాలంలో స్టాక్ మార్కెట్ వాటాల ధరలను గౌతమ్ అదానీ తారుమారు చేస్తున్న విషయానికి సంబంధించి సెబీ ఒకే ఒక్క ఆధారాన్ని పొందగలిగింది. అదానీ సంస్థ పరేఖ్, ఇతర బ్రోకర్స్‌తో కలిసి "సర్క్యులర్ ట్రేడింగ్" చేసారు. (అంటే తనబృందంలో కొందరి చేత పదే పదే ఒకే రోజులో పలుసార్లు వాటాలు కొని అమ్మేటట్టు చేయడం ద్వారా వాటాల మారకాలు విపరీతంగా జరుగు తున్నట్టు చిత్రించడం, తద్వారా వాటి విలువ ఎక్కువగా ఉన్నట్టు చూపి ధరలు పెరిగేందుకు అనువైన వాతావరణాన్ని తయారుచేయడం). అంటే వాళ్లలో వాళ్లే కొనడం అమ్మడం చేసుకుంటూ ధరలను పెంచుకుంటూ పోయారన్నమాట. ఇటువంటి అలావాదేవీలు తప్ప ఆ సంస్థలలో ఎటువంటి ఇతర క్రయ విక్రయాలు జరగలేదని సెబీ కనుగొనింది. వారు చేసిన వ్యాపారం ఉధృతంగా జరుగుతున్నట్టు భ్రమ కల్పించింది. కొత్త మార్కెట్ ధరలు నమోదు చేయబడేవి. ఇప్పటికీ, సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, ఈ పద్ధతి కొనసాగుతూనే ఉంది.

తన మార్కెట్ ఎత్తులకు నిధులు సమకూర్చుకోడానికి పరేఖ్ కూడా, హర్షద్ మెహతా అనుసరించిన పద్ధతులనే అనుసరించాడు- బలహీన దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులను, ప్రధానంగా మాధవపుర మర్కంటైల్ కో ఆపరేటివ్ బ్యాంకును వాడుకున్నాడు.

1983లో భారతదేశం మారిషష్‌తో రెట్టింపు పన్నుల తొలగింపు ఒప్పందం (డబల్ టాక్స్ అవోయిడెన్సు అగ్రిమెంట్) చేసుకుంది. కానీ 1991 వరకు ఇది ఏ మాత్రం చురుకుగా అమలు కాలేదు. తయారీ రంగం పుంజు కోవాలని ఆ నాడు ప్రవేశపెట్టిన ఉదారవాద విధానాలు నిజానికి ద్రవ్య కార్యక్రమాల విస్ఫోటానికి దారి తీసింది. మారిషస్, ఆ దేశంలో నివసించే వారి కంపెనీలపై పన్నులు విధించదు. డిటిఎఎ (డబల్ టాక్స్ అవోయిడెన్సు అగ్రిమెంట్) భారతదేశంతో సహా అనేక దేశాలకు చెందిన మారిషషేతర కంపెనీలు కూడా అక్కడి ప్రోత్సాహకాలను అందుకోడానికి అక్కడే నివాసాలు ఏర్పాటుచేసుకోవడం అవసరమయ్యింది.

మారిషస్ కేవలం పన్ను ఎగవేత దారుల స్వర్గధామం మాత్రమే కాదు, అక్కడి అధికారులు మారిషస్‌కి చెందిన వారు ఎవరు, విదేశస్తులెవరు అనే విషయాన్ని అసలు పట్టించుకోరు. అందువలన ప్రపంచవ్యాప్తంగా పేరు ఊరు లేని అనేక బినామీ కంపెనీలు -వీటిని షెల్ కంపెనీలని పిలుస్తుంటారు- మారిషస్ ద్వారా భారతదేశం లోకి నిధులు మళ్లించడం మొదలు పెట్టాయి. భారత దేశంలోని పెట్టుబడిదారులు రాజకీయ వేత్తలు కూడా) విదేశాలలో తాము పెట్టిన పెట్టుబడుల ద్వారా సమకూరిన, లేదా ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా పొందిన నిధులను మారిషస్ ద్వారా భారతదేశంలోకి మళ్లించడం మొదలు పెట్టారు.

భారతదేశం విదేశీ నిధులను ఆకర్షించాలనే తాపత్రయానికి మారిషస్ మార్గాన్ని ముడిపెట్టడంలోనే పరేఖ్ తెలివి దాగి ఉంది. విదేశాలలో నివసించే భారతీయులు తమ సంపాదనలు భారతదేశానికి 'ఓవర్సీస్ కార్పొరేట్ బాడీస్' ద్వారా పంపవచ్చు. ఇవి సర్వసాధారణంగా అనామకంగా ఉంటాయి. 1999లో రిజర్వు బ్యాంకు, తామీ కంపెనీలను గమనించడం లేదని ఒప్పుకుంది. భారతదేశంలోని అనేక కంపెనీలు 'ఓవర్సీస్ కార్పొరేట్ బాడీస్'

ద్వారా, మారిషస్ లోని లేదా ఇటువంటి ఇతర పన్ను స్వర్గధామాలను అడ్డం పెట్టుకుని నిధులను తరలించడం మొదలు పెట్టాయి. విదేశీ సంస్థాగత మదుపరులు పేరు లేని తమ కంపెనీల ఖాతాలలోనుండి వచ్చిన సొమ్ముతో భారతదేశంలో పెట్టుబడులు పెట్టవచ్చునని భారతదేశం మరో నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో, భారతదేశా నికి నిధులు తిరిగి తెచ్చుకోడానికి 'ఓవర్సీస్ కార్పొరేట్ బాడీస్' బాగా ఉపయోగపడ్డాయి.

ఆ తరువాతి ఆకాలంలో పరేఖ్ అక్రమాస్తులను లెక్కించేందుకు వేసిన ఒక జాయింట్ పార్లమెంటరీ కమిటీ, పరేఖ్ 14 'ఓవర్సీస్ కార్పొరేట్ బాడీస్', నాలుగు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల ఉప ఖాతాల ద్వారా, కొన్ని కంపెనీలను లక్ష్యంగా పెట్టుకుని, వాటి వాటాల ధరలను తారుమారు చేయడానికి పాల్పడ్డాడని కనుగొన్నారు. సర్కులర్ ట్రేడింగ్ విధానం ఉపయోగించే నిధులను మళ్లించారు. జెపిసి నివేదికలో అదానీ ఎగుమతుల కంపెనీ ప్రధానంగా కనిపిస్తున్నది. దానిని సెబీ కూడా ధ్రువపరిచింది. 2003 లో సెబీ, పరేఖ్ వ్యాపారలావాదేవీలు చేయడాన్ని నిషేధించింది. అయినా అతగాడు బినామీ పేర్లతో మార్కెట్‌ను ప్రభావితం చేస్తూనే ఉన్నాడు. 2018 ఫిబ్రవరిలో ప్రత్యేక కోర్టు సెబీకి కట్టాల్సిన జరిమానా కట్టనందుకు అతడికి మూడేళ్ళ ఖైదు విధించింది.

భారతదేశంలోని విధాన నిర్ణయాధికారు లంతా పరేఖ్‌ను మోసాలకు పాల్పడమని కాళ్లుగడ్డాలు పట్టుకుని బతిమాలాడారు. పరేఖ్ 'పెద్ద బుల్' కాకముందు నుండి కూడా విధాన నిర్ణయాలు తీసుకునే వారందరూ మారిషష్ మార్గం దుర్వినియోగం అవుతున్నదని ఎరుగుదురు. పెట్టుబడిదారులు భారతదేశానికి మారిషస్‌లోని బినామీ కంపెనీల ద్వారా డబ్బు మళ్లిస్తున్న విషయాన్ని గమనించినట్లు ఆర్థిక శాఖ కార్యదర్శి మాంటెక్ సింగ్ అహ్లువాలియా 1993 నవంబర్‌లో ఒక అంతర్జాతీయ సంభాషణలో తెలియచేసారు.

అందువలనే ఆయన ఈ డబల్ టాక్స్ ఒప్పందానికి స్వస్తి పలికేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఇదే విషయాన్ని ఆయన మళ్ళీ 1994 డిసెంబర్ లోకూడా చెప్పారు. అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ఈ ప్రతిపాదన పై చర్చించడానికి కూడా సిద్ధపడ్డారు. అయితే, ''ఈ విషయంలో మరింత ఆత్రుత పడకూడదని'' నిర్ణయించారు.

❝ భారతదేశ నియంత్రణ సంస్థలు, కోర్టులు కూడా ఒక స్థిరమైన విధానం తీసుకోడానికి ముందుకు రాలేదు.
మారిషస్ దారిని అనుసరించవచ్చా లేదా అనే వాదన సుప్రీం కోర్టు ముందుకు వచ్చినప్పుడు, "దీని వలన ప్రభుత్వం విదేశీ నిధులను ఆకర్షించగలుగుతున్నది, సాంకేతిక జ్ఞానాన్ని పొందగలుగుతున్నది'' అని కోర్టు వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. ❞

స్టాంప్ పేపర్ల కుంభకోణం 2002



అబ్దుల్ కరీం తెల్గీ

సత్యం కంప్యూటర్స్ కుంభకోణం 2009



రామలింగ రాజు

మాల్యా కుంభకోణం 2016



విజయ్ మాల్యా

భారతదేశ నియంత్రణ సంస్థలు, కోర్టులు కూడా ఒక స్థిరమైన విధానం తీసుకోడానికి ముందుకు రాలేదు.

మారిషస్ దారిని అనుసరించవచ్చా లేదా అనే వాదన సుప్రీం కోర్టు ముందుకు వచ్చినప్పుడు, "దీని వలన ప్రభుత్వం విదేశీ నిధులను ఆకర్షించగలుగుతున్నది, సాంకేతికజ్ఞానాన్ని పొందగలుగుతున్నది" అని కోర్టు వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. ఏ ఒప్పందం జరిగినప్పుడయినా దానివలన కొన్ని దుష్ఫలితాలు కూడా ఉన్నట్లే ఇందులో కూడా ఉన్నాయని వ్యాఖ్యానించింది.

చివరికి 2012లో నకిలీ ఖాతా దారులకు పన్ను రాయితీలు తొలగించడానికి చొరవ తీసుకున్న తరువాతే మారిషస్ నుండి నిధులు మళ్లే వేగం తగ్గింది. పన్నుల స్వర్గాలను నిరోధించాలనిఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్మెంట్ ఒత్తిడి తేవడం, మరీ ముఖ్యంగా 2016 ఏప్రిల్ పనామా పేపర్స్ వెలుగులోకి రావడంతో భారతదేశం స్పందించక తప్పలేదు. మారిషస్‌తో జరిగిన ఒప్పందానికి సవరణ కారణంగా అల్పకాల పెట్టుబడులపై 15% పన్ను వేసే హక్కు భారతదేశానికి వచ్చింది. మారిషస్ నుండి వచ్చే పెట్టుబడులు తగ్గాయి.

అయితే నకిలీ పెట్టుబడిదారుల బెడద మాత్రం ఇంకా అలాగే కొనసాగుతున్నది. ఇతర పన్ను స్వర్గధామాల నుండి వచ్చే వ్యాపార పెట్టుబడులు, ఉదాహరణకి సింగపూర్ నుండి కొనసాగుతూనే ఉన్నాయి. ఐతే అమెరికా నుండి వచ్చే పెట్టుబడులు పెరుగుతున్నాయి. అమెరికాలోని పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వికేంద్రీకరించుకో గోరుతున్నందువలన అమెరికా నుండి చెప్పుకోదగ్గ స్థాయిలో పన్ను స్వర్గధామాలతో సంబంధాలున్న దేశాలకు తరలిస్తున్నారు. అక్కడి చట్టాల ప్రకారం ఏ రకమైన గుర్తింపు చూపవలసిన అవసరం లేకుండానే సంస్థల స్థాపనకు అనుమతి ఉంటుంది. ఈ రోజు అమెరికా ఆర్థిక గోప్యత సూచిలో అగ్రభాగాన ఉంది. అదే మన పెట్టుబడుల ప్రవాహానికి ప్రధానం. అమెరికా పెట్టుబడి బ్యాంకులు తమ శాఖలను పెద్ద ఎత్తున పన్ను స్వర్గధామాల్లో ఏర్పరచుకుంటాయి. 2019లో గోల్డ్మన్ సాచ్స్‌కి 905 శాఖలు, మోర్గాన్ స్టాన్లీకి 619 శాఖలు ఈ ప్రదేశాలలో ఉండేవి. అత్యధిక మొత్తాలలో పెట్టుబడులను పెట్టే 20 ఇతర ఆర్థిక సంస్థలకు కూడా పన్ను స్వర్గధామాల్లో శాఖలు ఉన్నాయి. పోర్ట్ఫోలియో పెట్టుబడులలో మారిషస్ ప్రథమస్థానం నుండి పడిపోయినా, ఇప్పటికి భారతదేశ విదేశీ ప్రత్యక్ష

> " జవాబుదారీ తనం లేకపోవడంతో బ్యాంకులు ఉచ్ఛస్థాయిలో ఉన్నాయి. ప్రైవేటు వ్యక్తులకి, సంస్థలకి బ్యాంకులను అప్పచెప్పడం అన్నది ఉట్టిమాట. ఇవి ప్రభుత్వం చేతిలోని శక్తివంతమైన అస్త్రంగా ఉన్నాయి. బ్యాంకులు ఉన్నతవర్గానికి నిధులను దోచిపెట్టే ఒక మార్గం. ఏ ప్రభుత్వమూ ఈ అస్త్రాన్ని వదులుకోడానికి సిద్ధంగా లేదు. "

పెట్టుబడులలో ప్రధమస్థానం లోనే ఉండడం విచిత్రం.

ఉదారవాద విధానాలు అమలు చేయడం మొదలు పెట్టిన తరువాత విధానకర్తలు, "విదేశీ" నిధులు ఆకర్షించడానికి వెంపర్లాడటం పెరిగింది. కేతన్ పరేఖ్ జ్ఞాపకాలు మసక బారిన చాలాకాలం తర్వాత కూడా ఇందుకు అవకాశాలు పచ్చగానే ఉన్నాయి. ఈ మధ్యే గౌతమ్ అదానీ, అతని కంపెనీలు అనుసరించిన విధానాలు పరేఖ్ విధానాలకు అనుకరణలుగానే ఉన్నాయి. 2023 జనవరిలో హిడిన్బర్గ్ పరిశోధన సంస్థ, అదానీ గ్రూప్ మారిషస్, ఇతర పన్ను స్వర్గాలను తమ తక్షణ ప్రయోజనాలు కాపాడుకోడానికి వాడుకుంటున్నట్టు, తద్వారా వాటాలను ప్రభావితం చేస్తూ ప్రయోజనం పొందుతున్నట్టు ఆరోపించింది. అదానీ గ్రూప్ వెంటనే గట్టిగా ఈ ఆరోపణలను ఖండించినా, సుప్రీం కోర్టు సెబీని దీనిపై పరిశోధించమని ఆదేశించింది. ఇంతకు ముందు పరోశోధనా సంస్థలలాగే, సెబీ కూడా తూతూమంత్రంగా పరిశోధించింది. మే నెలలో సెబీ సమర్పించిన నివేదికలో "ఆధారాలు దొరకలేదని", "అంతుచిక్కడం లేదని", "మరింత లోతయిన పరిశోధన కూడా ఫలితాలను ఇవ్వదని'' చెప్పింది. యాజమాన్యం చివరికి ఎవరి చేతుల్లో ఉందో తెలుసుకోవడం కష్టంగా ఉందని, "పారదర్శకత" లోపించిందని చెప్పింది. ఆగస్టు మాసం చివరిరోజుల్లో ఆర్గనైజ్ క్రైం అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ ఈ అవరోధాలను అతిక్రమించే ప్రయత్నం చేసింది. 2013-2018 మధ్య కాలంలో అదానీ సంస్థలు వాటాల ధరలు తారుమారు చేసిన సంఘటనలను ఎత్తిచూపింది. ఒసిసిఆర్పి, సెబీని కూడా ఎత్తిపొడిచింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని ప్రభుత్వం ఒత్తిడికి గురిచేసిందని, అదానీ గ్రూప్‌లో అనుమానాస్పద కార్యకలాపాలను ప్రస్తావించిన ఉత్తరాన్ని కూడా అలక్ష్యం చేసిందని ఎత్తిచూపించింది.

కుంభకోణాలు చేసేవారు నియంత్రణలు చేసేవారికంటే అడుగు ముందుంటారు. అందువలన కుంభకోణాలు చేసేవారి నిర్మాణాలు సహజంగానే అస్పష్టంగా ఉంటాయి. నియంత్రణలు చేసేవారు దోషులను శిక్షించడంలో నిస్సహాయతను ప్రదర్శించే అవకాశాలే ఎక్కువ ఉంటాయి.

### భారత జాతీయ బ్యాంకులను దోపిడీ చేసిన ఘనత

భారతదేశం లోని జాతీయ బ్యాంకులను దోపిడీ చేయడానికి పెద్దగా నైపుణ్యం, కళాత్మకత అవసరం లేదు. ఇది కేవలం సాధారణ అవినీతుల కథే. 1969 జులైలో ప్రధానమైన జాతీయ బ్యాంకులను జాతీయం చేసినప్పటి నుండి రాజకీయ నాయకులు వాటిని వ్యక్తిగత నిల్వలుగా వాడుకోడం పరిపాటయింది. ఇందిరాగాంధీ జాతీయం చేయడాన్ని ఒక అద్భుతమైన చర్యగా చెప్పుకున్నా, ధనవంతుల వద్ద ఉన్న సొమ్ము పేదలకు పంపకం చేస్తానని చెప్పినా, దాని నుండి మొట్టమొదటిసారిగా ప్రయోజనం పొందినది సంజయ్ గాంధీ. అతడు సెంట్రల్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులను భయపెట్టి, బెదిరించి తన కార్ల కంపెనీకి నిధులు సమకూర్చుకున్నాడు. పరపతి ఉన్నవాళ్ళకి నిధులు ఎలా సమకూరుతాయో చెప్పడానికి ఇదో ఉదాహరణ.

ఉదారవాద విధానాలు అమలైన తరువాత ప్రభుత్వ బ్యాంకుల నుండి పెద్ద ఎత్తున నిధులను తస్కరించడం జరుగుతున్నది. ఇటువంటి కుంభకోణాలలో బాగా ఖ్యాతి పొందినవారు విజయ్ మాల్యా, నిరవ్ మోడీ, మెహరుల్ చోక్సిలు. వీరంతా చట్టానికి అతీతులుగా ఉన్నారు. విదేశాలకు తప్పించుకు పోయారు. భారతదేశ అధికారులు ఇప్పటికీ ఏళ్లతరబడి ఈ దుష్టులను భారతదేశానికి రప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పుకుంటున్నది. ఈ పోకిరిలందరిలో అత్యంత దర్జా వెలగబెట్టినవాడు మాల్యా. అతనికో విహార నౌక ఉంది. కార్ రేసులు బృందం ఉంది. ఫుట్ బాల్ క్లబ్ ఉంది. క్రికెట్ టీమ్ కూడా ఉంది. ఏంతో మంది ఆత్రంగా ఎదురు చూసే అతని కింగ్ ఫిషర్ క్యాలెండర్ల నిండా పొదుపుగా దుస్తులు ధరించిన మహిళలే ఉంటారు. అట్టహాసంగా జరిగిన అతని 50 వ జన్మదినం సందర్భంగా లియోనెల్ రిచి సందడి చేసాడు.

బ్యాంకులను దోచుకోవడం ఇప్పుడు అతి సాధారణ విషయంగా మారింది. ఇప్పుడు హేమాహేమీలు మాత్రమే దోచుకోడం లేదు. వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ పోతున్నది. 2015లో అప్పటి రిజర్వు బ్యాంకు గవర్నర్ రఘురాం రాజన్, మోసాలకు పాల్పడిన పేరువోసిన అవినీతి పరుల చిట్టాను ప్రధానమంత్రి నరేంద్రమోడీకి పంపించారు. సంబంధిత శాఖల సమన్వ యంతో పరిశోధన చేస్తారని భావించారు. కానీ ''ఒక్క అవినీతిపరుడినయినా పట్టుకోడం లో వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, ఫలితంగా అవినీతి ఏమాత్రం తగ్గుముఖం పట్టలేదని" 2018లో రాజన్ ఆవేదన వ్యక్తం చేసారు.

ఈ కుంభకోణాలకు ఇప్పుడు ఒక ముసుగు వేశారు. బ్యాంకులో అప్పు తీసుకున్న వ్యక్తి కొన్ని నెలలపాటు సమయానికి చెల్లించకపోతే, బ్యాంకు దానిని రద్దు చేసుకుంటుంది. ప్రుడెన్షియల్ నార్మ్స్ ప్రకారం, బ్యాంకులు తమ రాబడిలోనుండి ఇటువంటి పారుబకాయిలకోసం నిధులు కేటాయించుకోవాలి. సూత్ర రీత్యా, వసూలయినప్పుడు రద్దు చేసిన ఖాతాలో వసూళ్లను జమచేసుకోవాలి. కానీ ఈ పద్ధతి అమలు సాధారణంగా జరగదు. రద్దైన ఖాతాలు పెరుగుతుంటాయి. 2022-23 సంవత్సరంలో బ్యాంకులకు చెందిన రూ. 10.57 లక్షల కోట్ల రుణాలు రద్దయ్యాయి. అందులో పాతిక శాతం కూడా వసూళ్లు కాలేదు. రుణాలు రద్దు చేసినందువలన బ్యాంకుల పెట్టుబడిలో తరుగు ఏర్పడుతుంది. ఈ తరుగును కేంద్ర ప్రభుత్వం పూడుస్తుంటుంది. అంటే ఎగ్గొట్టిన రుణాలను ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నమాట. అంటే ఇది పన్ను చెల్లింపుల నుండి భర్తీ అవుతుంది. అంటే ఎగ్గొట్టిన బ్యాంకు రుణాలను పన్ను చెల్లింపుదారుడు చెల్లిస్తాడన్నమాట.

జవాబుదారీ తనం లేకపోవడంతో బ్యాంకులు ఉచ్ఛస్థాయిలో ఉన్నాయి. ప్రైవేటు

వ్యక్తులకి, సంస్థలకి బ్యాంకులను అప్పచెప్పడం అన్నది ఉట్టిమాట. ఇవి ప్రభుత్వం చేతిలోని శక్తివంతమైన అస్త్రంగా ఉన్నాయి. బ్యాంకులు ఉన్నతవర్గానికి నిధులను దోచిపెట్టే ఒక మార్గం. ఏ ప్రభుత్వమూ ఈ అస్త్రాన్ని వదులుకోడానికి సిద్ధంగా లేదు.

బ్యాంకింగ్ వ్యవస్థలో మరో భాగం బ్యాంకేతర ఆర్థిక కంపెనీలు. ఇవి ప్రభుత్వ బ్యాంకులకన్నా భయంకరంగా పనిచేస్తున్నాయి. విధానపరంగా ఇవి నిల్వలు ప్రజలనుండి (వినియోగదారుల నుండి) వసూలు చేయవు. అందువలన నియంత్రణ అవసరం తక్కువగా ఉంటుందనే అపప్రద ఉంది.

2018 ఆగస్టులో ఇన్ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ (ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ) దివాళా తీయడం, దాని పర్యవసానాలు ప్రాధాన్యత సంతరించుకు న్నాయి . ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ 1987లో స్థాపించబడింది. దాని ప్రధాన ఉద్దేశం- పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలు కల్పించడం. చట్టపరంగా ఇదొక ప్రైవేటు సంస్థ. కానీ ఇది ప్రభుత్వ సంస్థల నుండే తన మొత్తం వాటాలను పొందింది. ఆ తరువాతి కాలంలో ఎల్ఐసి దీనిలో ప్రధాన భాగస్వామి అయింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ప్రభుత్వం నుండి కూడా నిధులు పొందుతుంది. అసాధారణ పరిస్థితులలో ప్రపంచబ్యాంకు, ఆసియన్ డెవలప్ మెంట్ బ్యాంకు, జర్మన్ డెవలప్ మెంట్ బ్యాంకు, కెఎఫ్‌డబ్ల్యూ లకు, ఈ సంస్థ చేసే నిధుల చెల్లింపులకు హామీదారుగా కూడా ఉంటుంది.

ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రజల ప్రయోజనాలు కాపాడే కళలో నైపుణ్యం సంపాదించే ప్రయత్నం చేయకపోవడం వలనే, ప్రభుత్వం కుంభకోణాలు నివారించలేకపోతున్నది. దానికి తోడుగా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్, ప్రభుత్వంతో తనకున్న సంబంధాల రీత్యా, తాను నియంత్రణలకి అతీతంగా ప్రవర్తించేందుకు సదుపాయాలు కూడా పొందింది. మౌలిక వసతుల కల్పన కాంట్రాక్టులకిచ్చే సమయంలో బిడ్డింగ్ అసలు విలువ కట్టడంలో తరచుగా జరిగే మతలబులు, సహేతుకత కనిపెట్టడం సాధ్యపడేది కాదు. నిజమైన ఆర్థిక విలువ కనిపెట్టడం అసాధ్యంగా ఉంటుంది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ దివాళా తీసిన తరువాత, దాని ఆస్తులు, ఆదాయాలు లెక్కకట్టిన రవి పార్థసారధి, అతని వర్గం ధరలను ఎంత

> "అధికారిక లెక్కల ప్రకారం భారతదేశంలో 3000 ఫిన్ టెక్ లు ఉన్నాయి. అభివృద్ధికి కేంద్ర బిందు వవుతాయనే ఆశావహులు నిరీక్షణల మధ్య ఈ ఫిన్ టెక్ లు విస్తరిస్తుండగానే ఇందులోకి డిజిటల్ మోసాలు చొచ్చుకు వచ్చాయి. కోవిడ్ -19 మొదటి దశలో లాక్డౌన్ సందర్భంగా అనేక ఋణ ఆప్ లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి."

పిఎన్‌బి కుంభకోణం 2018



నీరవ్ మోడీ

ఐసిఐసిఐ కుంభకోణం 2018



చందా కొచ్చార్

హిండెన్‌బర్గ్ వెల్లడించిన అదానీ కుంభకోణం 2023



గౌతమ్ అదానీ

అహేతుకంగా చూపారో తెలిసింది. అర్థంలేని అంచనాలు చూపుతూ, ఆర్థిక గందరగోళాలు సృష్టిస్తూ, లావాదేవీలు చుట్టూ తిప్పుతూ, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కి చెందిన అనేక సంస్థల మధ్య లావాదేవీలను చూపుతూ, వారు లాభపడ్డారు. జాతీయ బ్యాంకులు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కి సదా నిధులు అందుబాటులో ఉంచి, వారి కొమ్ము కాశాయి. ఎందుకు రేటింగ్ ఇచ్చారో తెలియకుండా దివాళా తీయడానికి మూడు వారాల ముందుకూడా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కి నిధులు ఇచ్చారు. డైరెక్టర్లు, వాటాదారులు, ముందస్తు హెచ్చరికలు చేసినవారు, పార్థసారధిని సవాలు చేసినా, అతను వారినందరినీ లిటిగేషన్‌లలో ఇరికించి, బెదిరించి దారికి తెచ్చుకునేవాడు.

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌ను దివాళా నుంచి బయట పడేసే ప్రణాళిక కాగితంమీద ఉండవచ్చుగాక. కానీ పార్థసారధి నిర్మించిన పారదర్శకత లేని ఆర్థిక లావాదేవీల నిర్మాణంలో వాజ్యాలు ప్రతివాజ్యాలు జరుగుతూనే ఉంటాయి. తెగడం చాల కష్టం. ఏళ్ళకొద్దీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ వాదాలు కొనసాగుతాయి. ఆర్‌బిఐ మాత్రం గుణపాఠం నేర్చుకోలేదు. ఇతర బ్యాంకేతర ఆర్థిక కంపెనీలు కూడా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ వేసిన బాటలోనే నడుస్తున్నాయి. ఈ బ్యాంకులు ఇప్పటికీ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అయిదోవంతు రుణాలను అందిస్తున్నాయి. ఇవన్నీ ఉద్దేశపూర్వక అలసత్వ నియంత్రణ పాలనా వ్యవస్థ కొనసాగింపులే.

అనాదిగా అభివృద్ధికి ఉన్న అడ్డంకులనన్నిటినీ తొలగించుకుని ఉజ్వల భవిష్యత్తులో ఉరకలు వేయడానికి, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్ప్రింగ్ బోర్డులాగా ఉపయోగపడతాయని భారతదేశ ఉన్నతవర్గ దళారీల భావన. డిజిటల్ సాంకేతికత రూపకల్పన అభివృద్ధిని వేగవంతం చేస్తుందని, ఎడ్‌టెక్, మెడికల్లో అప్స్, ప్రపంచవ్యాప్తంగా సంబంధాలు కలిగిన కిరాణ్యా దుకాణాలు వగైరా పరిజ్ఞానం మరింత సమాన అభివృద్ధికి దోహద పడుతుందని భావిస్తారు. ఆర్థిక సేవలు అందించే డిజిటల్, మౌలిక సదుపాయాలు అందించే ఫిన్ టెక్ లు కొత్త అభివృద్ధి నమూనాలకు మూలం అని అనుకుంటారు.

అధికారిక లెక్కల ప్రకారం భారతదేశంలో 3000 ఫిన్ టెక్ లు ఉన్నాయి. అభివృద్ధికి కేంద్ర బిందు వవుతాయనే ఆశావహులు నిరీక్షణల మధ్య ఈ ఫిన్ టెక్ లు విస్తరిస్తుండగానే ఇందులోకి డిజిటల్ మోసాలు చొచ్చుకు వచ్చాయి. కోవిడ్ – 19 మొదటి దశలో లాక్డౌన్ సందర్భంగా అనేక ఋణ

> **“ భారతదేశ వ్యాపార సంస్థలు తమ సామర్థ్యాలను, సాంప్రదాయ యాజమాన్య పద్ధతులను కాపాడుకుంటా యన్నది నానుడి. ఉదాహరణకి కావాజి దవర్ 1854లో టెక్స్‌టైల్ మిల్లు స్థాపించింది. 1980-90లలో సాంకేతిక పరిజ్ఞాన స్టార్ట్ అప్ ప్రారంభించింది. అయితే, 1990 ల నుండి మరో దశ ప్రారంభమయింది. ”**

ఆప్ లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఉన్నట్టుండి ఆదాయాలు కోల్పోయిన వారికి నిధులు సమకూరుస్తామని బయలుదేరాయి. ఈ ఋణ ఆప్ లు ఋణ గ్రహీతలనుండి చాలా తక్కువ ప్రమాణ పత్రీకరణ డిమాండ్ చేస్తాయి. కానీ వడ్డీలు మాత్రం గూబగుయ్యి మనేంత వసూలు చేస్తాయి. విధిలేక వీళ్ళదగ్గర అంత వడ్డీకి కూడా అవసరమైనవారు అప్పులు తీసుకుంటారు. కానీ తిరిగి చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. 2021 నవంబర్లోనెలలో తీసిన రిజర్వు బ్యాంకు లెక్కలప్రకారం, మొత్తం 1100 ఆప్ లలో 600 ఆప్‌లు చట్ట విరుద్ధమైనవి. కానీ ఇవన్నీ మందులేని రోగాల వంటివి. వాటిని మన డిజిటల్ వ్యవస్థనుండి తొలగించినా మళ్ళీ మళ్ళీ జొరబడుతూనే ఉంటాయి. కుంభకోణాలు చేసేవారు రెండడుగులు ముందే ఉంటారు. ఆంక్షలన్నిటిని ఎప్పటికప్పుడు అధిగమిస్తూనే ఉంటారు.

కోవిడ్ –19 పోయింది. కానీ భారతీయ ప్రతినిధులు ఉన్న చైనీస్ ఆర్థిక యాప్స్ ఈ దోపిడీ కొనసాగిస్తూనే ఉన్నాయి. వీటిలో అనామక కంపెనీలు, క్రిప్టో కరెన్సీలు, వాట్స్ అప్, టెలిగ్రామ్ సందేశాలు కలగలిసి ఉంటున్నాయి. వ్యక్తులుగా చిన్న మొత్తాలే అయినా, ఈ యాప్‌ల కుంభకోణాల విలువ రూ 100/– కోట్లకు పైమాటే.

ఫిన్ టెక్ లో ఉన్న మరో అతి పెద్ద సమస్య, అవి సూత్రప్రాయంగా చట్టబద్ధమైన వ్యాపారాలు చేస్తుంటాయి. కానీ మోసపూరిత కార్యకలాపాలవైపు మళ్లుతుంటాయి. వాటికి స్పష్టమైన ఆర్థిక ప్రయోజనాలు లేకపోవడం మరింత సమస్యకు కారణమవుతుంది. వారంతా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ చెల్లింపుల సేవలు అందించేవారిగా మొదట రంగంలోకి వచ్చారు. అయితే వారు, ఆర్థిక రంగం చేసే పనులకు భిన్నమైన కార్యకలాపాలు ఏవి చేయడంలేదు. ఉదాహరణకి బ్యాంకులు ఇచ్చే క్రెడిట్ కార్డులకు గానీ, అప్పులివ్వడానికి గానీ భిన్నమైన సేవలు, అంతకన్నా సమర్థవంతంగా ఏమి చేయగలరు? సాంప్రదాయ ఆర్థికసేవలందించే సంస్థల పనులన్నీ చేయగలరా? నిజంగానే డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం అందించగలిగితే బ్యాంకులు ఈ విధానాన్ని ఎందుకు అనుసరించడం లేదు? ఆ సాంకేతిక పరిజ్ఞానంతో సమర్థవంతంగా తమ సేవలను ఎందుకు అందించడం లేదు?

డిజిటల్ చెల్లింపులు చేసే సమర్థవంతమైన సంస్థలలో పేటిఎం ప్రసిద్ధమైనది. కానీ అనేక ఇతర భారతదేశ కంపినీలలాగే ఇదికూడా తన వ్యాపారాన్ని అతి తొందరలోనే అనేక ఇతర రంగాలకు విస్తరించింది. భీమా, బంగారం అమ్మకాలు, సినిమాలు, విమానయాన టికెట్ అమ్మకాలు, ఆటలు వగైరాలకు విస్తరించింది. ఇది 2021 నవంబర్లో ఒక నాటకీయమైన కానుకగా రూ. 2000 కోట్ల మార్కెట్ విలువను కోరుకుంది. వెంటనే దాని వాటాల ధరలు రూ 2,000/– నుండి రూ 1,500/– పడిపోయాయి. ఆ తరువాత పతనం మొదలయింది. రూ 800/– వరకు దిగజారి రూ ఇప్పటికీ రూ 1000/– లోపే ఉంది. అనేక స్టార్ట్ అప్ లలాగే దాని లాభదాయకత ప్రశ్నర్థకంగా మారింది.

లాభాలు పెంచుకోవాలనే తాపత్రయం తో పేటిఎం విస్తరణకు తెరతీసింది. 9 నెలల వడ్డీలను 22శాతానికి పెట్టింది. నిజానికి ప్రాసెస్సింగ్ చార్జీలతో కలుపుకుంటే అది 30 శాతం నుండి 55 శాతం వరకు అవుతుంది. అయితే అప్పులు కావలసినవారికి వెంటనే సొమ్ము అందుతుంది. పత్రాల బెడద ఉండదు.

ఫిన్ టెక్‌లు అప్పులివ్వడం అనైతికం, అసహ్యకరమైన వ్యాపారం. కోవిడ్ –19 కాలంలో ఇవి అప్పులు చేయక తప్పని వారికి 500శాతం వడ్డీకి కూడా అప్పులిచ్చాయి. కొంతమంది రుణగ్రహీతలు వీటికి బానిసలయ్యారు. కిస్తీలు కట్టడం, కొత్తగా అప్పులు తీసుకోవడం పరిపాటిగా మారింది. అప్పులిచ్చేవారు అమానుషంగా వసూళ్లకు తెగబడతారు. బెదిరిస్తారు. అప్పులిచ్చేవారి దోపిడీకి అంతేలేదు. “అందరు చేసేదిదే” అనే పేరుమీద మంచికి చెడుకి తేడా లేకుండా పోతున్నది.

“అసాధారణ వడ్డీ” కి అప్పులివ్వడానికి వ్యతిరేకమని రిజర్వు బ్యాంకు ప్రకటిస్తుంది. సంస్థలను పర్యవేక్షిస్తున్నట్టు చెబుతుంది. ఫిన్

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

టెక్ లను బ్యాంకులతోనో బ్యాంకేతర ఆర్థిక సంస్థలతోనో కలవాలని చెవుతుంది. కానీ ఏ రకమైన నియమాలు పాటించనందుకు కేవలం పేటీఎం పై రూ 5.39 కోట్లు జరిమానా వేసి చేతులు దులుపుకుంది. రిజర్వు బ్యాంకు సూచనలకు అనుగుణంగా పేటీఎం వినిమయ దారుల వివరాలు సేకరించకపోయినా, దానిని వినియోగించుకుంటున్నవారి వలన వచ్చే నష్టాలను అధిగమించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోకపోయినా ఏమాత్రం చర్యలు తీసుకోలేదు.

**“ సాధారణంగా కుంభకోణాలు ఆర్థిక లావాదేవీలకు సంబంధించినవే. డబ్బు అక్కడే ఉంటుంది కాబట్టి. నేరపూరిత సంస్కృతి ఆర్థిక రంగంలోని వివిధ కోణాలకు కూడా పాకింది. చివరికి డిజిటల్ వ్యవస్థకి కూడా. జుడ్గే ఇంగోరం మాటల్లో చెప్పాలంటే దీని వలన “నైతికతకు, నిజాయితీకి , న్యాయానికి అగౌరవం ఏర్పడింది. ”**

ఇప్పుడా అభద్రతా అయోమయాలు మరింత వ్యాప్తి చెందాయి. 'భారత్ పే' అనే మరో సంస్థ అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చే ఫిన్ టెక్ సంస్థ. ఏ మాత్రం హామీలు లేని రుణాలను మంజూరు చేసింది. ఫలితంగా వసూళ్లు లేవు. ఈ ఏడాది మొదట్లో ఈ సంస్థ దివాళా అంచుకు చేరుకుంది. ఆ కంపెనీ డైరెక్టర్ ఈ విషయాన్ని ముందుగా హెచ్చరించిన కారణంగా అతనిని, అతని భార్యను కంపెనీ నిధులు విలాసాలకు వాడుకుంటున్నారనే ఆరోపణలతో కంపెనీ నుండి తొలగించారు.

ఫిన్ టెక్ లు నిర్వహించే సట్టా వ్యాపారాలపై నిబంధనల కారణంగా కూడా అనేక అభద్రతలు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు బెంగుళూరు కేంద్రంగా స్లైస్ అనే ఒక ఫింటెక్ సంస్థ పనిచేసేది. దానికి మంచి గుర్తింపు కూడా ఉండేది. కానీ రిజర్వ్ బ్యాంకు నిబంధనలతో దాని వ్యాపార విస్తృతి కుంచించుకు పోయింది. దానితో నష్టాల సుడిలో ఉన్న ఈ బ్యాంకు మరో నష్టాలనెదుర్కొంటున్న గౌహతి లోని ఊరు పేరు లేని బ్యాంకును విలీనం చేసుకుంది. రెండు విభిన్నమైన సంస్కృతులు కలిగిన వినిమయదారులున్న ఈ రెండు సంస్థలు కలవడం ఫిన్ టెక్ సంస్థ బలబడడానికి సహరించవచ్చు. ఈ మద్యే ఫింటెక్ సంస్థల అధిపతులు సమావేశమయ్యారు. ఆర్థిక అవినీతులు పెరుగు తుండడంతో, యజమానులు విలువలను పెంచుకోడానికి చేసే ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయేమో అని ఆందోళనని వెలుబుచ్చారు.

అసమర్థ యాజమాన్య పద్ధతులు డిజిటల్ స్టార్ట్ అప్ రంగాన్ని కుంగదీస్తున్నాయి. ఈ మద్యే బైజు ఆడిటర్ తన పదవికి రాజీనామా అచేయడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బైజు తన ఆదాయాలను అధికంగా చూపుతూ, ప్రజలకు తన ఆర్థిక లావాదేవీల వివరాలు ప్రకటించడం లేదని నిందించబడుతున్నది. దానికి అప్పులిచ్చిన అంతర్జాతీయసంస్థలు చెల్లింపులు సరిగ్గా జరగడం లేదని, నియమాలు పాటించబడడం లేదని ఆరోపిస్తున్నాయి. అనేక స్టార్ట్ అప్ సంస్థలు, ఎడ్ టెక్, వైద్య సేవలు, (ఫాల్ కేర్, ప్రిస్టయిన్ కేర్) కార్లు మరమ్మత్తు చేసే సంస్థలు, క్లౌడ్ కిచెన్, బిగ్ స్పూన్ వంటివి తమకోసం నిధులు సమకూర్చుకోడానికి తమ అమ్మకపు విలువలను విపరీతంగా పెంచేసుకున్నాయి. అంతర్గత ఆడిట్ నివేదికల ప్రకారం, కిరాణా స్టోర్స్, బికాని, తనకు వస్తువులు సరఫరా చేసే వారి స్టోర్ యజమానులు సంతకాలు బిల్లులలో ఫోర్జరీ చేసి పెట్టింది. “చెల్లింపులు చేసి ట్వీట్” లు పెట్టించడం, డబ్బులు చెల్లించి “ప్రఖ్యాతి చెందిన వారి సిఫారసులు రాయించుకోడం” ఇప్పుడు కొత్తగా మొదలైన కుంభకోణం.

డిజిటల్ స్టార్ట్ అప్‌ల దుష్కృతాలు, దురాచారాలు ఆశ్చర్యాన్ని కలిగించవు. అమెరికాలో వడ్డీ రేట్లు పెరగడం, కోవిడ్ – 19 తరువాత వినిమయ దారులు వృద్ధి చెందక పోవడం , పెట్టుబడిదారులు, ప్రమోటర్లు భారతదేశ డిజిటల్ సేవల మార్కెట్ కుంచించుకు పోయిన వాస్తవాన్ని గమనించేలా చేస్తున్నాయి.

### మోసాలు, ఒక వ్యాపార విధానం

భారతదేశ వ్యాపార సంస్థలు తమ సామర్థ్యాలను, సాంప్రదాయ యాజమాన్య పద్ధతులను కాపాడుకుంటాయన్నది నానుడి. ఉదాహరణకి కావాజి దవర్ 1854లో టెక్స్‌టైల్ మిల్లు స్థాపించింది. 1980–90లలో సాంకేతిక పరిజ్ఞాన స్టార్ట్ అప్ ప్రారంభించింది. అయితే, 1990 లనుండి మరో దశ ప్రారంభమయింది. దీర్ఘ కాల ప్రయోజనాలు తాకట్టుపెట్టి ప్రతి ప్రభుత్వం తన బాధ్యతను మర్చిపోయి ప్రవర్తిస్తుంది. మానవ వనరుల అభివృద్ధి, లింగ సమానత్వం, క్రియాశీలంగా పనిచేసే నగరాలూ అనలైన వృద్ధికి బాటలువేస్తాయి. కానీ ఇప్పుడు దానికి భిన్నంగా అభివృద్ధికి, ఆర్థిక సంస్థలు, సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే బాటలు వేస్తాయనే ఆలోచన సాగుతున్నది . స్థూల అసమానతలు, నిలకడ లేని అభివృద్ధి, అసమర్థ నియంత్రణా సంస్థలు వాతావరణాన్ని నిరాశాజనకంగా నిలుపుతున్నాయి. చాలా వ్యాపార సంస్థలు, బాధ్యతగల యాజమాన్య పద్ధతులు అవలంభించడానికి బదులుగా అతితక్కువ కాలంలో ధనికులెలా అవ్వాలా అని ఆలోచిస్తున్నాయి. కార్పొరేట్ దుర్మార్గాలు ఎక్కడికక్కడ వ్యాపిస్తున్నాయి. వాటాల మార్కెట్లో నియమనిబంధలనలు ఉల్లంఘించ బడుతున్నాయి. లెక్కలు తారుమారు చేయబడుతున్నాయి. ప్రభుత్వ బ్యాంకులను దోచేస్తున్నారు. ఇంటా బయటా, పన్ను స్వర్గ ధామాలలో బినామీ కంపెనీలు ప్రారంభిస్తున్నారు. నిజమైన గుర్తింపులకు ముసుగులు వేసి డబ్బును అక్రమ మార్గాలద్వారా మళ్లించుకుంటున్నారు. వ్యాపార నైతికత దెబ్బతినింది.

సాధారణంగా కుంభకోణాలు ఆర్థిక లావాదేవీలకు సంబంధించినవే. డబ్బు అక్కడే ఉంటుంది కాబట్టి. నేరపూరిత సంస్కృతి ఆర్థిక రంగంలోని వివిధ కోణాలకు కూడా పాకింది. చివరికి డిజిటల్ వ్యవస్థకి కూడా. జుడ్గే ఇంగోరం మాటల్లో చెప్పాలంటే దీని వలన “నైతికతకు, నిజాయితీకి , న్యాయానికి అగౌరవం ఏర్పడింది. ఫార్మా కంపెనీలు తమ నియంత్రిత అధికారులతో కుమ్మక్కయి ప్రమాణాలు లేని మందులు ఉత్పత్తి చేస్తున్నాయి. ఒక్కొక్క సారి అవి ప్రజల ప్రాణాలు హరిస్తు న్నాయి. భూమిని, నీళ్ళని కలుషితం చేస్త న్నాయి. వైద్యరంగంలోనూ, న్యాయ వ్యవస్థ లోనూ నైతిక విలువలు అడుగంటి పోయాయి. నకిలీ ఉద్యోగాలు ఇచ్చే మధ్యవర్తులు, నిరుద్యోగులను మభ్య పెట్టి, వారు బంగారు భవిష్యత్తు పొందడానికి కష్టపడి చెమటోడ్చి దాచుకున్న పొదుపుసొమ్మును కాజేస్తున్నారు. భారతదేశ ఇళ్లలోకి కూడా మాఫియాలు జొరబడి, ఇళ్లలో ఉన్న ముసలి ముతక వారిని నమ్మించి మోసాలు చేస్తున్నారు.

(అనువాదం: కె. ఉషారాణి)

# డాలరుపై తిరుగుబాటు


రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకుడు

**ఎస్. వెంకట్రావు**

అమెరికా డాలరుపై ప్రపంచ వ్యాపితంగా తిరుగుబాటు ప్రారంభమైంది. గత రెండు సంవత్సరాలుగా నెమ్మదిగా సాగుతున్న ఈ తిరుగుబాటు 2024లో ఉధృతమవుతుందని పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రపంచ వాణిజ్యం, సంపద నిల్వల్లో డాలరు ఆధిపత్యాన్ని నిలువరించి ప్రత్యామ్నాయ కరెన్సీని ప్రోత్సహించడానికి గతంలో జరిగిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదనీ, ఈ సారి కూడా అదే జరుగుతుందని అమెరికా అధికారులు అంటున్నప్పటికీ ఈసారి ఫలితాలు మరోలా ఉంటాయని అమెరికాకు చెందిన పలువురు ఆర్థిక వేత్తలే చెబుతున్నారు. దీనికి కారణం గతంలో లాగా కాకుండా ఈసారి డాలరు ఆధిపత్యానికి బయటి కారణాల తోబాటు అమెరికా ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు కూడా ఒక కారణమని వారు అంటున్నారు.

1. డాలరును అమెరికా ఆయుధంగా వాడుకుని ప్రత్యర్థి దేశాలమీద ఆంక్షలకు తెగబడడం, 2. చైనా వంటి ఇతర దేశాల కరెన్సీలు బలపడుతుండడం, 3. అమెరికా రుణభారం భయంకరమైన రీతిలో పెరిగిపోవడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు.... ఈ మూడు కారణాల వల్ల రానున్న కాలంలో డాలరు ఆధిపత్యానికి పెద్దగా గండిపడే అవకాశాలున్నాయని పరిశీలకులు చెబుతున్నారు.

దీనికి మొదటి సూచిక ఈ ఏడాది జనవరిలో 'బ్రిక్స్' దేశాల కూటమి విస్తరణ రూపంలో కనిపించింది. అయిదు దేశాలు –బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన 'బ్రిక్స్' కూటమి గతం నుండీ డాలరుకు ప్రత్యామ్నాయ కరెన్సీ రూపకల్పన చేయాలన్న యోచనలో ఉంది. కూటమి సభ్య దేశమైన రష్యాపై ఉక్రెయిన్ యుద్ధం సాకుగా చూపించి అమెరికా తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధించడంతో రష్యా ఇతర దేశాలతో వ్యాపారాన్ని డాలరులో కాకుండా స్థానిక కరెన్సీల్లోకి మార్చుకుంది. 2024 జనవరి ఒకటో తేదీన మరో అయిదు దేశాలు – సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), ఈజిప్టు, ఇరాన్, ఇథియోపియాలు బ్రిక్స్‌లో చేరాయి. అర్జెంటీనా కూడా కూటమిలో చేరడానికి సిద్ధపడింది గానీ అక్కడ ఎన్నికల్లో పచ్చి మితవాది, అమెరికా తొత్తు అయిన జావియెర్ మిలీ అధ్యక్షునిగా ఎన్నిక కావడంతో బ్రిక్స్‌లో చేరడం లేదని ప్రకటించారు. అయితే వెనువెంటనే కూటమిలో చేరడానికి నైజీరియా సిద్ధపడింది.




2024లో మరో 25 దేశాలు కూడా 'బ్రిక్స్' కూటమిలో చేరడానికి సిద్ధమవుతున్నాయి. వాటిలో పది దేశాలు – అల్జీరియా, బహ్రెయిన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, బొలీవియా, క్యూబా, కజకస్తాన్, కువైట్, పాలస్తీనా, సెనెగల్ బ్రిక్స్‌లో చేరడానికి దరఖాస్తు చేశాయి. మరో పదిహేను దేశాలు – మెక్సికో, టర్కీ, ఉరుగ్వే, ట్యునీషియా, ఆఫ్ఘనిస్తాన్, అంగోలా, కామెరూన్, డిఆర్ కాంగో, గాబన్, గినియా బిస్సావు, నికరాగువా, సూడాన్, సిరియా, ఉగాండా, జింబాబ్వేలు కూటమిలో చేరడానికి ఆసక్తిని వెల్లడించాయి.

వచ్చే అక్టోబర్‌లో రష్యాలోని కజాన్ నగరంలో జరిగే 16వ బ్రిక్స్ సమావేశంలో కొత్త దేశాలను చేర్చుకోవడం జరుగుతుందని రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ ఇటీవల పత్రికల వారికి చెప్పారు.

బ్రిక్స్ సభ్య దేశాలైన భారత్, చైనా, రష్యా, యుఎఇ, సౌదీ అరేబియాలు ఇప్పటికే తమ మధ్య అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాలను స్థానిక కరెన్సీల్లో నిర్వహించడం ప్రారంభిం చాయి. రష్యా, చైనాలు బ్రిక్స్ సభ్య దేశాలనే కాకుండా ఇతర దేశాలను కూడా డాలరుతో బంధాలు తెగతెం పులు చేసుకునే విధంగా ఒప్పించడానికి ప్రయత్నిస్తున్నాయి. చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో భాగంగా 150కి పైగా దేశాల్లో జరిపే లావాదేవీలను డాలర్లలో కాకుండా చైనా కరెన్సీ అయిన యువాన్ల (రెన్‌మిన్‌బీ)లో నిర్వహిస్తోంది. 2023లో అర్జెంటీనా, బ్రెజిల్ తరువాత మూడో లాటిన్ అమెరికా దేశమైన బొలీవియా అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాలను యువాన్లలో నిర్వహించడం ప్రారంభించింది.

ఇటీవలి కాలంలో డాలరు నుండి విడగొట్టుకోడానికి వివిధ దేశాలు ముఖ్యంగా బ్రిక్స్ కూటమిలోని దేశాలు చేసిన ఈ క్రింది

ప్రయత్నాలు చూస్తే డాలరు భవిష్యత్తు ఎలా ఉండబోతుందో మనకు అర్థమవుతుంది.

– బ్రిక్స్ కూటమిలోని దేశాలు 2,800 కోట్ల డాలర్ల విలువచేసే అధికార బాండ్లను డాలర్‌లో కాకుండా స్థానిక కరెన్సీల్లో జారీ చేస్తామని ప్రకటించాయి.

– ఆఫ్రికాలోని జాంబియా నుండి చైనాకు ఎగుమతయ్యే 200 కోట్ల డాలర్ల విలువ చేసే రాగికి అమెరికన్ డాలర్లలో కాకుండా చైనా యువాన్లలో చెల్లింపులు జరిపే విషయమై చర్చలు జరుగుతున్నాయి. జాంబియా ఆఫ్రికా ఖండంలో రెండవ అతి పెద్ద రాగి ఎగుమతిదారు కాగా చైనా ప్రపంచంలోనే అతి పెద్ద రాగి దిగుమతి దారు.

– చైనా కేంద్ర బ్యాంకుతోపాటు మరికొన్ని దేశాలు డాలర్‌ను వదించుకోడానికిగాను గత కొంత కాలంగా కరెన్సీ మార్కెట్‌లో డాలర్ అమ్మకాలు సాగిస్తున్నాయి.

– సింగపూర్, చైనాల్లో పర్యాటకులు అమెరికన్ డాలర్లలో కాకుండా యువాన్లలో చెల్లింపులు ప్రారంభించారు.

– చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు ద్వారా రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు వంటి ప్రాథమిక సదుపాయాల నిర్మాణానికి రుణాలు పొందుతున్న 155 దేశాలు రుణచెల్లింపులను డాలర్లలో కాకుండా యువాన్లలో చేసేట్లు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అయితే ప్రపంచ ద్రవ్య మార్కెట్‌లో డాలరుకు ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల ఇప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలో దాని పెత్తనమే కొనసాగుతోంది. ప్రపంచ వ్యాపితంగా విదేశీ మారకంలో 90 శాతం ఇప్పటికీ డాలర్లలోనే జరుగుతోంది. ప్రపంచ వాణిజ్యంలో 50 శాతం డాలర్లలోనే జరుగుతోంది. అయితే ప్రపంచ దేశాల విదేశీ మారక నిల్వల్లో మాత్రం డాలరు వాటా 2012లో 61.5 శాతం నుండి 2022 నాటికి పదేళ్ల కాలంలో 58.4 శాతానికి పడిపోయింది. అలాగే ఈ కాలంలో యూరో వాటా కూడా 24.1 శాతం నుండి 20.5 శాతానికి పడిపోయింది. జపాన్‌కు చెందిన యెన్, బ్రిటిష్ పౌండ్‌లు కూడా దిగజారి అయిదు, ఆరు శాతాలకు పడిపోయాయి. చైనా యువాన్ మాత్రం 3 శాతం దగ్గర స్థిరంగా కొనసాగుతోంది. అయితే రానున్న పదేళ్ల కాలంలో రిజర్వు కరెన్సీలో డాలరు వాటా క్రమంగా 50 శాతానికి తగ్గిపోతుందనీ, చైనా

> **“ రానున్న కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రాబల్యం తగ్గడం, చైనా ఆర్థికంగా పుంజుకోవడంతోబాటు అమెరికా సృష్టించిన బ్రిట్టన్ వుడ్స్ సంస్థలైన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఏర్పడిన బ్రిక్స్ దేశాల కూటమి విస్తరిస్తున్న కొద్దీ డాలరు ప్రభావం క్షీణిస్తుంది. ”**




**పది దేశాలకు విస్తరించిన బ్రిక్స్ కూటమి సమావేశం: ఈ కూటమిలో చేరడానికి మరో 25 దేశాలు సుముఖంగా ఉన్నాయి.**

యువాన్ వాటా 6 శాతానికి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

రానున్న కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రాబల్యం తగ్గడం, చైనా ఆర్థికంగా పుంజుకోవడంతోబాటు అమెరికా సృష్టించిన బ్రిట్టన్ వుడ్స్ సంస్థలైన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఏర్పడిన బ్రిక్స్ దేశాల కూటమి విస్తరిస్తున్న కొద్దీ డాలరు ప్రభావం క్షీణిస్తుంది. బ్రిక్స్ దేశాల కూటమి శీఘ్రంగా విస్తరించడంతోబాటు తమ మధ్య స్థానిక కరెన్సీలో వాణిజ్యం నిర్వహించడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నాయి. అంతేకాదు, ఇటీవల బ్రిక్స్‌లో చేరిన ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి మహది సఫారి పత్రికల వారితో మాట్లాడుతూ డాలరుకు ప్రత్యామ్నాయంగా సంయుక్త బ్రిక్స్ కరెన్సీ ఏర్పాటు చేయడం పట్ల తమ దేశం ఆసక్తితో ఉందని పేర్కొన్నారు. “బ్రిక్స్ గ్రూప్‌లో ఉమ్మడి కరెన్సీని ఏర్పాటు చేయడం పట్ల మేము ఆసక్తిగా ఉన్నాం. అలాంటి కరెన్సీ చాలా సమర్థంగా పనిచేస్తుంది'' అని ఆయన అన్నారు. “అంతర్జాతీయ వాణిజ్యంలో స్థానిక కరెన్సీలు ఉపయోగించడం ద్వారా డాలరును అడ్డుతొలగించుకునే క్రమం ఇప్పటికే ప్రారంభమైంది” అని సఫారి పేర్కొన్నారు. ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా దాదాపు ఇటువంటి ప్రకటనే చేశారు. ఈ రెండు దేశాలు అమెరికా ఆంక్షల వల్ల ఆర్థికంగా బాగా నష్టపోయాయి గనుక బ్రిక్స్‌లో ఈ దేశాలు ఉమ్మడి కరెన్సీ ఆలోచనను చురుకుగా ముందుకు తెస్తున్నాయి.

డాలరుపై ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న అమెరికా ప్రపంచ రాజకీయ యవనికపై తన మాట వినని దేశాలపై డాలరును ఆయుధంగా ఉపయోగించుకుని యుద్ధం చేస్తున్నది. వివిధ దేశాల బ్యాంకుల మధ్య ద్రవ్య మార్పిడిని నిర్వహించే 'స్విఫ్ట్' (ఎస్‌డబ్ల్యుఐఎఫ్‌టి) వ్యవస్థ నుండి అమెరికా తన మాట వినని దేశాలను బహిష్కరించడం ద్వారా వాటిని ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం ఇటీవల పెరిగింది. ప్రస్తుతం 40కి పైగా దేశాలపై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిందనే పేరుతో రష్యా ఆస్తులను అమెరికా దాని యూరోపియన్ మిత్రులు పూర్తిగా స్తంభించిన విషయం విదితమే. ఆర్థికంగా దెబ్బతీయడం ద్వారా రష్యాను యుద్ధంలో ఓడించాలనే యోచనతో అమెరికా, మిత్ర దేశాలు ఈ చర్యకు పాల్పడ్డాయి. అంతర్జాతీయ చమురు వ్యాపారం ప్రధానంగా డాలర్లలోనే జరగాలని సౌదీ అరేబియా, అమెరికాల మధ్య ఉన్న ఒప్పందం దృష్ట్యా చమురు వ్యాపారంలో డాలరు ప్రాబల్యం మరింత ఎక్కువగా ఉంది.

అమెరికా కూటమి ఆంక్షలనుండి తప్పించుకోడానికి రష్యా, ఇరాన్ వంటి దేశాలు

> **"అమెరికా తంత్రాలేవీ ప్రపంచం డాలరుకు దూరంగా జరగకుండా ఆపలేకపోతున్నాయి. ముఖ్యంగా బ్రిక్స్ దేశాల కూటమి బలపడ్డంతో డాలను నుండి విడగొట్టుకోవాలన్న ఆలోచన సమిష్టి ఆలోచనగా మారింది. ఆ దేశాలు ఈ దిశలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకు వెళుతున్నాయి."**

స్థానిక కరెన్సీల్లో వ్యాపారం ప్రారంభించాయి. ప్రధానంగా రష్యా నుండి చైనా చమురు దిగుమతులకు యువాన్లలోనే చెల్లింపులు చేస్తున్నది. చైనా నుండి వస్తువుల దిగుమతులకు రష్యా తిరిగి ఆ యువాన్లను వినియోగిస్తున్నది. భారత్‌తో సహా రష్యా నుండి చమురు దిగుమతి చేసుకునే ఇతర అనేక దేశాలు డాలర్లలో కాక స్థానిక కరెన్సీల్లో చెల్లింపులు చేస్తున్నాయి.

చైనా ప్రపంచ ఎగుమతుల కేంద్రంగా ఉండడం, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు ద్వారా అనేక దేశాల్లో పెట్టుబడులు పెడుతుండడం వల్ల అంర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో సమీప భవిష్యత్తులో డాలరుకు చైనా నుండి సవాలు ఎదురుకానున్నదని నిపుణులు భావిస్తున్నారు.

నిజానికి డాలరు రిజర్వు కరెన్సీగా ఉపయోగంలో ఉండడం వల్ల అమెరికా ఆర్థికంగా పెద్ద ఎత్తున లాభం పొందుతోంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ జిడిపిలో అమెరికా వాటా 45 శాతం నుండి నేడు 25 శాతానికి పడిపోయింది. అలాగే ప్రపంచ వాణిజ్యంలో కూడా దాని వాటా క్రమంగా తగ్గిపోతూ వస్తున్నది. కానీ ప్రపంచ ద్రవ్య వ్యవస్థలో డాలరు ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ అది లాభపడుతోంది. ఏదైనా దేశం డాలరు ఆధిపత్యాన్ని అంగీకరించకపోతే సామ దాన బేధ దండోపాయాలతో వాటిని లొంగదీసు కోవడం అమెరికా విదేశాంగ నీతిలో ప్రధానాంశంగా ఉంది. ఇరాక్, సిరియాలపై కుంటి సాకులతో అమెరికా దాడి చేసిందన్నా, ఇరాన్, రష్యా, చైనా వంటి దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించిందన్నా దానికి ప్రధాన కారణాల్లో ఒకటి ఆయా దేశాలు డాలరు ఆధిపత్యాన్ని వ్యతిరేకించడమే.

కానీ అమెరికా తంత్రాలేవీ, ప్రపంచం డాలరుకు దూరంగా జరగకుండా ఆపలేకపోతున్నాయి. ముఖ్యంగా బ్రిక్స్ దేశాల కూటమి బలపడ్డంతో డాలను నుండి విడగొట్టుకోవాలన్న ఆలోచన సమిష్టి ఆలోచనగా మారింది. ఆ దేశాలు ఈ దిశలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకు వెళుతున్నాయి. రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ ఇటీవల బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ సమావేశంలో మాట్లాడుతూ..బ్రిక్స్ దేశాలు కొత్త ప్రపంచ రిజర్వు కరెన్సీ అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. బ్రిక్స్ దేశాల జాతీయ కరెన్సీలతో ఏర్పడే ఈ కొత్త రిజర్వు కరెన్సీ అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) కు చెందిన స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్)కు ప్రత్యామ్నా యంగా పనిచేయాల న్నది బ్రిక్స్ దేశాల ఆలోచన.

బ్రిక్స్ దేశాల కొత్త కరెన్సీపై పని త్వరగా జరుగుతోందనీ, 'దాదాపు పూర్తయిందని' పుతిన్ మాజీ సలహాదారు, ఆర్థిక వేత్త సెర్గీ గ్లజ్యేవ్ చెప్పారు. అయిదు బ్రిక్స్ వ్యవస్థాపక సభ్య దేశాల్లోని మూడు దేశాలు –బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా కొత్త కరెన్సీ ప్రారంభానికి అంగీకరించాయని ఇంకా చైనా, భారత్‌లు మాత్రమే ఆమోదం తెలపాల్సి ఉందని ఆయన చెప్పారు. ఇతర దేశాలు కూడా అంగీకరించి, ఏకాభిప్రాయానికి వచ్చినప్పుడు మాత్రమే కొత్త కరెన్సీని ప్రారంభించాల్సి ఉంటుందని తెలిపారు.

**అమెరికా ఆర్థిక అస్థిరత**

వివిధ దేశాలపై అమెరికా విధిస్తున్న ఆంక్షలు, డాలరులో దాచుకున్న సొమ్మును స్తంభింపజేయడం వంటి చర్యల వల్ల ప్రపంచంలోని అనేక దేశాలు, సంస్థలు, వ్యక్తులు డాలరు నుండి దూరంగా జరగడానికి సుముఖత చూపుతున్నారు. అదే కాకుండా అమెరికా ఆర్థిక వ్యవస్థలో కనిపిస్తున్న అస్థిర పరిస్థితులు కూడా వారిని డాలరు నుండి దూరంగా జరిగేట్లు చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, బిట్‌కాయిన్ ధరలు విపరీతంగా పెరిగిపోతుండడం, స్టాక్ మార్కెట్ తీవ్రమైన ఒడిదుడుకులకు లోనుకావడం అనేవి అమెరికా ఆర్థిక వ్యవస్థ పట్లా, అంతర్జాతీయ కరెన్సీగా డాలరు స్థిరత్వం పట్ల ఏర్పడిన సందేహాలకు ప్రతిబింబాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర రికార్డు స్థాయికి పెరిగింది. పెట్టుబడిదారులు తమ పెట్టుబడులకు సురక్షితమైన స్థావరాలను వెతుక్కుంటుండం వల్ల బంగారం ధరలిలా పెరుగుతున్నాయని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక పేర్కొంది. 2022 నుండి బంగారం ధరలు క్రమంగా పెరగడం ప్రారంభమైంది. అప్పుడు ఔన్స్ 1600 డాలర్లు ఉన్న బంగారం ధర ఈ ఏడాది ఫిబ్రవరికి రికార్డు స్థాయిలో 2,142 డాలర్లకు పెరిగింది. 2022లో ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపించి రష్యాపై అమెరికా ఆంక్షలు పెట్టడానికి డాలరును ఆయుధంగా వాడుకోవడం మొదలైనప్పటి నుండి డాలరుపై విశ్వాసం సడలుతూ వస్తోంది. దాంతో పెట్టుబడిదారులు డాలర్లకు బదులు బంగారం కొనడం ప్రారంభించడంతో బంగారం ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. రష్యా డాలరు నిల్వలను స్థంభింప జేయాలని అమెరికా, యూరోపియన్ సెంట్రల్ బ్యాంకులు నిర్ణయించడంతో ద్రవ్య మార్కెట్లలో భయాందోళనలు ప్రారంభమయ్యాయి. అనేక మంది పెట్టుబడిదారులు డాలరులో నిల్వ చేసుకోవడం ఇంకెంత మాత్రం 'భద్రం' కాదని భావించడం ప్రారంభించారు. గత జనవరిలో వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు 39 టన్నుల బంగారాన్ని అదనంగా కొనుగోలు చేశాయని ప్రపంచ గోల్డ్ కౌన్సిల్ తెలిపింది. అంతకు ముందు డిసెంబర్ నెలతో పోలిస్తే ఈ కొనుగోలు రెట్టింపు అయింది.

అమెరికా ఆర్థిక వ్యవస్థలో అస్థిరత వల్ల పెట్టుబడిదారులు డాలరుకు ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారని, బంగారం ధరలు భారీగా పెరగడానికి అదో కారణమని హెచ్‌ఎస్‌బిసిలో బంగారం నిపుణుడు జేమ్స్ స్టీల్ పేర్కొన్నారు. బిట్‌కాయిన్ ధరలు కూడా దీనివల్లనే పెరుగుతున్నాయని ఆయన చెప్పాడు. జనవరిలో బిట్‌కాయిన్ ధర రికార్డు స్థాయిలో 69,990 డాలర్లకు పెరిగింది. క్రిప్టో కరెన్సీలు వాస్తవ ద్రవ్య వ్యవస్థతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉంటాయి గనుక సంక్షోభ సమయంలో అది 'భద్రమైన' కరెన్సీ అని భావిస్తున్నారు. అయితే ఇలా అనుకోవడం అనేది వాస్తవ ప్రపంచం నుండి, వాస్తవ ఆర్థిక వ్యవస్థనుండి వేరుగా భ్రమాన్వితమైన స్పెక్యులేషన్ మీద ఆధారపడ్డమే. బిట్‌కాయిన్‌కి వాస్తవంగా ఎటువంటి విలువ ఉండదు.

అంతర్జాలంలో కొత్త బిట్‌కాయిన్‌లను 'తవ్వడానికి' విపరీతమైన విద్యుత్తును వాడ్డం మినహా వీటి వల్ల వాస్తవ ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి ప్రయోజనం లేదు. ఇటీవల కాలంలో బిట్‌కాయిన్ ధరలు పెరగడంతో మొత్తంగా క్రిప్టోకరెన్సీల విలువ 2 లక్షల కోట్ల డాలర్లకు పెరిగిపోయింది.

బిట్‌కాయిన్ ధరలు పెరగడం, కృత్రిమ మేధవల్ల లాభాల పంట పండుతాయన్న భ్రమలపై ఆధారపడి స్టాక్ మార్కెట్‌లు పెరగడం.. ఇదంతా కూడా స్పెక్యులేటివ్ బుడగ పెరిగిపోతుండగా వాస్తవ ఆర్థిక వ్యవస్థ నేల చూపులు చూస్తున్న విషయాన్ని చెబుతోంది. జర్మనీ, బ్రిటన్, జపాన్ లతో సహా యూరోజోన్‌లోని అనేక దేశాలు మాంద్యంలోకి జారుకున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ 2.5 శాతం వృద్ధి సాధిస్తుందని అంచనా వేస్తున్నప్పటికీ అక్కడ హైటెక్ రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కోత విధిస్తున్నారు. ఆటో పరిశ్రమ పెద్ద ఎత్తున పోటీని ఎదుర్కొంటోంది. మొత్తం మీద అమెరికా ఆర్థిక వ్యవస్థలో కూడా మందగమనం సాగుతోందని చెబుతున్నారు.

దీంతోబాటు విపరీతంగా పెరుగుతున్న అమెరికా అప్పు కూడా డాలరు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నది. డాలరు ఆధిపత్యానికి ఏర్పడుతున్న సవాలు గురించి అమెరికా అధికారులు బహిరంగంగా మాట్లాడకపోయినప్పటికీ ప్రయివేటుగా వారు పెరుగుతున్న అమెరికా రుణాలు ప్రపంచ ద్రవ్య వ్యవస్థలో డాలరు ప్రాబల్యానికి ముప్పుతెస్తాయని భయసందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వు గవర్నర్ల బోర్డు సభ్యుడు క్రిస్టోఫర్ వాల్లర్ ఇటీవల సెంట్రల్ బ్యాంకింగ్‌పై జరిగిన ఒక సదస్సులో మాట్లాడుతూ...నాలుగు అంశాలు డాలరు ఆధిపత్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని చెప్పాడు. అవి: దేశాలు అంతర్జాతీయ మారకాన్ని ఇతర కరెన్సీల్లో నిర్వహించడం, ఆర్థికంగా చైనా అభివృద్ధి చెందడం, దాని ద్రవ్యం అయిన యువాన్ (రిన్‌మిన్‌బి) అంతర్జాతీయ పాత్ర పెరగడం, రష్యాలో విధించి నట్లు అమెరికా ఆంక్షలు విధిస్తుందేమోనన్న భయంతో డాలరు నిల్వలనుండి వైదొలగడం, ప్రపంచ రాజకీయాలు రానురాను కూటములుగా విడిపోడం. ఇదంతా ఉన్నప్పటికీ సంక్షోభం వచ్చినప్పుడు పెట్టుబడిదారులు అమెరికా డాలర్లలోనే 'భద్రతను' వెదుక్కుంటున్నారని, 2007, 2020 సంక్షోభాలప్పుడు పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున అమెరికా ట్రెజరీ బాండ్లు కొన్న విషయం దాన్నే తెలియజేస్తోందని ఆయన సమర్థించుకున్నారు.

> **“ 2016 నుండి 2023 మధ్య విదేశీ మారక నిల్వల్లో అమెరికా డాలరు 6 శాతం పడిపోయింది. ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఆయా దేశాలు తమ రిజర్వులను చైనా యువాన్లలోకే కాకుండా ఇతర అనేక కరెన్సీల్లోకి మార్చుకున్నాయని ఎఫ్‌ఎక్స్‌సి ఇంటిలిజెన్స్‌కు చెందిన ల్యూసీ ఇంఫూమ్ చెప్పారు. ”**

అయితే వాల్లర్ సమర్థన సరికాదని ఫైనాన్షియల్ టైమ్స్ సీనియర్ జర్నలిస్టు జాన్ ప్లెండెర్ పేర్కొన్నారు. ఈ రోజున డాలరు ఆధిపత్యానికి వాలెర్ చెప్పిన పై నాలుగు కారణాలు కాకుండా అమెరికా అప్పుల నుండే పెద్ద ప్రమాదం వస్తోందని ఆయన విశ్లేషించాడు. అమెరికా అప్పు రానున్న పదేళ్ల కాలంలో 1.6 లక్షల కోట్ల డాలర్ల నుండి 2.6 లక్షల కోట్ల డాలర్లకు పెరిగిపోతుందని అధికారిక నివేదిక తెలిపింది. గత 50 ఏళ్ల కాలంలో జిడిపిలో వడ్డీ చెల్లింపు 3.7 శాతం ఉండేది. అటువంటిది అది 2024లో అది 5.6 శాతం ఉంది పదేళ్లలో అంటే 2024 నాటికి 6.1 శాతానికి పెరిగిపోతుందని నివేదిక తెలిపింది. అమెరికా అప్పు ఈ విధంగా పెరిగిపోవంతో రుణ రేటింగ్ సంస్థ ఫిట్చ్ ఇటీవల అమెరికా రేటింగ్‌ను ట్రిపుల్ ఎ నుండి తగ్గించి వేసింది.

### నిర్డాలరీకరణ

మొత్తం మీద చూసినప్పుడు ప్రపంచంలో నేడు 'నిర్డాలరీకరణ' (డి-డాలరైజేషన్) జరుగుతున్నదని అంతర్జాతీయ వాణిజ్యంలో చెల్లింపుల మార్కెట్ డేటాను సేకరించే 'ఎఫ్‌ఎక్స్‌సి' ఇంటిలిజెన్స్ సంస్థ పేర్కొన్నది. అయితే ఈ క్రమం ప్రస్తుతం నెమ్మదిగా జరుగుతున్నదనీ, డాలరుకు ప్రత్యామ్నాయంగా చైనా యువాన్ ముందుకు వచ్చే క్రమం కూడా చాలా నెమ్మదిగా జరుగుతున్నదని అది తెలిపింది. కాకపోతే డాలరుకు ప్రత్యామ్నా యంగా వివిధ దేశాలు యువాన్లలోకే కాకుండా స్థానిక కరెన్సీల్లోకి మారుతున్నాయని అది తెలిపింది.

'నిర్డాలరీకరణ' క్రమానికి బ్రిక్స్ దేశాల కూటమి నాయకత్వం వహిస్తున్నప్పటికీ వివిధ కారణాల వల్ల ప్రపంచంలోని చాలా దేశాలు అమెరికా డాలరు నుండి దూరం జరగడానికి ప్రయత్నిస్తున్నాయి. చైనాతో అమెరికా వాణిజ్యం యుద్ధం, ఉక్రెయిన్ యుద్ధం సాకుతో రష్యాపై అమెరికా ఆంక్షల వల్ల ఆ రెండు దేశాలు డాలరు ఆధిపత్యాన్ని గట్టిగా సవాలు చేస్తున్నాయి. ఇరాన్‌తో సహా ఆంక్షలు ఎదుర్కొంటున్న అనేక దేశాలు డాలరును వదిలించుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇవన్నీ బ్రిక్స్‌లో ఉన్నాయి గనుక సహజంగానే 'నిర్డాలరీకరణ' ఉద్యమానికి ఈ కూటమి నాయకత్వం వహిస్తోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో అస్థిరత, డాలరు భవిష్యత్తుపై అనుమానాలతో ఇతర అనేక దేశాలు కూడా డాలరు పట్టును వదిలించుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. గత జనవరిలో బ్రిక్స్‌లో చేరిన సౌదీ అరేబియా కూడా చైనా, రష్యాలతో స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం చేయడానికి ఒప్పందం చేసుకోవడం చెప్పుకోదగ్గ విషయం. ఎందుకంటే సౌదీతో జరిగిన ఒప్పందం వల్లనే అంతర్జాతీయంగా చమురు అమ్మకాలు, కొనుగోలుకు డాలరు ప్రమాణంగా మారింది.

2016 నుండి 2023 మధ్య విదేశీ మారక నిల్వల్లో అమెరికా డాలరు 6 శాతం పడిపోయింది. ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఆయా దేశాలు తమ రిజర్వులను చైనా యువాన్లలోకే కాకుండా ఇతర అనేక కరెన్సీల్లోకి మార్చుకున్నాయని ఎఫ్‌ఎక్స్‌సి ఇంటిలిజెన్స్‌కు చెందిన ల్యూసీ ఇంఫూమ్ చెప్పారు. “డి-డాలరైజేషన్ జరుగుతున్నది, అయితే అది ఒక్కసారిగా చైనా యువాన్లలోకి మారిపోవడం ద్వారా గానీ, లేక చాలా వేగంగా మారిపోవడం ద్వారా గానీ జరగడం లేదు” అని ఇంఫూమ్ పేర్కొన్నారు.

అయితే మారుతున్న అంతర్జాతీయ రాజకీయాలు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో వచ్చే మార్పులు రానున్న కాలంలో డి-డాలరైజేషన్ వేగాన్ని గణనీయంగా పెంచవచ్చునని నిపుణులు భావిస్తున్నారు. అధికారికంగా కాకపోయినా ప్రయివేటుగా అమెరికా అధికార వర్గం కూడా దీన్ని అంగీకరిస్తోంది. ❃

జాతీయ పరిణామాలు

# ఎన్నికల ముందు ప్రతిపక్షాలపై దాడులు

ఎ కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

బిజెపిని సవాలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులను, రాజకీయ పార్టీలను దెబ్బతీయటానికి ఇప్పటి వరకు ప్రయోగిస్తున్న వాటిలో ఒకటైన ఇడి, ఐటి డిపార్ట్‌మెంట్లను పార్లమెంటు ఎన్నికల ముంగిట మోడి ప్రభుత్వం మరింత చురుకుగా వినియోగి స్తున్నది. రాజకీయ పార్టీలను ఆర్థికంగా దెబ్బతీయటం కోసం వాటిని పన్ను వివాదాలలోకి లాగటం, బ్యాంకు ఖాతాలను స్థంబింపచేయటం తదితర పద్ధతులను వినియోగిస్తున్నది. ఇందులో భాగంగానే పన్ను డిమాండ్ వివాదాన్ని ఆసరా చేసుకొని కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాను స్తంభింపజేసింది. 2017-18 నుండి 2020-21 సంవత్సరాలకు సంబంధించి జరిమానా, దానిపై వడ్డీ మొత్తం 1,823 కోట్ల రూపాయలు చెల్లించాలని కాంగ్రెస్ పార్టీకి నోటీసు పంపింది. సిపిఐ(ఎం)కు ఉన్న అనేక బ్యాంకు ఖాతాలలో కేవలం ఒకే ఒక్క ఖాతాను లిస్టులో చూపలేదనే సాంకేతిక కారణంతో 15.59 కోట్ల రూపాయలను పెనాల్టీగా చెల్లించాలని నోటీసు పంపింది! 11 కోట్ల రూపాయలు పెనాల్టి చెల్లించాలని సిపిఐకి నోటీసులు జారీ చేసింది. వందలాది మంది ఇచ్చిన కోట్లాది రూపాయల విరాళాలను బిజెపి తన ఎకౌంట్లలో చూపలేదని కాంగ్రెస్ పార్టీ ఆరో పించినా ఆ పార్టీ నోరు మెదపలేదు. ఐటి డిపార్ట్‌మెంటు బిజెపికి ఎటువంటి పెనాల్టీ విధించలేదు.

రాజకీయ పార్టీల ఖాతాలలో ఏవైనా లోపాలుంటే వాటిని ఆయా పార్టీల దృష్టికి తీసుకెళ్ళటం, వారికి సరిచేసుకొనే అవకాశం ఇవ్వటం, అప్పటికి కూడా అకౌంట్ల వివరాలను సక్రమంగా ఇవ్వకపోతే తగిన చర్యలు తీసుకోవటం చేయాలి. ఇది గతంలో అనుసరిస్తూ వచ్చిన పద్ధతి. పెనాల్టి విధించాల్సిన పరిస్థితులు వచ్చినా అది నామమాత్రంగా ఉండాలి. కమ్యూనిస్టు పార్టీలపై కోట్ల రూపాయలు, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌పై 1,823 కోట్ల రూపాయల పెనాల్టీ విధించటమంటే అర్థం ఏమిటి? ప్రతిపక్ష పార్టీల కార్యకలాపాలను నిరోధించి, పాలక బిజెపికి ఎటువంటి ప్రతిఘటన లేకుండా చేసుకోవటానికే మోడి ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకున్నదన్నది స్పష్టం.

అకౌంట్లలో పొరపాట్లు ఉన్నాయనే పేరుతో తన ప్రత్యర్ధి రాజకీయ పార్టీలపై విధిస్తున్న పెనాల్టీలను కార్పొరేట్ సంస్థల ఎకౌంట్లకు వర్తింపజేయగలరా? కార్పొరేట్ సంస్థల ఎకౌంట్లన్నీ తప్పుల తడకలుగా ఉంటాయి. పన్నుల నుండి తప్పించుకోవటం కోసం వందలు, వేలకోట్ల రూపాయల ఆదాయాలను దాచి పెడుతుంటారు. ఇబ్బడి ముబ్బడిగా లాభాలొస్తున్నా నష్టాలను చూపించి, లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను ఎగ్గొడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఒక చిన్న సాంకేతిక కారణాన్ని ఆసరా చేసుకొని సిపిఐ(ఎం)కు15.59 కోట్ల రూపాయల పెనాల్టి విధించిన ఐటి డిపార్ట్‌మెంటు కార్పొరేట్లు పాల్పడుతున్న అంకౌంట్ మోసాలకు ఎంత జరిమానాలు విధిస్తున్నది? ఇదే విధంగా కార్పొరేట్ సంస్థలకు జరిమానాలు విధిస్తే ప్రభుత్వానికి ఎన్ని లక్షల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది? దేశంలో ఒక్క కార్పొరేట్ సంస్థగానీ, ఒక్క శత కోటీశ్వరుడు గాని మిగులుతారా?

కార్పొరేట్లు చేస్తున్న మోసాలకు నజరానాగా వేలకోట్ల రూపాయలు రాయితీల రూపంలో కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వం ప్రతిపక్ష రాజకీయ పార్టీల ఎకౌంట్లలో పొరపాట్లున్నాయనే పేరుతో కోట్ల రూపాయలు జరిమానాలు విధిస్తున్నది. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేయటం, అప్రకటిత ఏకపార్టీ నియంతృత్వాన్ని దేశంపై రుద్దటం అన్న లక్ష్యాన్ని సాధించటం కోసం బిజెపి అనుసరిస్తున్న ఈ తప్పుడు విధానాన్ని ప్రజలందరూ ప్రతిఘటించాలి.

**అవినీతి ఊబిలో మోడి ప్రభుత్వం**

ఒకవైపున మోడీ ప్రభుత్వం గతంలోని ఏ ప్రభుత్వం కన్నా ఎక్కువగా అవినీతి కుంభకోణాలలో కూరుకుపోతుండగా, మరోవైపున అవినీతి వ్యతిరేక యోధుడిలాగా మోడి ఫోజు పెట్టటం వెగటు పుట్టిస్తున్నది. 2014లో మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకదానిని మించి మరొకటిగా భారీ కుంభకోణాలు జరిగాయి. పెద్దనోట్లు రద్దు, రాఫెల్ విమానాల కొనుగోలు, బిర్లా-సహారా డైరీలు, ఎన్నికల బాండ్లు తదితరాలు వీటిలో కొన్ని మాత్రమే.

అవినీతిపరులను వదిలి ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్నవారు, ప్రతిపక్ష నేతలపైనా కేసులు పెట్టి బెయిలు రాకుండా చేసి, జైళ్ళలో నిర్బంధిస్తున్నారు. చాలా కేసులలో ఏళ్ళూ పూళ్ళూ గడుస్తున్నా ఛార్జిషీటు కూడా దాఖలు చేయటం లేదు. అటువంటి వారు బిజెపిలో లేదా బిజెపి మిత్రపక్షాలలో చేరితే వారిపై ఉన్న కేసులను రద్దు చేస్తున్నారు. ఎంత పెద్ద నేరం చేసిన వారైనా బిజెపిలో చేరితే పునీతులౌతున్నారు. ఇటువంటి వాటికి ప్రఫుల్‌పటేల్ కేసు తాజా ఉదాహరణగా ఉంది. ప్రఫుల్‌పటేల్ యుపిఎ ప్రభుత్వంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఎయిర్ ఇండియాకు విమానా లను లీజుకు ఇప్పించటం కోసం పౌర విమానయాన శాఖ అధికారులతో కలిసి కుట్ర చేశాడనే ఆరోపణలను పరిశీలించిన సుప్రీం కోర్టు ఆయనపై కేసు నమోదు చేయాలని

సిబిఐని ఆదేశించింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా 2017లో సిబిఐ ఆయనపై కేసు నమోదు చేసింది. ఏడు సంవత్సరాల పాటు విచారణ జరిపిన తర్వాత ప్రఫుల్‌పటేల్‌కు, అప్పటి పౌర విమానయాన శాఖ, ఎయిర్ ఇండియా అధికారులకు క్లీన్‌చిట్ ఇస్తూ కేసును మూసివేసి, 2024, మార్చిలో కోర్టుకు సిబిఐ నివేదికను అందజేసింది. 2024, ఫిబ్రవరి 15న ప్రఫుల్‌పటేల్‌ను రాజ్యసభ ఎన్నికలలో పోటీ చేయిస్తామని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రకటించటం, ఆయనపై ఉన్న కేసులను మార్చినెలలో రద్దు చేయటం చకచకా జరిగిపోయాయి.

ప్రఫుల్‌పటేల్ పౌర విమానయాన శాఖమంత్రిగా తన స్థానాన్ని వినియోగించు కొని, పౌర విమానయాన శాఖ అధికారులు, ఎయిర్ ఇండియా, ఇతర ప్రైవేటు సంస్థలను కలుపుకొని, ప్రైవేటు వారి నుండి పెద్దసంఖ్య లో విమానాలను ప్రభుత్వరంగంలో ఉన్న ఎయిర్ ఇండియాకు లీజుకు ఇప్పించాడు. ఎయిర్ ఇండియా కొత్త విమానాలను కొనుగోలు చేస్తున్న సమయంలో ఈ విధంగా లీజుకు ఇప్పించాడని కూడా ఆరోపణలు వచ్చాయి. ప్రఫుల్‌పటేల్‌పై సిబిఐ 2017లో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఈ విధంగా పేర్కొంది, "పెద్దమొత్తంలో విమానాలను కొనుగోలు చేయటం, కొన్ని విమానాలు, ముఖ్యంగా సముద్రాంతర దేశాలకు వెళ్ళివచ్చే విమానాలు దాదాపుగా ఖాళీగా తిరగటంతో భారీగా నష్టాలు వస్తున్నప్పటికీ, పౌర విమానయాన శాఖ, నేషనల్ ఏవియేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎసిఐఎల్) అధికారులు ఎయిర్ ఇండియాకు విమానాలను లీజుకు ఇప్పించారు".

> **"పెద్దమొత్తంలో విమానాలను కొనుగోలు చేయటం, కొన్ని విమానాలు, ముఖ్యంగా సముద్రాంతర దేశాలకు వెళ్ళివచ్చే విమానాలు దాదాపుగా ఖాళీగా తిరగటంతో భారీగా నష్టాలు వస్తున్నప్పటికీ, పౌర విమానయాన శాఖ, నేషనల్ ఏవియేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎసిఐఎల్) అధికారులు ఎయిర్ ఇండియాకు విమానాలను లీజుకు ఇప్పించారు".**

దర్యాప్తు సమయంలో " విమానాలను లీజుకు తీసుకుంటూ చేసుకున్న ఒప్పందాలలో అవసరమైతే ముందుగానే లీజు ఒప్పందాన్ని రద్దు చేస్తామనే క్లాజును చేర్చకపోవటంతో ఎన్ఎసిఐఎల్ ఈ ఒప్పందాలను రద్దు చేయా లంటే నష్ట పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రవాణా, టూరిజం, సంస్కృతిపై నియమించిన పార్లమెంటరీ కమిటి 10-1-2010న ఇచ్చిన నివేదికలోనూ, ప్రభుత్వరంగ సంస్థలను పర్యవేక్షిస్తున్న కమిటీ 12-3-2010న ఇచ్చిన నివేదికలోనూ కొత్తగా కొన్న విమానాలు ఎయిర్ ఇండియాకు చేరిన తర్వాత కూడా విమానాల లీజులను కొనసాగించటం, లీజు ఒప్పందాలను పొడిగించటంపై పౌర విమానయాన శాఖపై తీవ్రమైన విమర్శలు చేశాయి. ఆ విమానాలను నడపటానికి పైలెట్లు సిద్ధంగా లేనప్పుడు అత్యంత ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన15 విమానాలను లీజుకు తీసుకోవటంతో సంస్థకు భారీగా నష్టం వచ్చిం దని దర్యాప్తులో వెల్లడైంది. "కొన్న విమానాలు 2007 తర్వాత ఎయిర్ ఇండియాకు చేరుతున్న ప్పటికీ, ప్రైవేటు వారికి ప్రయోజనం కలిగించ టం కోసం ఐదు సంవత్సరాల కాలానికి నాలుగు బోయింగ్ 777 విమానాలను లీజుకు తీసుకుంటూ 2006లో ఒప్పందం చేసుకున్నారని, ఫలితంగా ఐదు బోయింగ్ 777, ఐదు బోయింగ్ 737 విమానాలను ఖాళీగా ఉంచటంతో 2007-09 సంవత్స రాలలో 840 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని సిబిఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. పార్లమెంటరీ కమిటి వెల్లడించిన వాస్తవాలను, తన దర్యాప్తులో రుజువైన, ఎఫ్ఐఆర్‌లో పొందిపర్చిన అంశాలను పక్కన పెట్టి, ప్రఫుల్ పటేల్‌కు సిబిఐ క్లీన్‌చిట్ ఇచ్చింది. ప్రఫుల్‌పటేల్ బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎలో చేరటమే అందుకు కారణం. ఈ విధంగా అవినీతి పరులను కాపాడుతున్న ప్రధాని మోడి అవినీతి వ్యతిరేక పోరాట యోధుడిగా ఫోజు పెట్టటం ఎంత హాస్యాస్పదం!

### ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రధాన ప్రతిపక్షాల అవకాశవాదం

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు అధికార సాధన కోసం అన్ని విలు వలను వదిలేస్తున్నాయి. ప్రజల సమస్యలను, రాష్ట్ర సంక్షేమాన్ని పక్కన పెట్టి స్వప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. అధికారంలో ఉన్న వైసిపి రాష్ట్రాభివృద్ధికి అవసరమైన వనరులను సమకూర్చుకోవటం, కేంద్రం నుండి రావలసిన నిధులను రాబట్టటం, అదనపు గ్రాంట్ల కోసం ప్రయత్నం చేయటం, రాష్ట్రానికి హక్కుగా రావలసిన ప్రత్యేకహోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, పునరావాసానికి అవసరమైన మొత్తం నిధులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రావలసిన నిధులు, రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరి తదితరాల సాధన కోసం ముందుండి కృషి చేయాలి. వీటిని ఇవ్వటానికి కేంద్ర ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. కేంద్రం నుండి రాష్ట్రానికి హక్కుగా రావలసిన వాటిలో ఏ ఒక్కదానిని కూడా ఇవ్వటానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించటం లేదు. ఇటువంటి పరిస్థితులలో మనకు రావలసిన వాటిని సాధించుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. సామరస్యంగా అడిగినపుడు కేంద్రం ఇవ్వకపోతే గట్టిగా డిమాండ్ చేయాలి. కేంద్ర ప్రభుత్వం మన హక్కులను హరిస్తున్నదని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలి. రాష్ట్రంలోని ఇతర రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమా వేశం జరిపి, కేంద్రంతో పోరాడటానికి పార్టీలను, ప్రజలను సన్నద్ధం చేయాలి. ఢిల్లీకి అఖిలపక్ష ప్రతినిధి బృందాలను తీసుకెళ్ళటం, రాష్ట్రంలోని ప్రజలను కేంద్ర నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఉద్యమాలలోకి తీసుకురావటం చేయాలి. ఆ విధంగా రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రజలను ఉద్యమాలలోకి తీసుకురావటం ద్వారా రాష్ట్ర హక్కులను సాధించటానికి పూనుకోవాలి.

కానీ వైసిపి ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలలో ఈ దిశగా చేసింది శూన్యం. మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ఎంత అన్యాయం చేస్తున్నా, హక్కులను హరిస్తున్నా కనీసం నిరసన కూడా తెలిపింది లేదు. పైగా కేంద్రం తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక, రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, మన రాష్ట్రానికి కూడా నష్టం కలిగించే చట్టాలన్నింటికీ పార్లమెంటులో మద్దతు ఇవ్వటంలో వైసిపి ముందెత్తున ఉంటున్నది. ప్రజా వ్యతిరేక చట్టాలను బజెపి ప్రభుత్వాల కన్నా ముందే రాష్ట్రంలో అమలు చేస్తున్నది. ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీ వెళ్ళి కేంద్ర మంత్రులను కలిసినపుడు రాష్ట్ర

**"టిడిపి తీరు కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఆ పార్టీ కూడా రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులు, వాటిని సాధించే విధానాలను గురించి ఏనాడూ ప్రస్తావించ లేదు. ప్రత్యకహోదా విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పిల్లిమొగ్గలు వేశాయి. జనసేన ఎన్‌డిఎలో భాగం అయి, ఏ అంశం పైనా కేంద్రాన్ని నిలదీయటం లేదు."**

హక్కులు, నిధులను డిమాండ్ చేయటం లేదు. కేంద్రం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టి వ్యవహరిస్తున్నా, ప్రాణాలు అర్పించి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కుఫ్యాక్టరీని ప్రైవేటీకరిస్తున్నా కిమ్మనటం లేదు. ఏమిపోయినా బిజెపి దయా దాక్షిణ్యాలుంటే చాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర నాయకుల కటాక్షం కోసం అంగలారుస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేనని, హక్కులను సాధించటం తన వల్ల కాదని వైసిపి నిరూపించుకున్నది.

టిడిపి తీరు కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఆ పార్టీ కూడా రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులు, వాటిని సాధించే విధానాలను గురించి ఏనాడూ ప్రస్తావించ లేదు. ప్రత్యకహోదా విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పిల్లిమొగ్గలు వేశాయి. జనసేన ఎన్‌డిఎలో భాగం అయి, ఏ అంశం పైనా కేంద్రాన్ని నిలదీయటం లేదు. రాష్ట్రం ఏమైపోయినా, కేంద్రం రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నా పట్టించుకోకుండా తమ వ్యక్తిగత ప్రయోజనాలను సాధించుకోవటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

ప్రస్తుతం పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలలో టిడిపి, జనసేన బిజెపితో పొత్తు పెట్టుకొని పోటి చేస్తున్నాయి. వైసిపి బిజెపితో పొత్తులేకపోయినా దాని కటాక్షం కోసం అంగలారుస్తున్నది. బిజెపి పరోక్ష మద్దతుతో రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నది. అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన విధానపరంగా ఏ అంశంలోనూ బిజెపితో విబేధించటం లేదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయ విధానాలు లేవు కాబట్టి ప్రజలను మభ్యపెట్టటానికి కులాలు, మతాలు, ప్రాంతీయ వివాదాలు తదితరాలను ముందుకు తెచ్చి, ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకొంటున్నారు. ప్రజలలో చీలికలు పెట్టి, తమ పబ్బం గడుపుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు.

ఇటువంటి పరిణామాల నేపథ్యంలో వైసిపి లేక టిడిపి-జనసేన-బిజెపి కూటములకు రాష్ట్రంలో అధికారంలోకి రావటానికి ఏమైనా అర్హత ఉందా అన్న అంశాన్ని ప్రజలు ఆలోచించాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే శక్తి తమకు లేదని ఉభయులూ రుజువు చేసుకున్నారు. వీరి అవకాశవాదాన్ని, అధికార దాహాన్ని ఆసరా చేసుకొని, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి వీరిని తోలుబొమ్మల వలె ఆడిస్తున్నది. జగన్మోహనరెడ్డి, చంద్రబాబులను కేసులతో భయపెడుతున్నది. జగన్‌మోహనరెడ్డిని గతంలో ఉన్న కేసులను చూసి భయపెడుతుండగా, చంద్రబాబును కేసులలో ఇరికించటానికి అవసరమైన సమాచారాన్ని రాష్ట్రానికి కేంద్రమే ఇచ్చిందని వెల్లడైంది కదా. ఇపుడు ఇద్దరిలో ఎవరు విధేయంగా లేరనే సందేహం వచ్చినా వారిని బెదిరించి, లొంగదీసుకోవటానికి కేసులను ముందుకుతెస్తారు. అందువలన రానున్న రోజులలో ఇంతకు ముందు వలె కూడా ఈ ఇద్దరిలో ఎవరూ కేంద్రంతో గట్టిగా మాట్లాడలేరు. కేంద్రం ముందు రాష్ట్ర హక్కులను కూడా డిమాండ్ చేయలేని వారిని రాష్ట్రాన్ని పాలించటం కోసం ఎన్నుకోవటం అవసరమా? అందువలన వైసిపి, టిడిపి-జనసేన-బిజెపి కూటమితో రాష్ట్ర భవిష్యత్ శూన్యంగా ఉంటుంది. వామ పక్షాలు, ఇతర పార్టీలు, అభ్యుదయ శక్తులు కలిసిన ప్రత్యామ్నాయమే రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దగలుగుతుంది. రాష్ట్ర ప్రజలు ఆలోచించి, వైసిపి, టిడిపి- జనసేన- బిజెపిలకు ప్రత్యామ్యాయ రాజకీయ శక్తులను అధికారంలోకి తీసుకురావాలి.

# నయా-వలసవాదానికి రైతుల ప్రతిఘటన

*(7వ పేజీ తరువాయి)*

తర్వాత, 2014లో గోధుమలకు 354 రూపాయలు మాత్రమే ఇవ్వాలి. 2014లో ఉన్న డాలరు- రూపాయి మారకం రేటు 60.5 రూపాయలను, వ్యవసాయోపకరణాల ధరలు ఐదురెట్లు పెరగటాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదు.

భారతదేశం 2014లో బోనస్‌తో కూడా కలిపి క్వింటాలు గోధుమలకు ఇచ్చిన మద్దతు ధర 1,386 రూపాయలు. ఈ ధరకు, 354 రూపాయలకు మధ్య ఉన్న వ్యత్యాసం 1032 రూపాయలను భారతీయ రైతులకు ప్రభుత్వం ఇస్తున్న అదనపు మద్దతు ధరగా అమెరికా చెబుతున్నది. దేశంలో పండిస్తున్న మొత్తం గోధుమలను టన్నులలో లెక్కించి, దాని విలువ మొత్తాన్ని గుణించి, దేశంలో రైతులకు 65 శాతం అదనంగా చెల్లించి, ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను ఉల్లంఘించారని అమెరికా ఆరోపిస్తున్నది.

వరిధాన్యానికి కూడా ఇదే విధంగా లెక్కించి, ఉత్పత్తిలో 77 శాతం మద్దతు ధరగా ఇస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవటానికి ఎంతకు దిగజారతాయో తెలియజేసే ఒకటవ నంబరు కుయుక్తి ఇది. ఈరోజు గోధుమలు, వరిధాన్యం ఉత్పత్తి చేయటానికి 354, 235 రూపాయలు సరిపోతాయని, దానికి అదనంగా ఇచ్చేది వ్యవసాయ ఒప్పందం ప్రకారం పెనాల్టి చెల్లించటానికి దారితీస్తుందని మన రైతాంగానికి తెలిస్తే, వారికొచ్చే న్యాయమైన కోపాన్ని మనం ఊహించుకోవచ్చు. మరోవైపున అభివృద్ధి చెందిన దేశాలు తాము ఇస్తున్న సబ్సిడీలు న్యాయమైనవని చెబుతూ, ఎటువంటి పెనాల్టీలు లేకుండా తమ వ్యవసాయోత్పత్తి విలువలో 50 నుండి 100 శాతం వరకు తమ రైతాంగానికి సబ్సిడీగా ఇస్తున్నాయి.

ఉత్పత్తిలో స్వతంత్రమైన పునాది, సామాజిక సహకార విలువలతో గతంలో మన రైతులు విజయం సాధించారు. నయా-ఉదారవాదానికి వ్యతిరేకంగా చేస్తున్న చారిత్రాత్మక పోరాటంలో భవిష్యత్‌లో కూడా విజయం సాధిస్తారు. బానిసత్వానికి వ్యతిరేకంగా, స్వాతంత్ర్యాన్ని కోరుకొనే వారందని సహకారాన్ని రైతులు కోరుతున్నారు.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

# ప్రపంచపు తొలి ప్రకృతి శాస్త్రవేత్త 'ఉద్దాలకుడు'

*(2వ పేజీ తరువాయి)*

శ్వేతకేతు తిరిగి వచ్చాడు. అప్పటికి అతని వయస్సు 24. తనకి పాండిత్యం అబ్బింది అన్న గర్వంతో అతడు ఉన్నాడు. అప్పుడు అతడిని ఉద్దాలకుడు కొన్ని ప్రశ్నలడిగాడు.

1. ఏం నేర్చుకుంటే ఇంతవరకూ వినని విషయాలను మనం వినగలుగుతాం?

2. ఏం నేర్చుకుంటే మనం ఇంతవరకూ ఆలోచించలేకపోయిన వాటి గురించి ఆలోచించగలుగుతాం?

3. ఏం నేర్చుకుంటే మనం ఇంతవరకూ అర్థం కానిదాన్ని అర్థం చేసుకోగుగుతాం?

ఈ విషయాలు గురువులు నేర్పారా అని శ్వేతకేతుని అడిగాడు. ఆ ప్రశ్నలే శ్వేతకేతుడికి అర్థం కాలేదు. అటువంటివి అతడి గురువులు ఎప్పుడూ బోధించలేదు. అప్పుడు ఆ ప్రశ్నలను వివరించమని తండ్రిని కోరాడు.

ఈ విశ్వం దేనితో రూపొందిందో, దేనినుంచి ప్రతీదీ పుట్టుకొచ్చిందో ఆ మూల పదార్థం గురించి తెలుసునా అని ఉద్దాలకుడు అడిగాడు. ఆ తర్వాత ఇలా వివరించాడు: "ఒక మట్టి కణం గురించి తెలుసుకున్న తర్వాత మట్టితో చేసిన ప్రతీ వస్తువు గురించీ ఏ విధంగా తెలుస్తుందో, అదే విధంగా మనం తెలుసుకోవలసిన మూలపదార్థం ఏమిటి? మట్టితో చేసిన వస్తువులు రకరకాల ఆకారాలలో, రకరకాల పేర్లతో ఉంటాయి. కానీ వాటి మూలపదార్థం మట్టి అని మనకి తెలుసు. అదే విధంగా ఒక చిన్నపాటి బంగారం గురించి తెలిస్తే ఆ తర్వాత బంగారంతో చేసిన వివిధ ఆభరణాల గురించి తెలుస్తుంది. అదే విధంగా ఇనుము గురించి తెలిశాక అన్ని ఇనుప పరికరాలనూ తెలుసుకోవచ్చు.

అదే మాదిరిగా జ్ఞానం మనకు రావాలంటే ఈ విశ్వం మూల పదార్థం ఏమిటో తెలుసుకోవాలి. నీకది మీ గురువులు నేర్పారా? "

తనకు వేదాలు వల్లించడం ఎలాగో నేర్పారే తప్ప ఇటువంటి విషయాలు ఏవీ నేర్పలేదని శ్వేతకేతు జవాబు చెప్పాడు. ఆ జ్ఞానాన్ని తనకు నేర్పమని తండ్రిని కోరాడు. అప్పుడు ఉద్దాలకుడు తన ప్రత్యక్ష అనుభవజ్ఞానం నుంచి నేర్పడానికి పూనుకున్నాడు. ఈ గాథ ఛాందోగ్యో ఉపనిషత్ ఉపోద్ఘాతంలో ఉంది.

అప్పటికి వైదిక పురోహితులంతా వాస్తవం గురించి తెలుసుకోడాన్ని ఈసడిస్తూ, ఈ ప్రపంచం అంతా మాయ అని వాదించడమే పనిగా పెట్టుకునివున్నారు. "పరోక్ష ప్రియ: ఇవ దేవా: ప్రత్యక్షాద్విష:" అని యాజ్ఞవల్క్యుడు ప్రకటించాడు. " దేవతలకు అస్పష్టమైనదే ప్రీతి. ప్రత్యక్ష జ్ఞానాన్ని వారు ఈసడించుకుంటారు" అని దాని అర్థం. కాని ఉద్దాలకుడు తన ప్రత్యక్ష అనుభవం ప్రాతిపదికనే జ్ఞానాన్ని గ్రహించాలని ప్రయత్నించాడు. అతడి తాత్విక దృష్టికి అదే ప్రధాన ప్రాతిపదిక. ప్రపంచం మొత్తం మీద సైన్సు చరిత్రలో ఇంత బాహాటంగా ప్రత్యక్ష అనుభవ జ్ఞానానికి పెద్ద పీట వేసిన తత్వ వేత్త ఉద్దాలకుడికన్నా ముందు ఎవరూ లేరు.



శ్వేతకేతుతో సంభాషిస్తున్న ఉద్దాలక అరుణి (తైల చిత్రం)

"కంటికి కనిపించే వాటికి సంబంధించిన భ్రమాన్వితమైన కట్టుకథలను నిరాకరించి మన ముందున్నవాటిని ఉన్నవి ఉన్నట్టుగా తెలుసుకునే ప్రయత్నం చేస్తేనే వాటి గురించిన జ్ఞానాన్ని పొందగలం" అని ఉద్దాలకుడు చెప్పాడు. ఆ ప్రాచీన కాలంలో ఉద్దాలకుడికి శాస్త్ర పరిజ్ఞానం ఎంత తెలిసిందో చెప్పలేం కాని అతడి దృక్పథం మాత్రం శాస్త్రీయమేనని గట్టిగా చెప్పవచ్చు.

ఉద్దాలకుడు తన పరిశీలనను కేవలం ప్రకృతిలో కనిపించేవాటికి మాత్రమే పరిమితం చేయలేదు. మానవ శ్రమతో కూడిన ఘటనలను కూడా పరిశీలించాడు. ధర్మసూత్రాలన్నీ మానవ శ్రమను హీన కర్మగా పరిగణించిన ఆ కాలంలో అదే మానవ శ్రమను విజ్ఞానానికి ఒక వనరుగా చూశాడు ఉద్దాలకుడు. మానవ శ్రమ ప్రధానంగా శూద్రులు మాత్రమే చేసే ఆ కాలంలో ఉద్దాలకుడికి ఆ శ్రామిక కులాల పట్ల ఏ చిన్నచూపూ లేదు.

ఉపోద్ఘాతం తర్వాత ఛాందోగ్యో ఉపనిషత్‌లో ఉద్దాలకుడు మళ్ళీ తన దృక్పథాన్ని వివరించడం జరిగింది.

మొదటిది: ఇది యాదృచ్ఛికతకు సంబంధించినది. "ఈ ప్రపంచం మొదటినుంచీ ఉంది. ఇంకొక ప్రపంచం లేదు. ఈ ప్రపంచం సత్. కొందరు మొదట్లో ఈ ప్రపంచం లేని స్థితి (అసత్) ఉండేదని అంటారు. ఆ ఉనికిలో లేకపోవడం నుంచే ఈ ప్రపంచం ఉనికిలోకి వచ్చిందని అంటారు. అంటే అసత్ నుండి సత్ వచ్చిందని వారు అంటారు. కాని వాస్తవంగా ఉనికిలో ఉన్నది ఉనికిలో లేనిదానినుండి ఎలా వస్తుంది? శూన్యం నుండి శూన్యమే వస్తుంది తప్ప ఇంకేదీ పుట్టదు."

ఉద్దాలకుడి అనంతర కాలపు తత్వవేత్త కపిలుడు ప్రతిపాదించిన సాంఖ్యం ఈ వాదననే చాలా గట్టిగా సమర్థించింది. పదార్థం తన స్వభావం వల్లే అనాదిగా ఉనికిలో ఉందని, అనంతర కాలంలో దానినుండి చైతన్యం పుట్టిందని వాదించింది. ఉద్దాలకుడి వాదనను

పలుచన చేయడానికి , వక్రీకరించడానికి శంకరుడు, రామానుజుడు కూడా తర్వాత కాలంలో ప్రయత్నించారు. ఉద్దాలకుడు చెప్పిన సత్ అంటే పరమాత్మేనని వారిద్దరూ వ్యాఖ్యానించడానికి సిద్ధపడ్డారు. ఉద్దాలకుడి కాలానికే పరమాత్మ అనే భావన ఉపనిషత్ సాహిత్యంలో బాగా ప్రచారం పొందింది. కాని ఉద్దాలకుడు పరమాత్మ అన్న పదాన్నే అసలు ఉపయోగించలేదు. దీనిని బట్టి శంకరుడు, రామానుజుడు చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు అని స్పష్టం ఔతోంది. అంతే కాదు. తన కుమారుడు శ్వేతకేతు వేదాలను నేర్చుకున్నానని చెప్పినప్పుడు అది కొరగానిదని చెప్పి అనుభవ జ్ఞానం ప్రాధాన్యత గురించి ఎందుకు చెప్పాడు? ఉద్దాలకుడు దేవత అనే పదం వాడాడు. కాని దానిని అగ్ని, కాంతి, వాయువు, అన్నం వంటి ప్రకృతిశక్తులను సూచించడానికి మాత్రమే వాడాడు.

ఆ తర్వాత ఉద్దాలకుడు ప్రపంచంలో ఉనికిలో ఉన్నవన్నీ పరిణామక్రమంలో సత్ నుండి ఏవిధంగా రూపొందినదీ వివరించడానికి పూనుకున్నాడు. సత్ యొక్క అతి సూక్ష్మ రూపం ఇక మరింత విడగొట్టడానికి సాధ్యం కానంత చిన్నగా ఉంటుందని, ఆ సూక్ష్మ రూపంలోని సత్ వివిధ రకాలుగా కలిసినప్పుడు వివిధ పదార్థాలు- సజీవ, నిర్జీవ - ఏర్పడ్డాయని తెలిపాడు.

ఆ తండ్రీ కొడుకుల మధ్య సంభాషణ ఇలా సాగింది:

"ఇక్కడికి ఒక కట్టెపుల్ల తీసుకురా

ఇదిగో తెచ్చాను

దానిని ముక్కలు చెయ్యి

చేశాను

వాటిలో ఒకదానిని తీసుకుని దానిని మళ్ళీ ముక్కలు చెయ్యి

చేశాను.

(ఇలా కొన్నిసార్లు మళ్ళీ మళ్ళీ మరింత చిన్న ముక్కలు గా చేసిన తర్వాత)

ఇప్పుడు నీకు అక్కడ ఏమిటి కనిపిస్తోంది?

ఏమీ లేదు తండ్రీ"

అప్పుడు ఉద్దాలకుడు ఇలా వివరించాడు: "ఇప్పుడు నువ్వు కంటితో చూడలేకపోతున్న అతి సూక్ష్మమైన సారం నుండే ఇంత పెద్ద చెట్టు ఏర్పడింది. ఆ అతి సూక్ష్మమైన సారమే ఈ ప్రపంచానికి మూలం. అత్యంత సూక్ష్మమైన ఆ పదార్థమే ఈ ప్రపంచానికి ఆత్మ. నువ్వు కూడా దానినుండే వచ్చావు శ్వేతకేతూ"

"తండ్రీ ! నాకు మరింత బాగా అర్థం అయేలా చెప్పండి"

"అలాగే కానియ్యి. ఇదిగో ! ఆ ఉప్పు తెచ్చి ఈ కుండలోని నీటిలో వెయ్యి. రేపు ఉదయాన్నే నాకు కనపడు"

తండ్రి చెప్పినట్టే చేసి శ్వేతకేతు మర్నాడు ఉదయాన్నే వెళ్ళి తండ్రి దగ్గర నిలబడ్డాడు.

"నిన్న సాయంత్రం ఈ నీటిలో వేసిన ఉప్పును నాకు తిరిగి తీసుకురా"

"అది లేదు తండ్రీ, నీటిలో పూర్తిగా కరిగిపోయింది."

" ఆ కుండ పై భాగం నుండి కొంచెం నీటిని తీసుకుని రుచి చూసి చెప్పు."

"ఉప్పగా ఉంది"

"కుండ దిగువ భాగం నుండి నీటిని తీసుకుని రుచి చూసి చెప్పు"

" ఇదీ ఉప్పగానే ఉంది"

ఆ తర్వాత ఆపక్కనుండి, ఇవతలిపక్క నుండి కూడా నీరు తీసి రుచి చూడమని చెప్పాడు ఉద్దాలకుడు. అప్పుడూ ఉప్పగానే ఉందన్న సమాధానం వచ్చింది.

అప్పుడు ఉద్దాలకుడు ఇలా చెప్పాడు. "నువ్వు చెప్పింది నిజం నాయనా. నువ్వు ఇక్కడ సత్ ను చూడలేకపోయావు. కాని దాని సూక్ష్మ సారం ఈ నీటినిండా కలిసిపోయింది. అదే విధంగా సత్ సారం ఈ విశ్వమంతా కలిసిపోయివుంది. ఇదే సత్యం. ఇదే నీలోనూ ఉంది. ఇదే ఈ యావత్ ప్రపంచానికీ ఆత్మ"

ఇక్కడ ఆత్మ అన్న పదాన్ని భూమి అన్న దానికి పర్యాయపదంగా వాడాడు ఉద్దాలకుడు.

కట్టె పుల్లను చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టుతూ పోవడం ద్వారా, ఉప్పును నీటిలో కరగబెట్టడం ద్వారా ఈ విశ్వానికి మూలమైన సూక్ష్మ పదార్థానికి సంబంధించిన భావనను ఆచరణాత్మకంగా చూపించాడు ఉద్దాలకుడు. ఇప్పుడు మనం కూడా ఉప్పు నీటిలో వేయగానే కంటికి కనిపించని సూక్ష్మ రూపంలో అణువులుగా విడిపోయింది అని అంటాం. అందుకే ప్రసిద్ధ చరిత్రకారుడు బిఎం బారువా "కణాదుడికన్నా ముందే అణు వాదాన్ని ఊహించినవాడు ఉద్దాలకుడు" అని ప్రకటించాడు.

ఇక్కడ గమనించవలసింది మరొకటి ఉంది. తన వాదనను సమర్థించుకోడానికి ఫలానా శాస్త్రంలో అలా చెప్పారు, ఫలానా జ్ఞాని ఇలా చెప్పారు అని ఉద్దాలకుడు ఎక్కడా చెప్పలేదు. పూర్తిగా ప్రత్యక్ష పరిశీలనమీద, అనుభవ జ్ఞానం మీద ఆధారపడ్డాడు. అతడు ఉపయోగించిన రెండో ప్రయోగం (నీటిలో ఉప్పును కరిగించడం) సారాంశాన్ని గ్రహించడానికి ఉద్దాలకుడు ప్రదర్శించినది ఖచ్చితంగా శాస్త్రీయ దృష్టే.

మనిషి మెదడు అతడు తిన్న అన్నం లోని సూక్ష్మ పదార్థం నుండి ఏర్పడింది అని ఉద్దాలకుడు భావించాడు. ఈ అవగాహనను నేటి శాస్త్రవిజ్ఞాన స్థాయిని బట్టి చూడకూడదు. తక్కినవాటి మాట ఎలా ఉన్నా, అన్నం తినకుండా ఉండిపోతే మెదడు సక్రమంగా ఆలోచించే శక్తిని క్రమంగా కోల్పోతుంది అన్నది మాత్రం వాస్తవం. మళ్ళీ అన్నం తిన్నాక ఆ ఆలోచించే శక్తి తిరిగి వస్తుంది.

ప్రపంచంలోని బహుళత్వం ఎలా వచ్చింది అన్న ప్రశ్నకు ఉద్దాలకుడు పదార్థంలో ఉన్న చలనం అనే లక్షణం నుండే ఈ బహుళత్వం, ఈ మార్పులు అన్నీ వచ్చాయి అని చెప్పాడు. అంత పాతకాలపు వ్యక్తి ఇంత లోతైన తాత్విక భావనను చెప్పడం చాలా గొప్పవిషయం. చలనం అన్న ధర్మాన్ని వివరించడానికి ఉద్దాలకుడు ఉపయోగించిన పదం "ఐచ్ఛికత". శంకరుడు, రామానుజుడు ఈ ఐచ్ఛికత అనేది చైతన్యం నుండి మాత్రమే వస్తుంది అని వాదించారు. ఐతే ఉద్దాలకుడు తేజస్ (వేడి) ఆపస్ (నీరు) అన్న (ఆహారం) అనే రూపాలను వివరించినప్పుడు కూడా ఈ ఐచ్ఛికత అన్న పదాన్నే ఉపయోగించాడు. దానిని బట్టి ఐచ్ఛికత అన్న పదాన్ని చైతన్యం అనే అర్థంలో వాడలేదని రామానుజుడు అంగీకరించవలసివచ్చింది. పదార్థంలోనే స్వత:సిద్ధంగా చలనం ఉంటుందని ప్రతిపాదించిన ఉద్దాలకుడు ఆ చలనం కారణంగానే ప్రాథమిక లేదా మూల పదార్థం ఏర్పడింది తప్ప ఎటువంటి బాహ్య శక్తి (పరమాత్మ) కాణం కాదని భావించాడు.

ఉద్దాలకుడు సుమారు 2500 సంవత్సరాలకు పూర్వం ఉండిన వాడని మనం గుర్తుంచుకోవాలి. అందుచేత అతడి నిర్ధారణల్లో చాలా భాగం శాస్త్రీయం కాకపోవచ్చు. కాని అతడు అనుసరించిన పద్ధతి-అనుభవాల నుండి, పరిశీలననుండి నిర్ధారణలకు రావడం, భ్రమలకు తావు ఇవ్వకపోవడం అనేది ప్రధానంగా మనం పరిగణించాలి. అటువంటి పద్ధతి ద్వారా ఉద్దాలకుడు నీరు వేడి నుండి పుడుతుందని చెప్పాడు. (వేడి ఎక్కువగా ఉన్నప్పుడు చెమట పడుతుంది గనుక) నీటి నుండి అన్నం వస్తుందని చెప్పాడు (నదీ తీరాల వెంబడి ఉండే భూముల్లో పంటలు పండేవి గనుక)

వేడి, నీరు, ఆహారం.. ఈ మూడింటినీ ఉద్దాలకుడు ప్రధాన రూపాలుగా పరిగణించాడు. ఈ మూడూ ప్రాథమిక, సూక్ష్మ

పదార్థం నుండి వచ్చాయని నిర్ధారించాక, మనకు కనిపించేవన్నీ, అంటే సూర్యుడు, చంద్రుడు, మెరుపులు వంటి పెద్ద వాటి మొదలు, అతి చిన్న కీటకాలైన దోమలు వంటి జీవులవరకూ ఉన్నవన్నీ ఈ మూడు ప్రధాన పదార్థాలనుండే పరిణామం చెందాయని ఉద్దాలకుడు చెప్పాడు. ఉద్దాలకుడి కాలం నాటికి ఆవిధంగా చెప్పడం అపరిపక్వమే అయివుండవచ్చు. కాని, సూర్యుడిని, చంద్రుడిని, కొండల్ని, చెట్టు చేమలను, జంతువులను అన్నింటినీ దేవతలుగా పరిగణించి వాటి చుట్టూ భ్రమాన్వితమైన భావాలను ప్రచారం చేసే తాత్విక దృక్పథానికి ఇది పూర్తి వ్యతిరేకం. అదే సమయంలో ఆత్మ ఒక శరీరం నుండి మరణానంతరం మరొక శరీరంలోకి ప్రవేశిస్తుంది అన్న వాదనను ఇది పూర్తిగా తిరస్కరించింది. ఆత్మ మళ్ళీ మరో శరీరంలో ప్రవేశిస్తుంది అన్న భావనను బలంగా ప్రచారం చేసి కర్మకాండలు జరిపించే పద్ధతి అప్పటికే చాలా బలంగా అమలులో ఉంది. పైగా ఆ వాదన కుల వ్యవస్థను బలంగా సమర్థిస్తుంది. గత జన్మలో చేసిన కర్మ ఫలితంగా ఈ జన్మలో తక్కువ కులంలో పుట్టావు అని ఆ వాదన చెప్తుంది. ఉద్దాలకుడు ఆ వాదనను పూర్తిగా తిరస్కరించాడు.

మానవులు కూడా వేడి, నీరు, ఆహారం అనే మూడు ప్రధాన పదార్థాలనుండే పుట్టారు అని ఉద్దాలకుడు భావించాడు. అందుకు మనిషి యొక్క జీవితం, అతడి మనస్సు, అతడి వాక్కు– ఈ మూడింటినీ ప్రధానంగా ఎంచుకున్నాడు. ఈ విధంగా ప్రయత్నించడం చాలా గొప్ప విషయంగా భావించాలి.

మొదటిది: ఉద్దాలకుడికి ముందు ఎవరూ మానవుడి ప్రత్యేకతలను హేతువాద, ప్రాకృతిక కోణం నుండి వివరించే ప్రయత్నం చేయలేదు. ఇది అతడి శాస్త్రీయ దృష్టిని సూచిస్తుంది.

రెండవది: అకర్బన, సకర్బన (ఇనార్గానిక్, ఆర్గానిక్) పదార్థాలుగా విభజన చేయడం. ఈ విధంగా చేసిన మొదటివాడు ఉద్దాలకుడు.

మూడవది: ఉద్దాలకుడి కన్నా ముందు ఎవరూ జీవం పుట్టుక గురించి తెలుసుకునే చైతన్యపూర్వక ప్రయత్నం చేయలేదు. ఉద్దాలకుడే అప్పటి పరిమితులలో వివరించే ప్రయత్నం చేశాడు. జీవం నీటినుంచి పుట్టిందని భావించాడు.

నాలుగవది: మనం తీసుకునే ఆహారం యొక్క అతి సూక్ష్మ రూపం నుంచి మనస్సు పుట్టిందని చెప్పాడు.

ఐదవది: కేవలం తన ఊహలమీద ఆధారపడి చెప్పడం కాకుండా ప్రయోగాత్మ కంగా నిరూపించే ప్రయత్నం చేశాడు.

చాలా మొరటు పద్ధతిలో చేసినా ప్రయోగాల ద్వారా సత్యాన్ని రుజువు చేయాలన్న వైఖరి ఉద్దాలకుడిని ప్రపంచంలో మొదటి ప్రకృతి–శాస్త్రవేత్తగా నిలిపింది.

తీసుకున్న ఆహారం నుంచి మనస్సు పుట్టిందన్న సూత్రాన్ని వివరించమని శ్వేతకేతుడు తండ్రిని కోరాడు. అప్పుడు ఉద్దాలకుడు 15 రోజులపాటు కేవలం నీరు తప్ప ఏ ఆహారమూ తీసుకోవద్దని శ్వేతకేతుడిని ఆదేశించాడు. 15వ రోజున ఉద్దాలకుడు శ్వేతకేతుడిని వేదాలు వల్లించమని అడిగాడు. శ్వేతకేతుడు ప్రయత్నించాడు కాని వల్లించలేకపోయాడు. తనకేమీ గుర్తుకు రావడం లేదని తండ్రికి చెప్పాడు. 12 సంవత్సరాల పాటు నేర్చుకున్న వేదాలను కేవలం 15 రోజుల ఉపవాసం తర్వాత గుర్తుకు తెచ్చు కోలేకపోయాడు. అప్పుడు ఉద్దాలకుడు శ్వేతకేతు డిని ఆహారం తీసుకోమని ఆదేశించాడు. తీసుకున్న కొంత సమయం తర్వాత వేదాలను వల్లించమని శ్వేతకేతుడిని ఆదేశించాడు. శ్వేతకేతుడు వేదాలు వల్లించగలిగాడు. ఇప్పటి కాలపు శాస్త్రీయ స్థాయినుంచి చూసినప్పుడు ఉద్దాలకుడు అనుసరించిన పద్ధతి, వచ్చిన నిర్ధారణ పూర్తిగా సరైనవి కాకపోవచ్చు. కాని ప్రయోగం చేయడం, పరిశీలించడం అనే విధానం తప్పకుండా శాస్త్రీయమే.

ఉద్దాలకుడి శాస్త్రీయ దృష్టిని ఏదోవిధంగా వక్రీకరించి అతడు చెప్పినది కూడా పరమాత్మ–ఆత్మ చట్రానికి లోబడేవుంది అని చిత్రించడానికి ఆధిపత్య శక్తులు నానా పాట్లూ పడ్డాయి. కానీ ఉద్దాలకుడి విధానం ఏదో రూపంలో కొనసాగుతూనేవచ్చింది. చైతన్యపూరితంగా ప్రకృతిని శాస్త్రీయంగా అధ్యయనం చేయడం అనే ప్రక్రియకు వైతాళికుడిగా ఉద్దాలకుడి పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుంది.

ఎంత అడ్డుకోవాలని చూసినా ఉద్దాలకుడి స్ఫూర్తి ఆ తర్వాత భారతీయ శాస్త్రవేత్తలు కొనసాగించారు. ముఖ్యంగా వైద్యులు "దైవ వ్యాపాశ్రయ భేషజం'' నుండి ''యుక్తి వ్యాపాశ్రయ భేషజానికి" మారారు. దైవమే అంతా నిర్ణయిస్తుంది అన్న సూత్రం నుంచి మానవ ప్రయత్నంతో మార్పు తీసుకురావాలి అన్న సూత్రానికి మారడం అని దాని అర్థం. ఇందుకోసం వారు ప్రత్యక్ష పరిశీలనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. చరక సంహితలో, శుశృత సంహితలో 165 రకాల జంతువుల, 1165 రకాల మొక్కల, మూలికలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయి. మనిషి కళేబరాన్ని కోసి మానవ శరీరంలోని భాగాలను, వాటి మధ్య పొందికను వారు పరిశీలించారు. (అనాటమీ) అందుకే ఆధిపత్య శక్తులు ఆనాటి వైద్యులను కలుషితులలోకెల్లా కలుషితులు అని ఈసడించారు. అంటరానివారిగా పరిగణించారు. శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందడం పట్ల ఆనాటి పాలకవర్గాలకు ఎంత వ్యతిరేకత ఉండేదో దీనిని బట్టి చెప్పవచ్చు.

అందుకే ప్రముఖ శాస్త్రవేత్త ప్రఫుల్ల చంద్ర రే ఈ విధంగా వ్యాఖ్యానించారు:

''కులాలతో కుళ్ళిపోయి, వేదాల, పురాణాల, స్మృతుల ఆదేశాలకు లోబడి వ్యవహరించే అధికారం నడిచిన చోట మేధస్సు కుచించుకుపోయి, పక్షవాతానికి లోనైంది. అటువంటి పరిస్థితుల్లో ఏ విధమైన శాస్త్రీయ ప్రాతిపదికనైనా ముందుకు తెచ్చి మార్గదర్శ కంగా నిలిచే శాస్త్రవేత్త ఎవరూ ముందుకు రాలేదు"

"వేదాంత దర్శనం, శంకరుడి ద్వారా మెరుగు దిద్దబడిన తర్వాత ఈ భౌతిక ప్రపంచం వాస్తవం కాదనీ, అంతా మాయేననీ బాగా ప్రచారం చేయడం కూడా ఒక కారణం. దానివలన శాస్త్రవిజ్ఞాన అధ్యయనం ఒక అగౌరవమైన విషయంగా సమాజంలో పరిగణించబడింది. " సృష్టికి మూలకారణం పరమాత్మ అన్న విషయాన్ని అంగీకరించని ఏ సిద్ధాంతమూ అంగీకారయోగ్యం కారాదు" అని శంకరుడు ఆదేశించాడు.

ప్రపంచానికే తొలి ప్రకృతిశాస్త్రవేత్త అయిన ఉద్దాలకుడు మన దేశంలోనే జీవించాడు అని గర్వపడితే చాలదు. ప్రస్తుత పాలకవర్గాలు వేదాల్లోనే సమస్త జ్ఞానమూ ఉందని, సనాతన ధర్మమే ఆచరణీయం అని ప్రచారం పెద్ద ఎత్తున చేస్తున్నాయి. పైగా భిన్న అభిప్రాయాలను వ్యక్తం చేయడాన్ని సహించలేకపోతున్నాయి. ఇది ఫాసిజం లక్షణం. ఆనాటి ఆధిపత్య, మనువాద శక్తుల్ని ఎదుర్కొని ఉద్దాలకుడు తన దృక్పథాన్ని ప్రచారం చేసిన స్ఫూర్తి నేడు మనకు అవసరం. ఆధునిక సైన్సును అటు కార్పొరేట్ వ్యాపార దోపిడీ నుండి ఇటు మనువాద శక్తులనుండి కాపాడుకుని పురోగమించేందుకు మనం పూనుకోవాలి.

**(ప్రొ. దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ వ్యాసం "ఇండియాస్ రేషనల్ హెరిటేజ్ – రేషనల్ అండ్ ఎంపిరిసిస్ట్ ఎలిమెంట్స్" అన్న వ్యాసం ఆధారంగా)**

❈

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, issue: 11 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# గొప్ప విప్లవ కారుల విప్లవ సారాన్ని హరించడానికి పాలక వర్గాలు నిత్యం ప్రయత్నిస్తాయి

– లెనిన్



గొప్ప విప్లవకారులు జీవించి ఉన్నప్పుడు వారిని వెంటాడి, వేటాడి వారి సిద్ధాంతాలను ధూషించి, ద్వేషించి, అబద్ధాలతో దుష్ప్రచారాలు చేసిన పాలక వర్గాలే వారు చనిపోయిన తరువాత వారిని ప్రమాదం లేని చిహ్నాలుగా మార్చడానికి ప్రయత్నిస్తారు. పీడిత ప్రజలను 'ఓదార్చడానికి' వారి విగ్రహాలు నిర్మించి మోసగిస్తారు. అదే సమయంలో విప్లవకారుల విప్లవ సిద్ధాంత సారాన్ని హరించడానికీ, దాని విప్లవ చైతన్యాన్ని మొద్దుబార్చడానికీ, ఆ సిద్ధాంతాన్నే వికృతపరడానికీ ప్రయత్నిస్తారు.

----

మార్క్సిస్టు తాత్విక సూత్రాలను సంస్కరించబూనుకునే సకల ప్రయత్నాలనూ, సోషలిజాన్ని ఒక కొత్తరకం మతంగా ప్రదర్శించే సకల ప్రయత్నాలనూ తీవ్రంగా ప్రతిఘటించాలి.

----

కార్మికుల వార్తాపత్రిక సమరశీలంగా ఉండాలి. అగ్రభాగంలో నడవాలి. సమస్యలను సూటిగా ఎదుర్కోవాలి. కార్మికవర్గ ప్రయోజనాలకూ, విప్లవానికీ హాని చేసేవాళ్లను ఎండగట్టాలి.

----

సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి. తమ తమ దేశాల బూర్జువా వర్గాలకు వ్యతిరేకంగా కార్మికవర్గమూ, శ్రామిక జనాలూ చేసే యుద్ధంగా మార్చండి.

----

సామ్రాజ్యవాదం మానవజాతిని సోషలిస్టు విప్లవానికి నడిపిస్తుంది. సోషలిస్టు విప్లవాన్ని ఈనాటి అత్యవసర కర్తవ్యంగా చేస్తుంది. సామ్రాజ్యవాదం అనేది సోషలిస్టు విప్లవ ప్రాంగణం.

----

ఇతర జాతులను అణచివేసే జాతి స్వేచ్ఛగా ఉండగలుగుతుందా? ఉండలేదు.

----

**చిరునామా**
**మేనేజర్,**
మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422

**చందా వివరాలు**
విడిపత్రిక: రూ.15, సంవత్సర చందా:రూ.150, పోస్టు ద్వారా రూ. 180 పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

పోస్టు స్టాంపు

ఇంటి నెంబరు ..........................................
వీధి..........................................
గ్రామం..........................................
మండలం లేదా పట్టణం..........................................
జిల్లా..........................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.